సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 137
సోమవారం 7-8-2023


'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'


గెలుపు మలుపు విండీస్‌దే
రెండో టీ20 మ్యాచ్‌లోనూ ఓడిన భారత్. 2 వికెట్లతో నెగ్గిన విండీస్. - 12లో


ఎలా ఉన్నా 'బంగారమే'!
ఫిజికల్, డిజిటల్ బంగారంతో అనుకూలతలు - 13లో


SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


సముచిత స్థానమే కానీ..
మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌తో ఓ కార్యక్రమంలో వేదిక పంచుకున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. - వివరాలు 6లో


ఆగని మణిపూర్ అల్లర్లు
మణిపూర్‌లో అల్లరిమూక మళ్లీ హింసకు పాల్పడింది. భద్రతా సిబ్బంది బాష్పవాయువు ప్రయోగించి పరిస్థితిని అదుపులోకి తెచ్చింది. - వివరాలు 6లో


ఇండిగో విమానంలో ఏసీ బంద్
ఇండిగోకు చెందిన చండీగఢ్-జైపూర్ విమానంలో ఏసీ పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఉక్కపోతతో తీవ్ర అవస్థలు పడ్డారు. - వివరాలు 6లో


వోయేజర్-2కు మళ్లీ జీవం!
46 ఏళ్ల క్రితం ప్రయోగించిన వోయేజర్-2 వ్యోమనౌక మళ్లీ యధాతథంగా పనిచేయడం ప్రారంభించింది. - వివరాలు 6లో



అగ్గి గళం ఆగిపోయింది

ప్రజాగాయకుడు గద్దర్ కన్నుమూత

2లో

వాగ్గేయకారుడా.. కన్నీటి వందనం

గోసి గొంగడి పాట
కాలి గజ్జెల మోత
చేత ఎర్రజెండా
పిక్కటిల్లే రేల గొంతుక.. గద్దర్

వసంతకాల మేఘ గర్జన
కదనుతొక్కే ప్రజావాహిక
జన కేతన.. నవ చేతన.. గద్దర్

పల్లవొక తూటా
చరణమొక ఫిరంగి
వేదిక పై వాగ్గేయకారుడు
పెత్తందార్ల వెన్నులో చలి.. గద్దర్

తెలంగాణ సింగడి
దండకారణ్య పచ్చనాకు
బొగ్గుబావి దీపం
రైతుకూలీ కొడవలి.. గద్దర్

పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలం
శ్రమజీవి పాదంపై చెరగని పుట్టుమచ్చ
అతడు చరిత్ర.. జనగళ యుద్ధనౌక.. గద్దర్

ఈ నేల మళ్లీ కనలేని పాట గద్దర్.
మన పాల్ రాబ్సన్. మన విక్టర్ జారా.
మన బాబ్ మార్లీ. ఒకే ఒక్కడు గద్దర్.
నోరులేని పేదలకు గొంతునిచ్చినవాడా
మహా కవీ... అమర గాయకుడా..
నీకు వీడ్కోలు... రేల పూల మాల.

గదర్ అంటే విప్లవం

బతికుంటే మళ్లీ వస్తా..

మేస్త్రీ కొడుకును..

బ్యాంకు ఉద్యోగిగా..

'బండెనక బండికట్టి'తో వెండితెరపైకి...

25 ఏళ్లుగా వెన్నులో బుల్లెట్‌తో..

70 ఏళ్ల వయసులో ఓటర్‌గా..

వివరాలు 2లో

దశాబ్దాలపాటు ఉద్యమ పాటలతో చైతన్య స్ఫూర్తి నింపిన గద్దర్

కొన్నాళ్లుగా అనారోగ్యంతో సతమతం

4 రోజుల క్రితమే గుండె ఆపరేషన్

కిడ్నీలు, ఊపిరితిత్తుల సమస్యలూ తోడు కావడంతో పరిస్థితి విషమించి మృతి

అభిమానుల సందర్శనార్థం ఎల్‌బీ స్టేడియానికి భౌతిక కాయం

కడసారి చూపుకోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నేతలు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు

నేడు ఉదయం ర్యాలీగా గన్‌పార్కుకు.. అక్కడి నుంచి భూదేవి నగర్‌లోని స్వగృహానికి ర్యాలీగా తరలింపు

సాయంత్రం మహాబోధి విద్యాలయంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

మా అమ్ములపొదిలో ఎన్నో అస్త్రాలు



అవి తీస్తే విపక్షాలు గాలికి కొట్టుకుపోవాల్సిందే
మళ్లీ అధికారం మాదే.. 7-8 సీట్లు ఎక్కువే గెలుస్తాం
అసెంబ్లీలో సీఎం కేసీఆర్

- వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఎవరికి పిండం పెడతారో చూద్దాం
- తెలంగాణను ముంచింది కాంగ్రెస్ పార్టీయే..
- తెలుగుదేశం హయాంలో మరింత దిగజారిన పరిస్థితులు
- జగన్‌ను కాంగ్రెస్ వేధించడం వల్లే ఆయన సొంత పార్టీ స్థాపించారు
- ఆంధ్రాలో పోవడంతో ఒత్తిడిలో తెలంగాణ ఇచ్చారు..ప్రేమతో కాదు
- దేశం ప్రగతి పథంలోకి వెళ్లకుండా ప్రధాని అడ్డుకుంటున్నారు
- సింగరేణి కార్మికులకు రూ.1,000 కోట్లు బోనస్ ఇవ్వబోతున్నాం

'రాష్ట్ర ఆవిర్భావం, సాధించిన ప్రగతి'పై చర్చకు ముఖ్యమంత్రి జవాబు

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి తమ విజయం ఖాయమని సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ అమ్ముల పొదిలో ఉన్న అస్త్రాలు తీస్తే విపక్షాలు గాలికి కొట్టుకుపోవాల్సిందేనని అన్నారు. ఈసారి ఎన్నికల్లో గతంలో కంటే 7-8 సీట్లు ఎక్కువ వస్తాయని చెప్పారు. అసెంబ్లీలో ఆదివారం 'రాష్ట్ర ఆవిర్భావం-సాధించిన ప్రగతి'పై జరిగిన చర్చకు సీఎం కేసీఆర్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలపై ఆయన మండిపడ్డారు. తనకు పిండం పెడ్తామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారని, ఎన్నికల్లో ప్రజలు ఎవరికి పిండం పెడ్తారో చూద్దాం అంటూ సవాల్ విసిరారు. 'రాహుల్ ఎన్నికల సభలో మోదీపై చేసిన వ్యాఖ్యకు జైలు శిక్ష వేశారు. మరి మీరు ఇక్కడ పిండం పెడ్తామంటూ పిచ్చికూతలు కూస్తున్నారు. మనసుకు బాధేసినా పోలీసులను ఉసిగొల్పకుండా సంయమనం పాటిస్తున్నాం'అని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అంటే ప్రధాని మోదీకి ఎందుకు వ్యతిరేకమో తెలియదని, తల్లిని చంపి పిల్లను బతికించారంటూ వ్యాఖ్యానాలు చేశారని గుర్తుచేశారు. దేశం ప్రగతి పథంలోకి వెళ్లకుండా అడ్డుపడుతున్నారని సీఎం విమర్శించారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

రైతుబంధు మరింత పెంపు..

'కర్ణాటకలో కాంగ్రెస్ అలవికాని హామీలు ఇచ్చింది. వాటిని అమలు చేయలేక అక్కడి సీఎం ఎస్సీ, ఎస్టీ ఫండ్స్ మళ్లిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లలో ఇచ్చే పెన్షన్ ఎంత?.. తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ.4 వేలు పెన్షన్ ఇస్తారా? మేం అలవికాని హామీలివ్వం. గత ఎన్నికల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెబితే.. మేము రూ.లక్ష వరకు చేస్తామని చెప్పాం. మేం 80 సీట్లు గెలిస్తే వాళ్లు 19 సీట్లు గెలిచారు. రెండేళ్ల నుంచి పెన్షన్ రూ.2 వేలు ఇస్తున్నాం. మొదట వెయ్యి ఆ తర్వాత

మిగతా 5వ పేజీలో ▶

దేశమే ఆశ్చర్యపోయేలా ఉద్యోగులకు పేస్కేల్

'దేశమే ఆశ్చర్యపోయేలా ఉద్యోగులకు పేస్కేల్ ఇస్తాం. మాకు మానవీయ దృక్పథం ఉంది. ఉద్యోగ సంఘాలను పిలిచి మాట్లాడాం. త్వరలోనే మధ్యంతర భృతి ఇచ్చి పీఆర్సీని నియమిస్తాం. బ్రహ్మాండంగా జీతాలు పెంచుకుంటాం. రాష్ట్రం ధనికమైతే.. వాళ్లు ధనికులు కావాలి. వారికి నాలుగు రూపాయలు కావాలి. భారత్‌లో అధికంగా వేతనాలు పొందేది తెలంగాణ ఉద్యోగులే. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే వీరికి ఎక్కువ జీతాలు ఇస్తున్నాం..'అని సీఎం చెప్పారు.

ఎస్సై ఫలితాల వెల్లడి



587 ఉద్యోగాలకు 434 మంది పురుషులు, మహిళలు 153 మంది ఎంపిక

- నేడు వెబ్‌సైట్‌లో తుది ఎంపిక అభ్యర్థుల జాబితా
- నియామక బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు వెల్లడి

10లో

ఆర్టీసీ బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం



ఆమోదించిన ఉభయ సభలు
బిల్లుపై ఉత్కంఠకు తెర
ఆ రెండు వార్డులూ తిరిగి గ్రామ పంచాయతీలుగా..

సాక్షి, హైదరాబాద్: రాజకీయ, ప్రభుత్వ వర్గాల్లో కొన్ని గంటల పాటు ఉత్కంఠ రేపిన ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లు కథ సుఖాంతమైంది. ఆదివారం ఉభయసభలు బిల్లును ఆమోదించాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు గవర్నర్ నుంచి ఈ బిల్లుకు గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. కొన్ని అంశాలపై సూచనలు చేస్తూ.. గవర్నర్ ముసాయిదా బిల్లును సభలో ప్రవేశ పెట్టడానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో.. రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఉభయ సభల్లోనూ బిల్లును ప్రవేశపెట్టగా సభలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. దీంతో పాటు బాన్సువాడ మున్సిపాలిటీ నుంచి కోయగుట్ట తండా వార్డును, ఆలేరు మున్సిపాలిటీలోని సాయిగూడెం వార్డును తొలగించి విడిగా గ్రామపంచాయతీలుగా చేస్తూ రెండు బిల్లులకు కూడా సభలు ఆమోదం తెలిపాయి. దీనికి సంబంధించిన బిల్లులను మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, పీఆర్ శాఖ మంత్రి ఎర్రబెల్లి తరఫున శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సభ ముందు పెట్టారు. ఆర్టీసీ బిల్లుతో పాటు ఈ రెండు బిల్లులకు ఆమోదం తెలుపుతున్నట్టు శాసనసభలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మండలిలో చైర్మన్

మిగతా 5వ పేజీలో ▶

'విలీనానికి' అనుమతి



- ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్
- రాష్ట్ర ప్రభుత్వానికి పలు సిఫారసులు
- ప్రభుత్వమే ఆర్టీసీ నిర్వహణను, భారాన్ని తీసుకోవాలి
- భూములు, ఆస్తులపై హక్కులు ఆర్టీసీతోనే కొనసాగాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ప్రతిపాదించిన ఆర్టీసీ చట్ట సవరణ బిల్లు-2023కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర రవాణా శాఖ, ఆర్టీసీ అధికారులతో ఆదివారం రాజ్‌భవన్‌లో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం పలు సిఫారసులతో బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టేందుకు అనుమతించారు. దీంతో విలీనంపై

మిగతా 5వ పేజీలో ▶

గవర్నర్‌కు జ్ఞానోదయం అయినందుకు సంతోషం: సీఎం

ఆర్టీసీ బిల్లుకు ఆమోదం తెలిపినందుకు ధన్యవాదాలు

సాక్షి, హైదరాబాద్: 'ఆర్టీసీ బిల్లు విషయంలో గవర్నర్ పాపం తెలిసో తెలియకో అనవసరంగా వివాదం కొని తెచ్చుకున్నారు. ఎందుకు పని పెట్టుకున్నారో తెలియదు. 96 క్లారిఫికేషన్లు అడిగారు. ఆ అంశాలన్నింటినీ ప్రభుత్వం పరిశీలించి, పరిగణనలోకి తీసుకున్నవే. మొత్తం మీద గవర్నర్‌కు జ్ఞానోదయమై ఆదివారం మధ్యాహ్నం బిల్లుకు ఆమోదం తెలిపి పంపినందుకు సంతోషం. ప్రభుత్వం, ఆర్టీసీ ఉద్యోగుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాం..' అని సీఎం కేసీఆర్ అన్నారు. ఆదివారం అసెంబ్లీలో ఈ అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడారు. 'ఆర్టీసీని పెట్టిందే ప్రజారవాణా ఉండాలని. కాలక్రమేణా సంస్థ నష్టాల్లో పడింది. నేను రవాణా మంత్రిగా అంకితభావంతో పనిచేసి రూ.14 కోట్ల నష్టంలోని సంస్థను రూ.14 కోట్ల లాభాల్లోకి తెచ్చా. శక్తిసామర్థ్యాలుంటే సంస్థ నష్టాలను పూడ్చవచ్చు. కానీ డీజిల్ ధరల పెరుగుదలతో పరిస్థితి చేయిదాటింది. తమను

మిగతా 5వ పేజీలో ▶



విపక్షాలను సర్కార్ వేధిస్తోంది

కార్యకర్తలపై కేసులు పెడుతున్నారు
సీఎం కేసీఆర్ ఇకనైనా వీటిని ఆపాలి
శాసనసభలో ఈటల రాజేందర్

సాక్షి, హైదరాబాద్: 'విపక్ష ఎమ్మెల్యేలను ఇబ్బంది పెడుతున్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్నారు. దీనిని ఇకనైనా ఆపాలని సీఎం కేసీఆర్‌ను కోరుతున్నా. మమ్మల్ని అవమానించడం అంటే మా ప్రజలను అవమానించడమే. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. మా హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంది'అని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్ర ప్రగతిపై ఆదివారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. వరదల్లో మరణించిన వారి కుటుంబాలకు, ఇళ్లు, ఆస్తులు నష్టపోయిన వారికి తక్షణమే పరిహారం చెల్లించాలని సూచించారు. పొలాలు కోతకు గురయ్యాయని, ఇసుక మేటలు వేశాయని, పొలాలను బాగు చేసుకోవడానికి గతంలో సీఎం చేసిన ప్రకటన మేరకు ఎకరాకు రూ.10 వేలు చొప్పున రైతులకు సహాయం చేయాలని

మిగతా 3వ పేజీలో ▶



అసైన్డ్ భూములను లాక్కుంటున్నారు

- ప్లాట్లు వేసి సర్కార్ అమ్ముకుంటోంది
- పీజీ చదివిన యువత ఉద్యోగాల్లేక సోడా, ఇస్త్రీ షాపులు నడుపుతున్నారు
- డబుల్ బెడ్‌రూం ఇళ్లకోసం లక్షల మంది నిరీక్షిస్తున్నారు
- ప్రాజెక్టులు కట్టారు.. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు మరిచారు
- తెలంగాణ ప్రగతిపై చర్చలో భట్టి

సాక్షి, హైదరాబాద్: గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను ఈ ప్రభుత్వం లాక్కుంటోందని సీఎల్పీనేత భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామాల్లో శ్మశానవాటికలు, ఇతర అవసరాలకు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఫార్మా సిటీ, పారిశ్రామికవాడల నిర్మాణం కోసం వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం అరకొర పరిహారం చెల్లించి తీసుకుందని ఆరోపించారు. ఒక్క ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోనే 10 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం సేకరించిందన్నారు. ఈ ప్రాంతంలో

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి





కుటుంబ పాలన 'క్విట్ ఇండియా'

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన

విపక్షాలు ప్రతికూల రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజం

508 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి శంకుస్థాపన

"క్విట్ ఇండియా వార్షికోత్సవం ఒక చరిత్రాత్మక దినం. దేశ స్వాతంత్య్ర పోరాటంలో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చిన రోజు. ఇప్పుడు దేశమంతా క్విట్ ఇండియా అంటూ బిగ్గరగా నినదిస్తోంది. అవినీతి, కుటుంబ పాలన, బుజ్జగింపు రాజకీయాలు వంటివి దేశం వదిలి వెళ్లిపోవాలని ఆకాంక్షిస్తోంది. గతేడాది లాగే ఈసారి కూడా దేశ ప్రజలంతా ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి.
- ప్రధాని మోదీ

6లో

మిగులు నుంచి లోటుకు..



కానీ 2020-21తో పోలిస్తే 2021-22లో తగ్గిన రెవెన్యూ, ద్రవ్యలోటు
2021-22 ఆర్థిక సంవత్సర అకౌంట్ల నిర్వహణపై కాగ్ నివేదిక

అసెంబ్లీ ముందుంచిన ప్రభుత్వం

ఎఫ్ఆర్‌బీఎం లక్ష్యాల్లో ఒక్కటీ నెరవేరలేదన్న కాగ్

ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి జీఎస్‌డీపీలో 27.40 శాతం అప్పులు

వేజ్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్టుల ద్వారా 259 రోజులు గట్టెక్కారు

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ రాష్ట్రం 2018-19 వరకు రెవెన్యూ మిగులు రాష్ట్రంగా ఉంది. కానీ ఆ తర్వాత క్రమంగా రెవెన్యూ లోటు నమోదయింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.9,335 కోట్ల రెవెన్యూ లోటు, రూ.46,639 కోట్ల ద్రవ్యలోటు ఏర్పడింది. మిగులు నుంచి లోటుకు వెళ్లినా అంతకుముందు ఏడాదితో పోలిస్తే రెవెన్యూ, ద్రవ్యలోటు పరిమాణం కాస్త తగ్గింది. 2020-21లో రెవెన్యూ లోటు రూ.22,298 కోట్లు కాగా, ద్రవ్యలోటు రూ.49,038 కోట్లుగా ఉంది. 2021-22లో నమోదైన రెవెన్యూ లోటు జీఎస్‌డీపీలో 0.81 శాతం కాగా, ద్రవ్యలోటు 4.06 శాతంగా నమోదయింది. అదే రెవెన్యూ రాబడులతో పోలిస్తే 27 శాతం ద్రవ్యలోటు ఏర్పడింది..'అని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను అకౌంట్ల నిర్వహణకు సంబంధించిన పరిశీలన అనంతరం కాగ్ రూపొందించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం.. వర్షాకాల సమావేశాల చివరిరోజు ఆదివారం శాసనసభ, మండలి ముందు ఉంచింది. ఈ నివేదికలో వివిధ ప్రభుత్వ శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు, వేజ్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్టులకు వెళ్లి ప్రభుత్వం తెచ్చుకున్న అడ్వాన్సులు, పద్దుల వారీగా చూపెట్టాల్సిన ఖర్చుల్లో తేడాలు, చూపెట్టిన నగదు నిల్వ, ఖర్చుల్లో తేడాలు, రెవెన్యూ రాబడులు, ప్రభుత్వ అప్పుల

మిగతా 10వ పేజీలో ▶

మెదక్ జిల్లా తూప్రాన్‌లోని గద్దర్ నివాసం..



మేస్త్రీ కొడుకును..

మెదక్: మాది మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామం. రెండు చెరువులు, ఏడు నీటి గుంటలు, పచ్చని పైర్లు.. అన్ని రకాల కులవృత్తుల వారు ఉండేవారు. గుడి, బడితో నా ఊరు ఎప్పుడు కళకళలాడుతుండేది. మా నాన్న గుమ్మడి శేషయ్య మేస్త్రీ. పనినిమిత్తం ఊరూరా తిరిగేవారు. ఎక్కువగా ఉత్తరప్రదేశ్‌లో పనిచేశారు. అక్కడ కట్టించిన మలింద విద్యాలయం నిర్మాణంలో మా నాన్న పనిచేశారు. అంబేడ్కర్‌ను దగ్గర నుంచి చూశారు. ఆయన ప్రభావంతోనే మా నాన్న తినడానికి తిండి లేకపోయినా బిడ్డల్ని స్కూల్‌కు పంపేవాడు. సంతకం పెట్టడం రాకపోయినా హిందీ, మరాఠీ, ఉర్దూ భాషల్లో మాట్లాడేవారు. ఏడాదిలో నెల రోజుల కంటే ఎక్కువ రోజులు ఊళ్లో ఉండేవారు కాదు. నాకు ఒక అన్నయ్య ముగ్గురు అక్కాచెల్లెలు ఉన్నారు. అమ్మ, అన్నయ్య ఊర్లోనే ఉండేవారు. అమ్మ పనికి వెళ్లేది. నేను అజ్ఞాతంలో ఉన్నప్పుడు అమ్మని చూడడానికి మారువేషంలో వెళ్లేవాడిని. అమ్మ చనిపోయినప్పుడు నా చిన్న కొడుకు కూడా చనిపోయాడు.

గుండెచప్పుడు ఆగలేదు.. గుండెకే గాయమైంది

గద్దర్ చివరి లేఖ

సాక్షి, హైదరాబాద్: ఆస్పత్రిలో చేరిన తర్వాత గద్దర్ చివరగా ఒక లేఖ రాశారు. ''గుమ్మడి విఠల్ నాపేరు. గద్దర్ నాపాట పేరు. నా బతుకు సుదీర్ఘ పోరాటం. నా వయస్సు 76 ఏళ్లు. నా వెన్నుపూసలో ఇరుక్కున్న తూటా వయస్సు 25 ఏళ్లు. పీపుల్స్‌మార్చ్ పాదయాత్రకు మద్దతుగా 'మా భూములు మాకే' నినాదంతో ఆ యాత్రలో ఇటీవల నేను పాల్గొన్నాను. నా పేరు జనం గుండెలచప్పుడు. నా గుండె చప్పుడు ఆగిపోలేదు. కానీ ఎందుకో గుండెకు గాయమైంది. ఈ గాయానికి చికిత్స కోసం అమీర్‌పేటలోని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌లో చేరా. జూలై 20వ తేదీ నుంచి అన్నిరకాల పరీక్షలు, చికిత్సలు తీసుకుంటూ కుదుటపడుతున్నాను..'' అంటూ తన అభిమానులకు లేఖ రాశారు.



అపోలోలో జానాతో ఉల్లాసంగా..

విమానం ఎక్కలేదు.. విదేశాలకు పోలేదు

మంచిర్యాలఅర్బన్: గద్దర్ గళం..దేశవిదేశాల్లో ఎందరో అభిమానాన్ని చూరగొన్నది. ఆయన పాట వినేందుకు విదేశాల నుంచి అభ్యుదయ, సాంస్కృతిక సంఘాల నుంచి ఆహ్వానం వచ్చినా విమానం ఎక్కి వెళ్లలేకపోయారు. 1997, ఏప్రిల్ 6న ఆయనపై కాల్పులు జరగ్గా, ఆరు బుల్లెట్లు శరీరంలోకి చొచ్చుకుపోయాయి. ఐదు బుల్లెట్లను తొలగించిన వైద్యులు, వెన్నుపూసలో ఉన్న మరో బుల్లెట్ తొలగిస్తే ప్రాణానికే హాని ఉంటుందని చెప్పారు. దీంతో అప్పటి నుంచి ఆ బుల్లెట్ శరీరంలోనే ఉండిపోయింది. దేశంలో ఇతర రాష్ట్రాల పర్యటనకు ఎయిర్‌పోర్ట్‌కు గద్దర్ వెళ్లినా, తనిఖీల్లో స్కానర్‌లో బుల్లెట్ చూపడం, అధికారులకు సమాధానం చెప్పడంలో అనేకసార్లు ఇబ్బంది పడినట్టు తెలిసింది. శరీరంలో బుల్లెట్, కేసులు పాస్‌పోర్టు జారీకి అడ్డంకిగా మారాయి. దీంతో ఎన్ని ఆహ్వానాలు వచ్చినా విమానం ఎక్కి విదేశాలకు వెళ్లలేకపోయారు.

- 1980 సమయంలో నక్సల్స్‌తో కలసి అజ్ఞాతంలోకి వెళ్లారు.
- పీపుల్స్‌వార్ పార్టీ నిర్ణయం మేరకు 1982లో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి కాలపు జననాట్యమండలి సభ్యుడిగా పనిచేశారు.
- 1990 ఫిబ్రవరి 18న తిరిగి బహిరంగ జీవితంలోకి అడుగుపెట్టారు.
- 1995లో పీపుల్స్‌వార్ పార్టీ గద్దర్‌ను బహిష్కరించింది. ఆయన తీవ్రంగా ఆవేదనకు గురవడంతో తిరిగి పార్టీలోకి ఆహ్వానించింది.

అగ్గిగళం ఆగిపోయింది

ప్రజా గాయకుడు గద్దర్ కన్నుమూత



సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్

తన పాటలతో ప్రజా బాహుళ్యాన్ని ఉర్రూతలూగించిన ప్రజా గాయకుడు గుమ్మడి విఠల్ అలియాస్ గద్దర్ ఇక లేరు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గత నెల 20న గుండె పోటుతో అమీర్‌పేటలోని అపోలో స్పెక్ట్రా ఆస్పత్రిలో చేరారు. గుండె రక్తనాళాలు మూసుకుపోయినట్టు నిర్ధారించిన వైద్యులు ఈ నెల 3న శస్త్రచికిత్స చేసి సరిచేశారు. కానీ ముందు నుంచే మూత్ర పిండాలు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. 'ఆదివారం ఉదయం అకస్మాత్తుగా రక్తపోటు పెరిగింది. షుగర్ లెవల్స్ పడిపోయాయి. మధ్యాహ్నానికల్లా శరీరంలోని పలు అవయవాలు పనిచేయడం ఆగిపోయాయి. ఆయనను కాపాడేందుకు ప్రయత్నించినా.. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తుదిశ్వాస విడిచారు..''అని ఆస్పత్రి అధికారులు హెల్త్ బులెటిన్‌లో వెల్లడించారు.

అభిమానుల కోసం ఎల్బీ స్టేడియానికి..

గద్దర్ భౌతిక కాయాన్ని అభిమానుల సందర్శనార్థం సాయంత్రం 5 గంటల సమయంలో ఎల్బీ స్టేడియానికి తరలించారు. పెద్ద సంఖ్యలో నేతలు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు అక్కడికి చేరు కుని నివాళులు అర్పించారు. మంత్రి కేటీఆర్, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మధుయాష్కీ, ఎమ్మెల్యే సీతక్క, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ప్రజా గాయకురాలు విమలక్క తదితరులు నివాళి అర్పించి గద్దర్ సతీమణిని ఓదార్చారు. జోహార్ గద్దర్, అమర్ రహే గద్దరన్న అంటూ అభిమానులు చేసిన నినాదాలతో ఎల్బీస్టేడియం హోరెత్తింది.

నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

గద్దర్ భౌతికకాయానికి పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ మేరకు గద్దర్ స్థాపించిన మహాబోధి విద్యాలయంలో సోమవారం సాయంత్రం ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. తొలుత సోమవారం ఉదయం గద్దర్ భౌతికదేహాన్ని అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్కు వద్ద కొద్దిసేపు ఉంచి నివాళులు అర్పించనున్నారు. తర్వాత నెక్లెస్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు, తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు అల్వాల్ వెంకటాపూర్ భూదేవీనగర్‌లోని ఆయన స్వగృహానికి తరలించనున్నారు. అక్కడ స్థానికుల సందర్శనార్థం కాసేపు ఉంచి.. మహాబోధి విద్యాలయంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

25 ఏళ్లుగా వెన్నులో బుల్లెట్‌తో



గద్దర్‌పై చాలా సార్లు హత్యాయత్నాలు జరిగాయి. నల్లదండు ముఠా, బ్లాక్ టైగర్స్, గ్రీన్ టైగర్స్ ముఠాలు ఆయనను చంపడానికి ప్రయత్నించాయి. ఉమ్మడి ఏపీకి చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో 1997 ఏప్రిల్ 6న గద్దర్‌పై హత్యాయత్నం జరిగింది. గ్రీన్‌టైగర్స్ పేరుతో కొందరు ఆగంతకులు ఆయనపై కాల్పులు జరిపారు. ఆయన ప్రాణాలకు ప్రమాదమని ఒక బుల్లెట్‌ను వదిలేశారు. దీనితో దాదాపు 25 ఏళ్లుగా ఆ బుల్లెట్ గద్దర్ ఒంట్లోనే ఉండిపోయింది.

''రాష్ట్ర అణచివేతకు చిహ్నంగా నా వెన్నెముకలో బుల్లెట్ అలాగే ఉంది. దానితో నాకు భయమేమీ లేదు, ఏ ప్రభావమూ పడలేదు. నా లక్ష్యాలకు కట్టుబడి ప్రజల కోసం పనిచేస్తూనే ఉన్నా.. పనిచేస్తూనే ఉంటా..'' అని గద్దర్ తరచూ గుర్తు చేసుకునేవారు.

70 ఏళ్ల వయసులో.. ఓటర్‌గా నమోదై..



నక్సల్, మావోయిస్టు ఉద్యమ పంథాలో నడిచిన గద్దర్.. బూర్జువా పార్టీల, ఎన్నికల వ్యవస్థలో పాలు పంచుకోబోనంటూ ఓటర్‌గా కూడా నమోదు చేసుకోలేదు. మావోయిస్టుల నుంచి దూరమైన తర్వాత 2018లో తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకుని.. ఆ ఏడాది డిసెంబర్ 7న జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేశారు. ''పోరాటం అంటే తుపాకుల పట్టుకోవడం కాదు.. తిరుగుబాటు చేయడం అని గుర్తించి ప్రజా జీవితంలోకి వచ్చా. రాజ్యాంగమే మనకు రక్ష అన్న విషయాన్ని తెలుసుకుని మొదటిసారి ఓటు హక్కును తీసుకున్నా.. 70 ఏళ్ల నిండాక తొలిసారి ఓటు వేశా. ఓట్ల యుద్ధానికి సిద్ధమయ్యే క్రమంలో గోచీ, గొంగడి, గజ్జెలు జమ్మిచెట్టు మీద పెట్టిన..'' అని ఆ సమయంలో గద్దర్ ప్రకటించారు.

– తర్వాత ఆయన 'గద్దర్ ప్రజాపార్టీ' పేరిట ఒక రాజకీయ పార్టీని కూడా స్థాపించారు. రాజ్యాంగ పరిరక్షణ దిశగా ఉద్యమాన్ని కొనసాగిస్తానని ప్రకటించారు. మావోయిస్టులు కూడా తమ వ్యూహాన్ని మార్చుకోవాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

గోచీ, గొంగళి.. చేతి కర్ర, ఎర్ర జెండా..

గద్దర్ పాటకు ఎంత ప్రాచుర్యం ఉందో, ఆయన ఆహార్యానికీ అంతే ప్రాముఖ్యత ఉంది. ఒంటిపై చొక్కా లేకుండా గొంగళి కప్పుకుని, ఎర్ర జెండా చుట్టిన కర్రతో, కాళ్లకు గజ్జెలు కట్టి గద్దర్ స్టేజీపై ఆడి, పాడుతుంటే లక్షలాది మంది కళ్లు, చెవులు అప్పగించేసేవారు. జీరబోయిన గొంతుతో పాటకట్టే విధానానికి లక్షల మంది అభిమానులు ఉన్నారు. మావోయిస్టు ఉద్యమానికి దూరమైన తర్వాత గద్దర్ వేషధారణ సైతం మారింది. పలుమార్లు ప్యాంట్, షర్ట్, కోట్‌లోనూ కనిపించారు.



గద్దర్ భౌతికకాయం...

బుర్రకథలతో చైతన్య పరుస్తూ..

ఉమ్మడి మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన లక్ష్మమ్మ, శేషయ్య దళిత దంపతులకు 1949లో గద్దర్ జన్మించారు. అసలు పేరు గుమ్మడి విఠల్‌రావు. సొంత ఊరిలోనే ఏడో తరగతి వరకు చదివిన ఆయన.. తర్వాత నిజామాబాద్ జిల్లా బోధన్‌లో, వరంగల్‌లో పైచదువులు కొనసాగగా.. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదివారు. గ్రామంలో ఉన్నప్పుడే ఒగ్గుకథ, బుర్ర కథ, ఎల్లమ్మ కథలు, భాగవత రూపంలో రైతులు, కార్మిక లోకాన్ని చైతన్య పరిచారు. 1969 తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చురుగ్గా పాల్గొన్నారు. ఊరూరా తిరిగి బుర్రకథల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఆయన ప్రదర్శనను చూసిన సినిమా దర్శకుడు బి.నర్సింగరావు భగత్‌సింగ్ జయంతి రోజున గద్దర్‌తో ఒక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. తర్వాత ప్రతి ఆదివారం గద్దర్ తన ప్రదర్శనలు ఇచ్చేవారు. 1971లో నర్సింగరావు ప్రోత్సాహంతో గద్దర్ తన మొదటి పాట 'ఆపరా రిక్షా'రాశాడు.

గదర్ అంటే విప్లవం



బ్యాంక్ ఉద్యోగిగా..

సిక్కు కూలీలు, పనివాళ్లు పెట్టుకున్న పార్టీ పేరు గదర్.. గదర్ అంటే విప్లవం అని అర్థం. దీని నుంచి స్ఫూర్తి పొంది ఆయన రాసిన పాటల మొదటి ఆల్బంకు గదర్ అని పెట్టారు. ఇది ప్రజల్లోకి వెళ్లి ఆయన గద్దర్‌గా నిలిచిపోయారు. 1975లో కెనరా బ్యాంకులో క్లర్క్‌గా పనిచేస్తున్న సమయంలోనే ఆయన నక్సల్ మార్గం పట్టారు. 1982లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి.. ఉద్యమ బాట పట్టారు. 1985లో కారంచేడులో దళితుల హత్యలకు వ్యతిరేకంగా పోరాడారు. జన నాట్య మండలిలో చేరారు. ఒగ్గు కథలు, బుర్ర కథల ద్వారా గ్రామీణ ప్రజల్లోకి వెళ్లారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చారు. ప్రజా సమస్యలపై పాటల రూపంలో కోట్ల మంది హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.

మహాబోధి విద్యాలయ ఏర్పాటు

అల్వాల్: స్థిరమైన జీవితం లేదని చాలాచోట్ల వలస కార్మికుల పిల్లలను బడిలో చేర్చుకునేవారు కాదు. దీంతో గద్దర్ అందరికీ విద్య అందించాలన్న సంకల్పంతో భూదేవినగర్‌లో మహాబోధి విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆయన సతీమణి విమల, కూతురు వెన్నెల ఈ పాఠశాల బాధ్యతలు చూసుకుంటున్నారు.




వంగపండుతో..





గోరటి పాట.. గద్దర్ ఆట




ఉద్యమ సమయంలో..



ఉద్యమ నేతతో..








రాహుల్‌తో ఆప్యాయంగా..



యాదాద్రిలో...

ప్రజాగాయకుడు గద్దర్ సినిమా రంగంపైనా తనదైన ముద్ర వేశారు. సాయిచంద్ హీరోగా గౌతమ్ ఘోష్ దర్శకత్వం వహించిన 'మా భూమి'(1979) సినిమాలో తొలిసారి వెండితెరపై పాట పాడటంతోపాటు నటించారాయన. ఈ సినిమాలో 'బండెనక బండి కట్టి..' అనే పాటలో గద్దర్ కనిపిస్తారు. ఆ తర్వాత బి.నర్సింగరావు నటించి, దర్శకత్వం వహించిన 'రంగుల కల'(1983) చిత్రంలో ఓ ప్రధానపాత్ర పోషించారు. జగపతి బాబు హీరోగా ఎన్.శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ'(2011) మూవీలో కీలకపాత్రలో నటించారాయన. ఆర్.నారాయణ మూర్తి నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'దండకారణ్యం'(2016), సుడిగాలి సుధీర్ నటించిన 'సాఫ్ట్‌వేర్ సుధీర్'(2019), చిరంజీవి హీరోగా మోహన్‌రాజా తెరకెక్కించిన 'గాడ్ ఫాదర్'(2022) సినిమాల్లోనూ నటించారు. ఆర్.నారాయణమూర్తి హీరోగా దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన 'ఒరేయ్ రిక్షా' సినిమాలో గద్దర్ పాటరాయగా, 'వందేమాతరం' శ్రీనివాస్ స్వరపరిచి, గానం చేసిన 'మల్లెతీగకు పందిరి వోలే..' పాట అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని తెలిపే పాటల్లో ఒకటిగా నిలిచింది. 'జై బోలో తెలంగాణ' మూవీ కోసం గద్దర్ రాసిన 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా..' పాట సూపర్ హిట్ అయ్యింది. ఈ రెండు పాటలకు నంది అవార్డులు(రచయిత, గాయకుడుగా) గద్దర్‌కు వచ్చాయి.



'మా భూమి'లో..

'బండెనక బండి కట్టి'తో వెండితెరపైకి..

గద్దర్‌కు రెండు నంది అవార్డులు

విప్లవ ఉద్యమంలో ఉన్నవారు అవార్డులు, రివార్డులు తీసుకోకూడదనే నిబంధన ఉండటంతో నంది అవార్డులు తీసుకోలేదని గద్దర్ ఓ సందర్భంలో చెప్పారు. ఇటీవల విడుదలైన ఆర్.నారాయణమూర్తి 'యూనివర్సిటీ' చిత్రంలోనూ ఆయన పాటలు రాశారు. ఇవే కాదు, ఆయన రాసిన మరికొన్ని పాటలు సినిమాల్లో ప్రేక్షకులను అలరించాయి. 'నేను రాసిన వేల వేల పాటలకు నా భార్య విమలే స్ఫూర్తి అని గద్దర్ గతంలో 'సాక్షి'కి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. దివంగతనేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి తన పాటలంటే ఎంతో ఇష్టమని, ఆయనపై వ్యతిరేకంగా పాడినా మెచ్చుకునేవారని 2017 జూన్‌లో 'మెజార్టీకే రాజ్యాధికారం'అనే కార్యక్రమంలో పాల్గొనేందుకు కడప వచ్చిన సందర్భంలో గద్దర్ అన్నారు. గద్దర్ నటించిన చివరిచిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. సత్యారెడ్డి లీడ్ రోల్‌లో నటించి, స్వీయదర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమం నేపథ్యంలో రూపొందింది. ఈ మూవీలో గద్దర్ కీలక పాత్ర పోషించడంతో పాటు పాటలు రాశారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

కుటుంబమంటే ఎంతో మమకారం



బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న సమయంలోనే గద్దర్ వివాహం చేసుకున్నారు. ఆయన భార్య పేరు విమల. వీరికి ముగ్గురు పిల్లలు. సూర్యకిరణ్, చంద్రకిరణ్ (2003లో అనారోగ్యంతో మరణించారు), కూతురు వెన్నెల. గద్దర్‌కు సరస్వతిబాయి, శాంతాబాయి, బాలమణిబాయి అని ముగ్గురు అక్కలు. నర్సింగ్‌రావు అనే అన్న ఉన్నారు. గద్దర్‌కు కుటుంబమంటే ఎంతో ప్రాణం. భార్య విమల సహకారాన్ని తరచూ గుర్తు చేసుకునేవారు. తాను ఉద్యమంలో ఉన్నప్పుడు కుటుంబానికి, తనకు ఆమె అండగా ఉన్న తీరును చెప్పేవారు.

ఆ పాటలు అగ్ని కణాలు..

అమ్మ కష్టం మొదలు సమాజంలో అనేక విషయాలపై పాటలు రాసిన గద్దర్.. రచయితగా తాను రాసిన అనేక పాటలకు అప్పటికప్పుడు పల్లవులు కట్టేవారు. తొలినాళ్లలో కుటుంబ నియంత్రణ, పారిశుద్ధ్యం వంటి సామాజిక విషయాలపై బుర్రకథల ద్వారా అవగాహన కల్పించేవారు. తర్వాత స్వయంగా పాటలు రాశారు. 1970వ దశకంలో ఉద్యమానికి బాసటగా నిలిచిన జననాట్యమండలితో కలసి గద్దర్ సామాజికంగా దోపిడీకి గురైన వర్గాలకు గొంతుకగా మారారు. 'పోదమురో జనసేనతో కలిసి, పోదమురో ఎర్రసేనతో కలిసి..' అని గద్దర్ రాసి, పాడిన పాట అసంతృప్తితో మండుతున్న యువత నక్సల్ ఉద్యమంలో చేరి తుపాకులు పట్టేలా చేసింది. 1990 ఫిబ్రవరి 18న జననాట్య మండలి ఆధ్వర్యంలో గద్దర్ హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సభకు ఏకంగా 2 లక్షల మంది ప్రజలు హాజరయ్యారు.



విప్లవానికి ఊపిరినిచ్చి.. ఉద్యమానికి ఊపు తెచ్చి..

గద్దర్ పాట అంటేనే ఒక ఉప్పెన.. మొదట్లో బుర్రకథలతో ప్రజలు చైతన్యాన్ని కలిగించినా, నక్సలైట్ల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచినా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చినా.. ఆయన గొంతు సైరన్ మోగించేది. దొరలు, పాలకుల దౌర్జన్యాన్ని ఎదిరించడం నేర్పి వేలాది మంది యువత తుపాకులు చేతపట్టేలా చేసింది. శ్రీకాకుళం సీతంపేట నుండి మొదలైన తిరుగుబాటు పాట జగిత్యాల జైత్రయాత్ర, కల్లోల కరీంనగర్ వరకు సాగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి గద్దర్ పాట ప్రాణం పోసింది. 'అమ్మ తెలంగాణమా.. ఆకలి కేకల రాజ్యామా..'అంటూ ఆయన రాసి, పాడిన పాట.. ధూంధాం కార్యక్రమాలు ఉద్యమకారుల్లో ఉత్సాహం నింపాయి. ప్రతి పల్లె కళాకారుడు గద్దర్ స్ఫూర్తిగా గోచీ, గొంగళి కట్టి నృత్యం చేశారు. ఉద్యమాల్లో అమరులైన వారి కోసం ఏర్పడ్డ బంధుమిత్రుల కమిటీలో గద్దర్ కీలక పాత్ర పోషించారు. ప్రజలు కోరుకున్న తెలంగాణ ఇదికాదంటూ.. ప్రజాస్వామిక తెలంగాణ కోసం మళ్లీ ఉద్యమాన్ని చేపడతానని ప్రకటించారు. వివిధ పార్టీల నేతలనూ కలిశారు.

ఎన్‌కౌంటర్ నుంచి తప్పించిన కానిస్టేబుల్

నక్సల్స్‌పై తీవ్ర అణచివేత కొనసాగుతున్న 1988–90 మధ్య కాలంలో గద్దర్ పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆ సమయంలో ఓసారి గద్దర్, ఇతర మావోయిస్టులు ఎక్కడ ఉన్నారన్నది పోలీసులకు సమాచారం అందింది. పెద్ద సంఖ్యలో పోలీసులు దాడి చేసి గాలించారు. ఆ సమయంలో గద్దర్ ఓ ఇంటి అటకపై దాక్కున్నారు. ఒక కానిస్టేబుల్ అటకపై గద్దర్‌ను చూసినా.. ఎవరూ లేరని అబద్ధం చెప్పడంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. లేకుంటే గద్దర్ ఆరోజే ఎన్‌కౌంటర్ అయ్యేవారు, ఆనాడు కాపాడిన కానిస్టేబుల్ దళితుడని తర్వాత గద్దర్ వెల్లడించారు.

చరమాంకంలో..

తొలి నుంచి పూర్తిస్థాయి మావోయిస్టుగా, సానుభూతిపరుడిగా ఉన్న గద్దర్.. జీవిత చరమాంకంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు, చేసిన పనులు విస్మయం కలిగించాయి. తన కర్రకు కట్టిన ఎర్ర జెండాను విప్పేయడం, సూటూబూటు ధరించడం, అచ్చమైన కమ్యూనిస్టు అయి ఉండీ.. ఎన్నికల్లో ఓటు వేయడం, గుళ్లకు, స్వామీజీల వద్దకు వెళ్లడంపై ఆశ్చర్యం వ్యక్తమైంది. మావోయిస్టులు తీవ్రంగా వ్యతిరేకించే చంద్రబాబు కడుపులో తలపెట్టడం, కాంగ్రెస్ వారి వేదిక ఎక్కడం, ప్రధాని మోదీ సభకు ఆహ్వానం లేకున్నా వెళ్లడం వంటివీ చర్చనీయాంశంగా మారాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గద్దర్ పెద్దపల్లి నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం కూడా జరిగింది.

బతుకుదెరువు నిమిత్తం పాలమూరు నుంచి నగరానికి వలస వచ్చిన నిరుపేద కుటుంబాలకు నేనున్నానంటూ భూదేవినగర్ రైల్వే ట్రాక్ పక్కన వారికి ఆశ్రయం కల్పించి గద్దర్ అండగా నిలిచారు. వందలాది కుటుంబాలు ఆయన నీడలో జీవనం సాగిస్తున్నాయి. గద్దర్ మరణంతో మాకు దిక్కెవరంటూ భూదేవినగర్‌వాసులు కన్నీటిపర్యంతమవుతున్నారు. - అల్వాల్

ఓరుగల్లు నుంచి పొలికేక

సాక్షిప్రతినిధి, వరంగల్: పీపుల్స్‌వార్ పార్టీపై 1990లో ప్రభుత్వం నిషేధం ఎత్తివేసింది. అప్పటివరకు అజ్ఞాతంలో ఉన్న పీపుల్స్‌వార్ నేతలు, లీగల్ కార్యకర్తలు, జననాట్యమండలి, అనుబంధ సంఘాల నాయకులు జనజీవనంలోకి అడుగుపెట్టారు. ఇదే సమయంలో 1990 మే 5, 6 తేదీల్లో వరంగల్ వేదికగా రాష్ట్ర రైతుకూలీ సంఘం మహాసభలు నిర్వహించారు. జననాట్యమండలి నాయకుడు గద్దర్, ఆయన బృందం ప్రకాష్‌రెడ్డిపేట ఏరియాలో ఏర్పాటు చేసిన సభావేదికపైన ప్రత్యక్షమైంది. పదిలక్షలకుపైగా జనం హాజరైన ఈ సభలో గద్దర్ బృందం ఆటాపాటా ఉర్రూతలూగించాయి. 'ధీరులారా శూరులారా.. రాడికల్ శూరులారా.. మీరు కాకమ్మలయ్యి వస్తారా మా బిడ్డలు..', 'జై బోలోరే జై బోలో.. అమర వీరులకు జై బోలో.. వీరులకేమో జై బోలో.. ఆహా శూరులకేమో జై బోలో..'అంటూ పాడిన పాటలు ఇప్పటికీ అందరి నోట్లో వినిపిస్తాయి. గద్దర్ ప్రస్థానంలో ఓరుగల్లు మహాసభ చిరస్థాయిగా నిలిచింది.

బతికుంటే.. మళ్లీ వస్తా



సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నల్లమలతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన చివరిసారిగా ఏప్రిల్ 30న నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల ముగింపు సభలో పాల్గొన్నారు. ఈ సభలో గద్దర్ పాట పాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. 'అచ్చంపేటలో నాలుగు ప్రాణాలు పోయినప్పుడు ఇక్కడికి వచ్చాను. మొదటి తుపాకీ తూటా నా గుండెను తాకినప్పుడు.. నెత్తురు కోసం రూ.100 కావాలని నా భార్య పైసలు అడుక్కుంది. మళ్లీ బతికి ఈ ఊరికి వచ్చిన. చివరి ఊపిరి వరకు మీ కోసం పాటుపడతా. పాలమూరుకు పేరు తేవాలి. ఈ నేల కోసం పోరాటం చేయాలి. బతికుంటే మళ్లీ వస్తాను.. మీ పాదాలకు వందనాలు'అంటూ పాట రూపంలో చెప్పారు.

ఓయూ స్టూడెంట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్ట్రికల్ విభాగంలో 1975లో ట్రిపుల్ ఈ పూర్తి చేశారు. నగరంలోని మొజంజాహీ ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ కాలేజీకి చెప్పులు లేకుండా వచ్చేవారని ప్రిన్సిపల్ శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. ఓ హోటల్‌లో 26 పైసలకు పార్ట్‌టైంపనిచేస్తూ ఇంజనీరింగ్ పూర్తి చేశారన్నారు. జార్జిరెడ్డి హయాంలో అనేక ఉద్యమాలకు ఓయూ కేంద్రబిందువు అయ్యింది. వామపక్ష ఉద్యమభావజాల వ్యాప్తి కోసం ఇక్కడ జరిగిన అనేక సభలు, సమావేశాలలో జననాట్యమండలి తరపున గద్దర్ పాల్గొన్నారు. మలివిడత తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూలో జరిగిన ప్రతి సభలో పాల్గొని తన ఆటపాటతో విద్యార్థులను ఉత్తేజపరిచేవారు.



హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గద్దర్ భౌతికకాయం వద్ద విలపిస్తున్న భార్య విమల



గద్దర్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో గద్దర్ కుమారుడు సూర్యకిరణ్, ఎమ్మెల్యే క్రాంతికిరణ్



గద్దర్ సతీమణిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే సీతక్క. చిత్రంలో ఠాక్రే, రేవంత్, వీహెచ్



క్లుప్తంగా...

అసెంబ్లీ సందర్శకుల గ్యాలరీలో హిమాన్షు సందడి

సాక్షి, హైదరాబాద్: శాసనసభ సందర్శకుల గ్యాలరీలో మంత్రి కె.తారకరామారావు కుమారుడు హిమాన్షు ఆదివారం తన స్నేహితులతో కలిసి వచ్చి సభా వ్యవహారాలను ప్రత్యక్షంగా వీక్షించారు. తెలంగాణ ప్రగతిపై లఘు చర్చ సందర్భంగా కాంగ్రెస్ పక్షనేత భట్టి విక్రమార్క ప్రసంగం, అనంతరం తన తాత, సీఎం కేసీఆర్ ఇచ్చిన సమాధానాన్ని హిమాన్షు విన్నారు.

ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు: సీతక్క



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించే వేదికగా అసెంబ్లీ ఉండాలి కానీ, అందుకు భిన్నంగా ఏకపక్షంగా కొనసాగిందని విమర్శించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడే పరిస్థితి కల్పించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికార పార్టీ సభ్యులందరికీ మాట్లాడే అవకాశం కల్పించి, కాంగ్రెస్ సభ్యులు కొందరున్నా అవకాశం ఇవ్వలేదని సీతక్క విమర్శించారు. ఇలాంటి అసెంబ్లీ సమావేశాలను ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ సమావేశాలను కేవలం రానున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం, తొమ్మిదేళ్ల సంబురాలకు వేదికగా వాడుకున్నారని దుయ్యబట్టారు.

అన్నిరంగాల్లోనూ తెలంగాణ ముందంజ: అక్బరుద్దీన్

సాక్షి, హైదరాబాద్: అన్నిరంగాల్లోనూ తెలంగాణ ప్రగతిపథాన సాగుతోందని ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ముస్లింలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కితాబిచ్చారు. రాష్ట్ర అవతరణ తర్వాత తెలంగాణ పురోభివృద్ధిపై శాసనసభలో ఆదివారం స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, కర్ణాటకతో పోలిస్తే ముస్లిం మైనార్టీలకు కేసీఆర్ ప్రభుత్వం రూ.22 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. అభివృద్ధిలో దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని, హిందూ, ముస్లిం, సిక్కులు విభిన్న మతాలతో కూడిన రాజధానిలో మత సామరస్యం వెల్లివిరిస్తోందన్నారు. తొమ్మిదేళ్లలో శాంతిభద్రతలు సంతృప్తికరంగా ఉన్నాయని, ప్రభుత్వం సెక్యులరిజంతో ముందుకెళ్లడమే దీనికి కారణమని తెలిపారు. కాళేశ్వరం సహా అనేక సాగునీటి ప్రాజెక్టులు రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్నాయని, మిగులు విద్యుత్ సాధించడంలోనూ రాష్ట్ర పురోగతి స్పష్టంగా కన్పిస్తోందన్నారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు రైతన్న మనోధైర్యాన్ని పెంచాయన్నారు. గురుకులాలు, మోడల్ స్కూళ్లను అభివృద్ధి చేయడం ద్వారా విద్యాభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతోందన్నారు. విద్య, వైద్యానికి కేసీఆర్ సర్కార్ ప్రాధాన్యమిస్తోందని తెలిపారు.

పేదలకు ఇళ్ల జాగాలు ప్రభుత్వ బాధ్యత

- పట్టణాల్లో అసైన్‌మెంట్ స్థలాలు అమ్ముకునేందుకు అనుమతిపై ఆలోచన
- అసెంబ్లీలో సీఎం కేసీఆర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: పేదలకు ఇళ్ల జాగాలు ఇవ్వడం ప్రభుత్వ సామాజిక బాధ్యతని, అవసరమైతే మళ్లీ కొత్తగా ఇళ్ల జాగాల కోసం భూములు అసైన్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆ భూములను అమ్ముకునే హక్కు కూడా పేదలకు కల్పించాలనే ఆలోచనతో ఉన్నామని చెప్పారు. ఆదివారం అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల అసైన్‌మెంట్‌ల్యాండ్ తీసుకుంటోందంటూ కాంగ్రెస్ నేతలు చేస్తోన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. పేదల భూములను వారికే ఎస్టాబ్లిష్ చేసి రీ అసైన్ చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. పేదల భూములను కాపాడతామని భరోసానిచ్చారు. అసైన్‌మెంట్ భూములపై పార్టీలకు అతీతంగా దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుందామన్నారు. ఇలాంటి అంశానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా జీవో ఇచ్చిందని, దానికి తగ్గట్టుగానే తెలంగాణలో కూడా పరిశీలిద్దామని సీఎం చెప్పారు. వ్యవసాయ భూముల అమ్మకానికి అనుమతించకపోయినా పట్టణప్రాంతాల్లో విక్రయానికి అనుమతిస్తే దళితులు ఇతర చోట్ల భూమి కొనుక్కునే అవకాశం ఉంటుందన్నారు. అందరూ సరేనంటూ రాబోయే ఐదారు రోజుల్లోనే ఏకగ్రీవంగా ఒక నిర్ణయం తీసుకుని ఈ మేరకు జీవో కూడా విడుదల చేసేందుకు తనకు అభ్యంతరం లేదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

గొంతెమ్మ కోర్కెలు సరికాదు

కాంగ్రెస్ పక్ష నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ, భద్రాచలంకు చెందిన ఐదు గ్రామాలను కేంద్రంతో మాట్లాడి తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కోరారు. ప్రభుత్వపాఠశాలల్లో పనిచేసే స్వీపర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంతో పాటు చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కేసీఆర్ స్పందిస్తూ సఫాయన్నా నీకు సలామన్న అని గతంలోనే గ్రామపారిశుధ్యకార్మికుల వేతనాలు పెంచామని, దశాబ్ది ఉత్సవాల సందర్భంగానూ రూ.వెయ్యి పెంచామని గుర్తు చేశారు అలాంటిది కొందరు గొంతెమ్మ కోర్కెలు కోరడం సరికాదని వ్యాఖ్యానించారు. గల్ఫ్ కార్మికులకు సంబంధించి ఒక విధానం తీసుకొచ్చేందుకు భవిష్యత్‌లో ప్రయత్నిస్తామని సీఎం చెప్పారు. ఆసరా పింఛన్ల విషయంలో భార్యాభర్తల్లో ఒకరు చనిపోతే వెంటనే మరొకరికి త్వరలో పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని, పాల రైతులకు బకాయిల చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని బీజేపీ సభ్యుడు ఈటల రాజేందర్ లేవనెత్తిన అంశాలపై సీఎం కేసీఆర్ స్పందించారు.

చేతనయ్యే వాగ్దానాలే సీఎం చేస్తారు.. చేసి చూపిస్తారు

మండలిలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సీఎం కె.చంద్రశేఖర్‌రావు తనకు చేతనయ్యే వాగ్దానాలే చేస్తారని, వాటిని తప్పకుండా ఆచరించి చూపుతారని రాష్ట్ర పరిశ్రమలు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీ రామారావు స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు లేనిపోని రాద్ధాంతం చేయడం కంటే తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. తమ ప్రభుత్వం 24గంటల కరెంటు ఇస్తోందని... చేతనైతే 25గంటలు ఇవ్వొచ్చని ప్రతిపక్ష పార్టీలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అసెంబ్లీ సమావేశంలో భాగంగా ఆదివారం శాసనమండలిలో జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ అద్భుత విజయాలు సాధించిందని, అందుకే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న అవార్డుల్లో 30శాతం గెలుచుకోగలిగిందన్నారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలోకి తీసుకునే బిల్లును రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పురపాలక చట్టంలో సవరణ బిల్లును మంత్రి కేటీఆర్, పంచాయతీరాజ్ సవరణ బిల్లును వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. అనంతరం సభ నిరవధికంగా వాయిదాపడింది.

నాలుగు రోజులు... 12 బిల్లులు

శాసనమండలి వానాకాలం సమావేశాలు నాలుగు రోజులపాటు జరిగాయి. మొత్తం 23గంటల 10 నిమిషాల పాటు సభ కొనసాగింది. 20 ప్రశ్నలు లేవనెత్తగా, 4 షార్ట్ డిస్కర్షన్స్ జరిగాయి. వివిధ అంశాలపై 55 ప్రసంగాలు కొనసాగాయి. ఇప్పటికే ఉన్న బిల్లుల్లో 4 సవరణలు, కొత్తగా 8 బిల్లులను... మొత్తంగా 12 బిల్లులను సభ ఆమోదించింది.

గద్దర్ మృతికి పలువురి సంతాపం



గద్దర్ అంత్యక్రియలు జరగనున్న ప్రదేశం

సాక్షి, హైదరాబాద్: గద్దర్ మరణంపై సంతాపం ప్రకటించినవారిలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, దయాకర్‌రావు, హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, ప్రముఖ సాహితీవేత్త జయధీర్ తిరుమలరావు, ప్రముఖ సినీ దర్శకుడు ఎన్.శంకర్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ బి.వేదకుమార్, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, సీనియర్ నేత డీకే అరుణ, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం నేత ఎస్.బాలమల్లేశ్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

అసైన్డ్ భూములను లాక్కుంటున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

ఎకరా రూ.4–5 కోట్ల విలువ చేస్తుందన్నారు. బుద్వేల్‌లో 164 ఎకరాల అసైన్డ్ భూములు సేకరించిన ప్రభుత్వం ప్లాట్లు వేసి అమ్ముతోందని ఆరోపించారు. అసైన్డ్ భూములు అసైనీల వద్దే ఉండనీయాలని, ధరణిలో వారికి హక్కులు కల్పించాలని కోరారు. తెలంగాణ ప్రగతిపై ఆదివారం శాసనసభలో జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. పీపుల్స్ మార్చ్ పేరుతో ఇటీవల నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా తన దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం లక్షల మంది ప్రజలు నిరీక్షిస్తున్నారని, ప్రతి గ్రామంలో భూములను సేకరించి ఇళ్ల స్థలాల పంపిణీ చేయాలని అన్నారు. అటవీ భూములు సాగుచేసుకుంటున్న గిరిజనులందరికీ పోడు పట్టాలు అందలేదని భట్టి విక్రమార్క ఆరోపించారు. దీనిపై అధికార బీఆర్‌ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు.

ఉద్యోగాలు లేక కష్టాల్లో యువత..

ఎమ్మెస్సీ, ఎంఏ, బీఈడీ వంటి ఉన్నత చదువులు చదివిన యువత ఉద్యోగాలు లభించక గ్రామాల్లో ఇస్త్రీ షాపులు, సోడా దుకాణాలు నడుపుకుంటూ తీవ్ర ఆవేదనలో ఉన్నారని భట్టి విక్రమార్క పేర్కొనగా, మళ్లీ బీఆర్‌ఎస్ సభ్యులు ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో స్పీకర్ పోచారం కలగజేసుకుని.. 'భట్టి గారూ..మీరు ఆరు మాసాల పాదయాత్ర మొత్తం చెప్పడానికి సమయం సరిపోదు'అని సూచన చేశారు. అనంతరం భట్టి ప్రసంగం కొనసాగిస్తూ.. వర్సిటీల్లో అధ్యాపకులను భర్తీ చేయాలని, ప్రైవేటు వర్సిటీల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. ఉపాధ్యాయులు లేక బడులు మూతబడుతున్నాయని, తక్షణమే డీఎస్సీ ద్వారా టీచర్ల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

గిరిజనబంధు, బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి..

గిరిజనబంధుతో పాటు బీసీలకు సబ్‌ప్లాన్, మైనారిటీలకు సచార్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో క్వింటాల్‌కి 15 కేజీల వరకు తరుగు తీస్తున్నారని, పంట రుణమాఫీ సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులను మూసివేయించాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టు సరే.. కాల్వలు ఏవీ?

రాష్ట్రంలో వివిధ కొత్త ప్రాజెక్టులను నిర్మించిన ప్రభుత్వం వాటి కింద కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు నిర్మించకపోవడంతో నీళ్లు ఉన్నా ఆయకట్టుకు సరఫరా కావడం లేదని భట్టి విక్రమార్క విమర్శించారు. కాళేశ్వరం కింద కాల్వలను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. కడెం వంటి పాత ప్రాజెక్టులు, కాల్వల నిర్వహణ గాలికి వదిలేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ముంపునకు గురి అవుతున్న చెన్నూరు, భూపాలపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల ప్రజలకు పునరావాసం కల్పించి, పరిహారం చెల్లించాలని కోరారు.

చట్టసభలను బీఆర్‌ఎస్ కార్యాలయంగా మార్చారు

- ఏడాదిలో 60 రోజులు జరగాల్సిన సభ.. 11 రోజులా?
- ఏకపక్షంగా అసెంబ్లీని నిర్వహించారు: భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: నాలుగు రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల సమస్యలపై చర్చిద్దామన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, చట్ట సభలను బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంగా మార్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. ఆదివారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ శాసనసభ సమావేశాలు ఏక పక్షంగా జరిగాయని ధ్వజమెత్తారు. ఒక రోజు సంతాప తీర్మానం పోగా, మిగతా మూడు రోజుల్లో.. కాంగ్రెస్ పార్టీని దూషించడానికే అధికార పార్టీ ఎక్కువ సమయం తీసుకుందన్నారు. ప్రజల సమస్యలు వినిపించే అవకాశం ఇవ్వకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కిందని మండిపడ్డారు. శాసనసభ సమావేశాలు ఈ ఏడాది 60 రోజుల పాటు జరగాల్సి ఉండగా 11 రోజులే జరిపి.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని భట్టి నిప్పులు చెరిగారు. దేశంలో అతి తక్కువ రోజులు శాసనసభ సమావేశాలు నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ నమోదు అవుతుందన్నారు. సభలో సీఎం రెండు గంటల పాటు మాట్లాడినా కేవలం ప్రతిపక్షాలను తిట్టడానికే సరిపోయిందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఏం చేశాం? ఏం చేయబోతున్నాం? అన్నది చెప్పకుండా గాలికి వదిలేశారని, కొత్త ఉద్యోగాల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, కృష్ణా, గోదావరి నదీ జలాలు, సింగరేణి విషయాన్ని గాలికి వదిలేశారన్నారు. చట్టసభలను బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంగా మార్చి బల్లలపై చప్పుడు చేస్తూ, స్లోగన్స్ ఇస్తూ, కొనసాగిన ఉపన్యాసాలు చూసినప్పుడు సీనియర్ శాసనసభ్యుడిగా ఆవేదన కలిగిందన్నారు. ప్రజాసమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి ప్రభుత్వం నుంచి సమాచారం రాబట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు శ్రీధర్ బాబు, జగ్గారెడ్డి, పొదెం వీరయ్య, సీతక్కలు ప్రయత్నం చేసినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

విపక్షాలను సర్కార్ వేధిస్తోంది

▶ మొదటి పేజీ తరువాయి

ఈటల అన్నారు. పంట రుణమాఫీలో జాప్యంతో రైతులపై రూ.10 వేల కోట్ల వడ్డీల భారం పడిందని, ఎప్పటిలోగా రుణాలు మాఫీ చేస్తారో తెలపాలని కోరారు. రైతు కూలీలకూ రైతుబీమా పథకం వర్తింపజేయాలని ఆయన సూచించారు.

సర్కారీ బడులు మూత..

రాష్ట్రంలో ప్రాథమిక విద్య నిర్లక్ష్యానికి గురవుతోందని, ప్రభుత్వ బడులు మూతపడుతున్నాయని ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వర్సిటీల్లో కోర్సుల ఫీజులను భారీగా పెంచారని, వాటిని తక్షణమే తగ్గించాలని కోరారు. ప్రైవేటు వర్సిటీల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, గెస్ట్ లెక్చరర్లకు 12 నెలల జీతం ఇవ్వాలని అన్నారు.

భూముల విక్రయాలు వద్దు..

ప్రభుత్వ భూముల విక్రయాలపై పునరాలోచన చేయాలని ఈటల రాజేందర్ సూచించారు. హైదరాబాద్ చుట్టుపక్కల పేదలనుంచి అసైన్డ్ భూములను లాక్కుంటున్నారని విమర్శించారు. ఐఏఎస్ అధికారులకు కూడా దళితబంధు ఇస్తామనడం సరికాదని, పేదవారికి మాత్రమే ఇవ్వాలని పేర్కొన్నారు. ఉద్యోగులకు తక్షణమే పీఆర్సీ అమలు చేయాలని, డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వచ్చాక ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. సొంత జాగాలో పేదలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల సహాయం అందజేయాలని సూచించారు.

అంతర్జాతీయస్థాయిలో 'టిమ్స్' నిర్వహణ

వీటికి స్వయంప్రతిపత్తి కల్పిస్తాం.. ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తాం

- ఈ బోర్డుకు చైర్మన్‌గా సీఎం వ్యవహరిస్తారు
- మండలిలో టిమ్స్ యాక్ట్–2023 బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి హరీశ్‌రావు
- నాలుగు బిల్లులకూ ఆమోదం తెలిపిన శాసనమండలి



సాక్షి, హైదరాబాద్: టిమ్స్ (తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రులను అంతర్జాతీయస్థాయిలో నిర్వహిస్తామని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న టిమ్స్ ఆస్పత్రుల్లో వెయ్యి పడకలు ఉంటాయని, ఎయిమ్స్(ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్), నిమ్స్(నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) తరహాలోనే 'టిమ్స్'పనితీరు ఉంటుందన్నారు. ప్రతి ఆస్పత్రికి ప్రత్యేకంగా పాలక మండలి ఉంటుందని మంత్రి తెలిపారు. వీటన్నింటిని కలిపి ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేస్తామని, దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. టిమ్స్ ఆస్పత్రులకు స్వయంప్రతిపత్తి ఉంటే త్వరితగతిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని, ప్రస్తుతం నిమ్స్‌కు ఈ హోదా కల్పించడంతో వేగంగా అభివృద్ధి సాధించిందన్నారు. ఆదివారం ఆయన శాసనమండలిలో 'టిమ్స్ బిల్లు-2023'ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో టిమ్స్ ఆస్పత్రుల ఏర్పాటుతో దాదాపు 10వేల సూపర్ స్పెషాలిటీ బెడ్స్ అందుబాటులోకి వస్తామన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు తెలంగాణలో 10వేల బెడ్స్ మాత్రమే అందుబాటులో ఉండేవని, ఇప్పుడు వాటి సంఖ్య 34వేలకు చేరిందన్నారు. అతిత్వరలో వీటి సంఖ్య 50వేలకు చేరనుందని మంత్రి సభలో వెల్లడించారు. టిమ్స్ ఆస్పత్రుల్లో 16 స్పెషాలిటీ, 15 సూపర్ స్పెషాలిటీల్లో పీజీ కోర్సులు ఏర్పాటవుతాయని, సూపర్ స్పెషాలిటీల్లో నర్సింగ్, పారామెడికల్ కోర్సులతో పాటు గుండె, మూత్రపిండాలు, లివర్, ఊపిరితిత్తులు, కేన్సర్, ట్రామా, ఎండోక్రైనాలజీ, ఎలర్జీ, రుమటాలజీ తదితర 30 విభాగాలుంటాయన్నారు. 200 మంది ఫ్యాకల్టీ, 500 మంది వరకు రెసిడెంట్ వైద్యులు, 26 ఆపరేషన్ థియేటర్లు, గుండెకు సంబంధించి క్యాథ్ ల్యాబ్, కిడ్నీలకు డయాలసిస్, కేన్సర్‌కు రేడియేషన్, కీమోథెరపీతో పాటు సీటీస్కాన్, ఎంఆర్‌ఎస్‌ఐ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రతి ఆస్పత్రిలో 300 ఐసీయూ పడకలతోపాటు వెంటిలేటర్ బెడ్‌లు కూడా ప్రత్యేకంగా ఉంటాయన్నారు. మంత్రి హరీశ్ మండలిలో ప్రవేశపెట్టిన టిమ్స్ బిల్లు–2023ని సభ ఆమోదించింది. వీటితో పాటు కర్మాగారాల సవరణ బిల్లు–2023, జైనులను మైనారీలుగా గుర్తిస్తూ మైనార్టీ కమిషనర్ సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లు, పంచాయతీ సవరణ బిల్లుల్ని కూడా శాసనమండలి ఆమోదించింది.

గొప్ప ఉద్యమకారుడిని రాష్ట్రం కోల్పోయింది: గవర్నర్

సాక్షి, హైదరాబాద్: కవి, విప్లవ వీరుడు, ఉద్యమకారుడు గద్దర్ మృతి పట్ల రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గొప్ప కవి, ఉద్యమకారుడిని రాష్ట్రం కోల్పోయిందన్నారు. గద్దర్ కుటుంబ సభ్యులకు, అనుచరులకు గవర్నర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తెలంగాణ పాటకు గద్దర్‌తో ప్రపంచఖ్యాతి: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ పాటకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన ప్రజా వాగ్గేయకారుడు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో తన పాట ద్వారా పల్లె పల్లెనా భావజాలవ్యాప్తి చేసిన వ్యక్తి గద్దర్ (గుమ్మడి విఠల్ రావు)'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. గద్దర్ మరణవార్త తెలుసుకుని ఆదివారం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సాధారణ బుర్రకథ కళాకారుడుగా ప్రారంభమైన గద్దర్ కళాజీవితం, విప్లవ రాజకీయాలతో మమేకమై తెలంగాణ ఉద్యమంలో భాగంగా సాగిన సాంస్కృతిక పోరాటంతో ఉన్నతస్థాయికి చేరిందని చెప్పారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. ప్రజా కళాకారులకు, కవులకు మరణం ఉండదని కేసీఆర్ తెలిపారు. గద్దర్ కుటుంబసభ్యులకు, ఆయన అభిమానులకు కేసీఆర్ ప్రగాఢ సానుభూతి పేర్కొన్నారు.

ప్రజాకవి గద్దర్ మృతిపై ఏపీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: ప్రజాకవి గద్దర్ మరణం పట్ల ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'ప్రజాకవి గాయకుడు, బడుగు, బలహీన వర్గాల విప్లవస్ఫూర్తి గద్దర్. గద్దర్ పాట ఎప్పుడూ సామాజిక సంస్కరణల పాటే. ఆయన నిరంతరం సామాజికన్యాయం కోసమే బతికారు. ఆయన మరణం ఊహించనిది. సామాజికన్యాయ ప్రవక్తల భావాలు, మాటలు, వారి జీవితాలు ఎప్పటికీ స్ఫూర్తినిస్తూ జీవించే ఉంటాయి. గద్దర్‌కు మొత్తంగా తెలుగుజాతి సెల్యూట్ చేస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో మనమంతా బాసటగా ఉందాం.' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రజాకళలు వర్ధిల్లినంత కాలం అజరామరం: కేటీఆర్

శాసనసభ చివరిరోజు సమావేశాల ముగింపు సమయంలో ఆదివారం గద్దర్ మరణవార్త తెలియడంతో సభ తరఫున మంత్రి కేటీఆర్ తీవ్ర సంతాపం ప్రకటించారు. 'సభలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో అందిన ఈ వార్తను సభ దృష్టికి తెస్తున్నాను. ప్రజాగాయకుడు, మా అందరికీ ఆప్తుడు, ప్రజాయుద్ధ నౌక గద్దర్ కొంతసేపటి క్రితం పరమపదించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున శాసనసభలో సంతాపం తెలపడం సరైనదిగా భావిస్తున్నాం. తెలంగాణ పాటకు ప్రపంచవ్యాప్తంగా కీర్తి తెచ్చిన ప్రజావాగ్గేయకారుడు గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) కన్నుమూశారు. ఇది యావత్ తెలంగాణ ప్రజలకు దిగ్భ్రాంతి, దుఃఖం కలగచేసింది. తెలంగాణ ఉద్యమ కాలంలో ఎన్నో సందర్భాల్లో మా అందరిలోనూ ఉత్సాహం నింపిన అద్భుత కళాకారుడు గుమ్మడి విఠల్ మరణంపట్ల శాసనసభ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంతాపం ప్రకటిస్తున్నాం. ప్రజాకళలు వర్ధిల్లినంత కాలం, జానపదం ఉన్నంత కాలం ఆయన పేరు అజరామరంగా నిలిచి ఉంటుంది. గద్దర్ కుటుంబం, అభిమానులు, మిత్రులకు ఆత్మస్థైర్యం కలగాలని కోరుతున్నాం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి'అని కేటీఆర్ అన్నారు.

కోట్లాదిమందిని ఉత్తేజపరిచారు: హరీశ్

'అమ్మా తెలంగాణమా', 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా' అంటూ తెలంగాణ ఉద్యమంలో తన గళంతో కోట్లాది మందిని ఉత్తేజపరిచారు. గద్దర్ మృతి బాధాకరం'అని మంత్రి హరీశ్‌రావు సంతాపం ప్రకటించారు.

బాధ కలిగించింది: రాహుల్, ప్రియాంక ట్వీట్

'గద్దర్ మరణ వార్త తీవ్రంగా బాధించింది. తెలంగాణ ప్రజలపై ఆయనకు ఉన్న ప్రేమే ఆయన్ను అణగారిన వర్గాల పట్ల నిర్విరామ పోరాటానికి స్ఫూర్తినిచ్చింది. ఆయన స్ఫూర్తితో ముందుకెళదాం'అంటూ తనను గద్దర్ ఆలింగనం చేసుకున్న ఫొటోను జత చేసి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. గద్దర్ ఆత్మకు శాంతి చేకూరాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ట్వీట్ చేశారు. తన సోదరుడు రాహుల్‌గాంధీని గద్దర్ ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్న ఫొటోను ఆమె తన ట్వీట్‌కు జతచేశారు.

ఆయన పాట ఉద్యమానికి ఊపు: కిషన్‌రెడ్డి

'వివిధ అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన గద్దర్ తెలంగాణ ఉద్యమంలోనూ తన పాట, మాటతో సరికొత్త ఊపు తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల్లో తాను చేపట్టిన పాదయాత్రలో గద్దర్ కలిసి నడిచారు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు.

తట్టుకోలేకపోతున్నాం: కాంగ్రెస్ నేతలు

'గద్దర్ మృతికి తట్టుకోలేకపోతున్నాం. ఖమ్మంసభలో రాహుల్‌గాంధీతో గద్దర్ ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. కాంగ్రెస్ శ్రేణులు అన్ని మండల కేంద్రాలు, ముఖ్య కూడళ్లలో గద్దర్ చిత్రపటాలు పెట్టి నివాళులు అర్పించాలి. ఆయన మరణం తెలంగాణకు తీరనిలోటు'అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గాంధీభవన్‌లో గద్దర్ చిత్రపటానికి రేవంత్, ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, మధుయాష్కీ గౌడ్, మల్లు రవి, మహేశ్‌కుమార్ గౌడ్, కుమార్ రావు, ప్రీతమ్ తదితరులు నివాళి అర్పించారు. కాంగ్రెస్ ఎంపీలు జైరాం రమేశ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీనియర్ నేతలు పొన్నాల లక్ష్మయ్య వేర్వేరుగా సంతాపం వ్యక్తం చేశారు. 'కోట్లాది మంది నిరుపేదలు, దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలు, అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నిండాలని నిరంతరం పరితపించిన గద్దరన్న మరణం యావత్తు దేశానికి తీరని లోటు' కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. 'గద్దర్ మృతి దిగ్భ్రాంతిని కలిగించింది. గద్దర్ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలి' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు.

స్మారక స్తూపాన్ని నిర్మించాలి: వామపక్షాల నేతలు

'గద్దర్ పేరుతో ఒక స్మారక స్తూపాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలి. ఆయన మరణం తెలంగాణకు తీవ్ర విఘాతం'అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. 'సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్వహించిన మహాజన పాదయాత్ర, టీమాస్ సభలలో గద్దర్ పాల్గొని మద్దతిచ్చారు. గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు'అని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు.





తక్కువతో సంతృప్తిగా ఉండగలగడమే గొప్ప సంపద.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 7 ఆగస్టు 2023

కేశమహిమ

జీవితంలో అప్రధానంగా కనిపించే విషయాలకు కూడా వాటి ప్రాధాన్యం వాటికి ఉంటుంది. ఇందుకు తిరుగులేని ఉదాహరణ జుట్టు. మన భాషా సాహిత్యాలను కొంచెం తరచి చూస్తే, జుట్టుకు ఉన్న ప్రాశస్త్యం అర్థమవుతుంది. జుట్టు చుట్టూ జరిగే వ్యాపారాలను కాస్త నిశితంగా గమనిస్తే, ఎంతటి వారైనా 'జుట్టే కదా' అని కేశపాశాలను వెంట్రుక ముక్కలా తీసి పారేయలేరు. అదీ కేశ మహిమ! అందమైన కేశాలు నిండుగా తలమీద ఉండటం వల్లనే శ్రీమహావిష్ణువుకు కేశవుడనే పేరు వచ్చింది. ఆదిభిక్షువే అయినా, పరమశివుడు కేశసంపదలో తక్కువ వాడేమీ కాదు, ఆయన జటాజూటధారి! ఆయన తన జటాజూటంలో గంగను బంధించాడు కాబట్టి గంగను శిరోజతీర్థం అని అంటారు. తలవెంట్రుకలకు గల పురాణ ప్రశస్తికి ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే!

జుట్టును అల్లుకున్న జాతీయాలు, సామెతలు దాదాపు అన్ని భాషల్లోనూ ఉన్నాయి. 'ఫలిత కేశాలు ముదిమికి సంకేతాలే గాని, జ్ఞానానికి కాదు' అని ఇంగ్లిష్ సామెత. ఇది తలపండితులకు చక్కగా వర్తిస్తుంది. 'తలలు బోడులైన తలపులు బోడులా' అనే సామెత మనకు ఉండనే ఉంది. 'అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకోవడం' కూడా మన నుడికారంలో భాగమే! కొందరు బతకనేర్పరులు ఈ విద్యలో బాగా ఆరితేరి ఉంటారు. 'జుట్టున్నమ్మ ఏ కొప్పు పెట్టినా అందమే' అని నానుడి. ఇటీవల ఏపుగా జుట్టు పెంచుకోవడానికి హైదరాబాద్‌లో ఒక మహిళ బ్యూటీ పార్లర్‌కు వెళ్లింది. బ్యూటీపార్లర్ చికిత్సతో ఆమెకు ఉన్న జుట్టు కూడా ఊడిపోయింది. ఇలా ఉంటాయి కేశక్లేశాలు! 'కాళ్లు వంకరగా ఉన్నప్పుడు నెత్తి మీద వెంట్రుకలు తిన్నగా ఉండి లాభమేంటి?' అని రష్యన్ సామెత. 'ప్రతి మనిషి పొద్దున్నే తలదువ్వుకున్నట్లు మనసు దువ్వుకోరెందుకో?' అని చైనీస్ సామెత. మనుషులకు శిరోజాలంకరణ మీద ఉన్న శ్రద్ధ మనోలంకరణ మీద ఉన్నట్లయితే, ఈ ప్రపంచం ఎప్పుడో బాగుపడిపోయేది!

మన పూర్వకవులు మరాళకుంతలలైన నీలవేణుల సౌందర్యాన్ని ఇతోధికంగా వర్ణించారు. 'ఆదిన్ శ్రీసతి కొప్పుపై తనువుపై నంశోత్తరీయంబుపై...' పద్యంలో పోతనామాత్యుడు శ్రీమహావిష్ణువు కరవైభవాన్ని వర్ణించడానికి లక్ష్మీదేవి కొప్పునే ఆశ్రయించాల్సి వచ్చింది. 'అంభోజతాక్షి వేణిన్ హరువు గనిన రోమాతి సౌభాగ్యమెంతే... చమిరి యొనరుపన్ చక్కనౌ తీవెయోనాన్' అంటూ కొప్పరపు కవులు ఒక అవధానంలో వేణీసౌందర్యాన్ని వర్ణించారు. 'కలుగక యిచ్చెడు మనుజులు/ తలవెంద్రుకలంత మంది తర్కింపంగా/ కలిగియు నీయని యధములు/ మొల వెంద్రుకలంత మంది మోహన రంగా' అని ఒక పూర్వకవి సంపన్న లోభుల మీద కసిదీరా తన అక్కసును వెళ్లగక్కాడు.

తల మీది వెంట్రుకలకే కాదు, పురుషుల మీసాలకు, గడ్డాలకు కూడా మన భాషా సాహిత్యాల్లో తగిన ప్రశస్తి ఉంది. మీసాలను పౌరుష చిహ్నాలుగా గుర్తిస్తారు. అందుకే 'మీసము పస మగ మూతికి' అన్నాడు చౌడప్ప. వైదికులకు మీసాలు పెంచే ఆచారం లేకపోయినా, తిరుపతి వేంకట కవులు మీసాలను పెంచారు. ఈ జంటకవులు మీసాలను పెంచడాన్ని కొందరు ఆక్షేపిస్తే, 'దోసమటంచెరింగియును దుందుడుకొప్పగ పెంచినారమే/ మీసము రెండు బాసలకు మేమె కవీంద్రుల మంచు దెల్పగా/ రోసము గల్గినన్ కవి వరుల్ మము గెల్వుడు గెల్చిరేని ఈ/ మీసము దీసి మీ పాద సమీపములన్ తలలుంచి మ్రొక్కమే!' అని సవాలు విసిరారు. అదీ వారి కవన పౌరుషం!

కేశ సంరక్షణ కోసం స్త్రీ పురుష భేదం లేకుండా మనుషులు నానా తంటాలు పడటం శతాబ్దాల నుంచే ఉంది. తలకట్టు నిండుగా కనిపించడానికి వివిధ సుగంధ తైలాలను వాడేవారు. గాంభీర్యానికి గురుతైన మీసకట్టు ఏపుగా పెరగడానికి కూడా రకరకాల పద్ధతులు పాటించేవారు. 'అంబలి తాగేవాడొకడైతే మీసాలెత్తేవాడు ఇంకొకడు', 'మింగ మెతుకు లేదు గాని, మీసాలకు సంపెంగ నూనె' వంటి సామెతలు సమాజంలోని డాంబిక ఆడంబరాలను బయటపెడతాయి. బ్రిటిష్ హయాంలో ఆధునిక పోకడలు మొదలయ్యాక మన దేశంలో అలంకరణల పద్ధతుల్లో చాలా మార్పులే వచ్చాయి. తల వెంట్రుకలను, మీసకట్టును చిత్రవిచిత్రమైన పద్ధతుల్లో తీర్చిదిద్దుకోవడం మొదలైంది. ఈ మార్పులు మొదలైన కొత్తలో కొంత విచిత్రంగా చూసేవారు. అప్పటికింకా సంప్రదాయాలను వదులుకోని ఛాందసులు ఈ విచిత్ర కేశాలంకరణలను ఆక్షేపించేవారు. 'గొంగడి పురుగు కట్టింగు మీసాల వాడు/ గంపశ్రాద్ధపు తలకట్టువాడు' అని మాధవపెద్ది బుచ్చి సుందర రామ శాస్త్రి 'కన్యాశుల్కం'లోని గిరీశం పాత్రను వర్ణిస్తూ ఒక పద్యం రాశారు. తలకు చక్కగా నూనె పట్టించి, నున్నగా దువ్వుకోవడం పెద్దమనుషుల లక్షణంగా ఉండేది. ఆ రోజుల్లో టంగుటూరి ప్రకాశం పంతులు అలా నున్నగా దువ్విన తలకట్టుతో ఉండేవారు. ఆయన తలకట్టు సొగసును– 'ఈగ వ్రాలిన గాని వేగ జారెడునట్లు ముడ్వంపు కురులను దువ్వినాడు/... చెవుల సందున గిరజాలు చిందులాడ మొగము మీదను చిరునవ్వు మొలకలెత్త/ టంగుటూరి ప్రకాశము రంగు మెరయ ధవళగిరి తీర్థమునకు తరలివచ్చె' అంటూ చిలకమర్తివారు వర్ణించారు.

ఆ రోజులే వేరు. సామాజిక, రాజకీయ జీవితాల్లో సరసత ఉండేది. ఇప్పుడు రాజకీయాలు బొత్తిగా మొరటుదేరిపోయాయి. అయితే, ఇప్పటికీ రాజకీయ నాయకుల ప్రసంగాల్లో తరచుగా కేశ ప్రస్తావన వస్తూనే ఉంటుంది గాని, వారి ప్రసంగాల్లో కేశాలకు సంబంధించి దొర్లే ముతక పదాలు జనాల చెవులను చిల్లులు పొడుస్తుంటాయి. అయినా, గొంగట్లో భోంచేసేటప్పుడు వెంట్రుకలను ఏరుకోక తప్పదు కదా!

ప్రేమ పెళ్లిళ్లపై రాజకీయ పెత్తనం

కామెంట్



కరణ్ థాపర్

ప్రేమ వివాహాలలో తల్లితండ్రుల సమ్మతిని తప్పనిసరి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని గుజరాత్ ముఖ్యమంత్రి ప్రకటించడంపై తాజాగా చర్చ మొదలైంది. ఇంకా విచిత్రం ఏంటంటే, పలువురు విపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా దీన్ని సమర్థించడం! ప్రజాస్వామ్యాలకు మాతృమూర్తి అయినటువంటి దేశంలో ఇదొక విచిత్ర పరిణామం. మన హక్కుల్ని మనమే హరించుకోవడం! నిజమైన ప్రజాస్వామ్యం... తల్లితండ్రులు, సమూహాల ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా వ్యక్తుల హక్కులను విస్తృతపరిచే మార్గాలను నిరంతరం అన్వేషిస్తూనే ఉంటుంది. ఆ విధంగా పౌరుల కలలు, ఆశయాలు సాకారం అవుతాయి. అయితే మన రాజకీయ నాయకులు అందుకు విరుద్ధంగా చేయాలని నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది.

మన రాజకీయ నాయకుల నుండి, అంత కంటే ఎక్కువగా మన ప్రభుత్వాధినేతల నుండి నేను ఆశించే ఒక విషయం... కొద్ది మోతాదులోనైనా వారు జ్ఞానం కలిగి ఉండటం, మన రాజ్యాంగం ప్రకారం మనకు సిద్ధించిన హక్కుల గురించి వారు తెలుసుకోవడం, ఆ హక్కులను అతిక్రమించినప్పుడు అతిక్రమించామని తెలుసుకోగలిగిన తెలివిడి వారికి ఉండటం! ఇప్పుడీ దుర్భరమైన నైతిక ఉపన్యాసపు వెలుగులో నేను చెప్పబోతున్న కథను మీరు వినాలి.

ప్రేమ వివాహాలలో తల్లితండ్రుల సమ్మతిని తప్పనిసరి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్ పటేల్ అన్నట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నివేదించింది. ఈ పరిశీలన రాజ్యాంగ పరిమితులకు లోబడే జరుగుతుందని ఆయన అన్నప్పటికీ అదే రాజ్యాంగంలోని నిబంధన ఆయన సంకల్పించిన ఆ పనిని కచ్చితంగా అసాధ్యం చేస్తుంది. ఎందుకంటే అలా చేయడం అన్నది రాజ్యాంగం మనకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించడం అవదా?

రాజ్యాంగం అనే ఆ అమూల్య పత్రంలో రాసివున్న దానిని బట్టి 18 ఏళ్లకు మనం పెద్దవాళ్లం అయినట్లు! అక్కణ్నుంచి ఒక స్త్రీకి తను ఎవర్ని పెళ్లి చేసుకోవాలో, ఎప్పుడు పెళ్లి చేసుకోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ లభిస్తుంది. ఇంకా చెప్పాలంటే, చట్ట ప్రకారం విడాకులు తీసుకుంటే కనుక, ఎన్నిసార్లు పెళ్లి చేసుకోవచ్చన్న స్వేచ్ఛ కూడా! విచిత్రంగా పురుషులకు మాత్రం 21 సంవత్సరాల వయసు వచ్చే వరకు ఈ హక్కును రాజ్యాంగం అందించదు. వారు 18 సంవత్సరాల వయసులో ఓటు వేయవచ్చు కానీ, పెళ్లి మాత్రం చేసుకోవడానికి లేదు. ఈ సమ రాహిత్యం గురించి ఇంకో రోజు చూద్దాం.

రాజ్యాంగాన్ని మార్చితే తప్ప ప్రేమ వివాహాలలో తల్లితండ్రుల సమ్మతిని తప్పనిసరి చేయలేమని ముఖ్యమంత్రికి తెలియదా? చూస్తుంటే ఆయనకు మన రాజ్యాంగం గురించి తెలియదని అనిపిస్తోంది. లేదా రాజ్యాంగాన్ని ఏకపక్షంగా మార్చే అధికారం తనకు ఉందని ఆయన చెబుతున్నట్లుగా ఉంది. లేదంటే, బహుశా... చెప్పింది చేయాలనేం ఉంది అనే ఉద్దేశం ఆయనలో ఉన్నట్లుంది.

ఉన్నవి ఉన్నట్లుగా ఆయన మాటలు ఇవీ: ''రుషికేశ్‌భాయ్ పటేల్



(ఆరోగ్య మంత్రి) నాతో ఏం అన్నారంటే – నచ్చిన వాడిని పెళ్లి చేసుకోవడం కోసం ఇల్లు వదిలి పారిపోతున్న అమ్మాయిల కేసులపై ఒక అధ్యయనం జరగాలనీ, పునరాలోచన జరపాలనీ... అందువల్ల ప్రేమ వివాహాలకు తల్లితండ్రుల సమ్మతిని తప్పనిసరి చేసేందుకు ఏదో ఒకటి చేయ వచ్చనీ... ఇందుకు రాజ్యాంగం అడ్డుపడకపోతే కనుక మనం ఈ అధ్యయనాన్ని చేపట్టవచ్చు. ప్రయత్నం కూడా చేద్దాం. మంచి ఫలితాలు రావచ్చు కదా!''



గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్

ఇంకా విచిత్రం ఏంటంటే... పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భూపేంద్ర పటేల్‌ను ఈ విషయంలో సమర్థించడం. ముఖ్యమంత్రికి తన మద్దతునిస్తూ ఇమ్రాన్ ఖేడావాలా ఒక లేఖను కూడా రాశారు. ''తల్లితండ్రులు తమ పిల్లల్ని పెంచి పోషిస్తారు. కనుక పిల్లల వివాహానికి వారి సమ్మతి తప్పనిసరి'' అని ఖేడావాలా పేర్కొన్నారు. అంతేకాదు, గుజరాత్ శాసనసభ వర్షాకాల సమావేశాలలో దీనిపై ఒక బిల్లును ప్రవేశపెట్టాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ''ఈ బిల్లును తీసుకురావడం ఎంతో ముఖ్యం. ఎందుకంటే ఈ రోజుల్లో పిల్లలు తమ తల్లితండ్రుల అదుపులో ఉండటం లేదు. మొద్దుబారి ఉంటున్నారు'' అని ఖేడావాలా వ్యాఖ్యానించారు.

ఈ రకమైన మనస్తత్వంతో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇమ్రాన్ ఖేడావాలా ఒక్కరే కాదు. జెనిబెన్ ఠాకూర్ కూడా! ఆమె మహిళా ఎమ్మెల్యే. జెనిబెన్, బీజేపీ ఎమ్మెల్యే ఫతేసిన్హ్ చౌహాన్ కలిసి, ''అమ్మాయి నివసిస్తున్న తాలూకాలోనే, స్థానికుల సమక్షంలో, తల్లి తండ్రుల సమ్మతితో వివాహం జరిగేలా గుజరాత్ రిజిస్ట్రేషన్ ఆఫ్ మ్యారేజెస్ యాక్ట్, 2009ను మార్చాలి'' అని డిమాండ్ చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' రాసింది.

ఓటు కోసం 18 ఏళ్లు నిండిన బాలికలకు క్రమం తప్పకుండా విజ్ఞప్తి చేస్తుండే ఈ పద్ధతైన పురుషులు, పద్ధతైన స్త్రీలలో ఎవరైనా తమను ఎవరు పరిపాలించాలో నిర్ణయించుకునేంత పరిణతి ఆ వయసు వారిలో ఉండదన్న వాదనను తీవ్రంగా తోసిపుచ్చకుండా ఉండి ఉంటారా? అయినప్పటికీ వారు 18 ఏళ్ల బాలిక తన తండ్రి సమ్మతి లేకుండా తన ఇష్టానుసారం వివాహం చేసుకోరాదని విశ్వసిస్తున్నారు. ఇలాంటి విషయాల్లో తల్లుల సమ్మతి రెండవ ప్రాధాన్యంగా ఉంటుంది, వాళ్లనొకవేళ లెక్కలోకి తీసుకుంటే కనుక.

ప్రజాస్వామ్యాలకు మాతృమూర్తి అయినటువంటి దేశంలో ఇదొక విచిత్ర పరిణామం. మన హక్కుల్ని మనమే హరించుకోవడం. నిజమైన ప్రజాస్వామ్యం... తల్లిదండ్రులు, సమూహాల ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా వ్యక్తుల హక్కులను విస్తృతపరిచే మార్గాలను నిరంతరం అన్వేషిస్తుంటుంది. ఆ విధంగా పౌరుల కలలు, ఆశయాలు సాకారం అవుతాయి. అయితే మన రాజకీయ నాయకులు అందుకు విరుద్ధంగా చేయాలని నిర్ణయించుకున్నట్లుంది. మనం హక్కుల్ని పరిమితం చేస్తున్నాం. స్వేచ్ఛా పరిధులను తగ్గించేస్తున్నాం. వ్యక్తుల నిర్ణయాలపై అధికారంతో పెత్తనం చలాయిస్తున్నాం. తిరోగమనంలోకి వెళ్తున్నాం.

భారతదేశానికి ప్రజాస్వామ్యంతో ఉన్నది మాతృమూర్తి సంబంధం అని మన ప్రధాన మంత్రి అనడంలోని ఉద్దేశాన్ని గుజరాత్ ముఖ్యమంత్రి తప్పుగా అర్థం చేసుకున్నట్లు కనిపిస్తోంది.

ప్రజాస్వామ్యానికి మన దేశాన్ని మారుతల్లిగా ఉంచేందుకు ఆయన సంకల్పించినట్లున్నారు. మార్మికంగా ఒక అద్భుతమైన మాతృమూర్తి అవతరించకుంటే మన యువరాణులు పర దృష్టికి చాటునే ఉండిపోతారు. బుగ్గపై చిన్న ముద్దుతో ఆ సౌందర్య రాశులను నిద్ర లేపే మహదావకాశాన్ని మన అందాల రాకుమారులు కోల్పోతారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

ఏం జరుగుతోంది?



నాతో గతంలో కలిసి పనిచేసిన ఒకామె గుండెపోటుతో చనిపోయింది. ఆమె వయసు 36. కేవలం ముప్పై ఆరేళ్లు! ఇది ఎవరైనా చనిపోయే వయసా? ఆమె టెన్నిస్ ఆడుతుండేది. నమ్మశక్యంగా లేదు.

– అంజలీ హెగ్డే, ట్రావెలర్

పట్టింపే అర్హత



ఉన్నత విద్యాసంస్థల్లో బోధించేవాళ్లకు విద్యార్థుల గురించిన నిజమైన పట్టింపు ఉండటం అనేది చర్చకు తావులేని అర్హత. మనం బోధించే, మార్గదర్శకత్వం వహించే వారి వృత్తి సంబంధ అభివృద్ధికి పాటుపడటానికి మనం పరిశోధనలో ఎన్నో విజయాలు సాధించి ఉండటం అనేది ప్రత్యామ్నాయం కాదు.

– జెన్నిఫర్ ఎం.హీమ్‌స్త్రా, ప్రొఫెసర్

మీరే కదా కారణం?



ఆఫ్రికన్లను అరబ్బులు 700 ఏళ్లపాటు దాస్యంలో ఉంచారు. యూరోపియన్లు 400 ఏళ్లపాటు దాస్యంలో ఉంచారు. మరో వందేళ్లు వలసవాద రాజ్యంగా ఉంచుకున్నారు. అయినప్పటికీ తరాల శాపం వల్ల ఆఫ్రికన్లు ఇబ్బంది పడుతున్నారని మాకు బోధించారు. నిజంగా మా పూర్వీకులు ఏం చేసినట్లు?

– అడేమోలా, ప్యాన్ ఆఫ్రికనిస్ట్

గుర్తించండి!



అధిక బరువు వల్ల ఇతరులతో సాధారణంగా కలవలేకపోవడం అనేది మన మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఇది కాదనలేని సత్యం.

– ఆండ్రియాస్ పెట్కెర్, ఫిట్‌నెస్ కోచ్

కొత్త భాష్యమా?



ఇప్పుడు ల్యాప్‌టాపులు, పర్సనల్ కంప్యూటర్లు, సర్వర్లు దిగుమతి చేసుకోవాలంటే లైసెన్సు కావాలి. కానీ 'ఇది లైసెన్స్ రాజ్ కాదు, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం' అని జూనియర్ ఐటీ మినిస్టర్ చెబుతున్నారు. మరి 'లైసెన్స్ రాజ్' అంటే ఏమిటని ఆయన అనుకున్నారు? మనల్ని మూర్ఖులు అనుకుంటున్నారా?

– ప్రాణేశ్ ప్రకాశ్, పాలసీ కన్సల్టెంట్

చేదు నిజం



సౌర ఫలకాలు పర్యావరణానికి మంచివని జనం అనుకుంటున్నారు. కానీ కాదు. అవి భారీ విషపూరిత లోహాలతో తయారవుతాయి. వాటిని రీసైకిల్ చేయరు. కావాలంటే చేయొచ్చు. కానీ దానికన్నా కొత్త రా మెటీరియల్‌ను కొనడం చౌక. కాబట్టి వాటిని గుట్టలుగా డంప్ చేస్తారు. చాలావరకు ఇవి చైనా బొగ్గుతో తయారవుతాయి. 'ఐపీసీసీ' అనుకున్నదానికంటే ఇవి మూడు రెట్ల కర్బన ఉద్గారాలను వెదజల్లుతాయి.

– మైకేల్ షెలెన్‌బెర్గర్, పర్యావరణాంశాల రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

విప్లవ సాంస్కృతిక యుగకర్త



జి.ఎస్.రాములు

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, ఆదివారం హఠాత్తుగా కన్నుమూసిన గద్దర్ ఒక ప్రజా యుద్ధనౌక. విప్లవ ఉద్యమంలో గద్దర్ పేరుతో సుప్రసిద్ధులైన గుమ్మడి విఠల్ రావుది ఓ సుదీర్ఘ పోరాటం. 76 ఏళ్ల జీవితంలో 50 ఏళ్ళు ప్రజా ఉద్యమాలకు, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు అంకితమై, లక్షలాది ప్రజలకు స్ఫూర్తినిచ్చారాయన. ఆట, పాట, మాట ద్వారా కోట్లాది ప్రజల హృదయాలను కదిలించారు. వారి హృదయాల్లో జీవించారు. వేలాది విప్లవ కార్యకర్తలు గద్దర్ ఆట, పాట, మాటతో ఉత్తేజితులై విప్లవంలోకి పయనించారు. విప్లవ పోరాటాన్ని ముందుకు తీసుకొని వెళ్ళారు. ఒక్క మాటలో విప్లవ సాంస్కృతిక ఉద్యమానికి గద్దర్ దిక్సూచి. ఒక గద్దర్, ఒక వంగపండు కలిస్తే... ఒక మహా ప్రవాహమే.

గద్దర్‌కు చాలా కాలం సంజీవ్ ఒక గొంతుకై నిలిచాడు. డోలకిస్టులు ఎందరో గద్దర్‌కు తోడై నిలిచారు. ఎందరో కళాకారులు ఆయన కళ్ళముందే అమరులయ్యారు. గద్దర్‌తో నాది నాలుగు దశాబ్దాల అనుబంధం. విప్లవోద్యమంలో కలిసి తిరిగాము. కలిసి పని చేశాము. అన్ని దశల్లో ఆత్మీయులుగా, భావాలకు అతీతంగా స్నేహాన్ని కొనసాగించాము. మలి తెలంగాణ ఉద్యమంలో గద్దర్ మహత్తర పాత్ర నిర్వహించారు. తొలి అడుగులోనే తూటాలకు ఎర అయ్యాడు.

గద్దర్ ఆశ, ఆశయం – సమ సమాజ నిర్మాణం, స్వామ్యవాద వ్యవస్థ. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, అందరికీ సమాన అవకాశాలు, అన్ని సామాజిక వర్గాలకూ, మహిళలకూ ప్రాతినిధ్యం కోసం... ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధించాల్సిన సాంస్కృతిక విప్లవం కోసం... జీవితమంతా కృషి చేశారు గద్దర్. కూడు – గుడ్డ – నీడ కోసం... 'దున్నే వారికే భూమి' కోసం... 'జల్ – జంగల్ – జమీన్' కోసం... బొగ్గుబాయి, దుబాయి, బొంబాయి కార్మికుల కోసం... విద్యార్థి, యువజన, రైతుకూలీ, ఉపాధ్యాయ ఉద్యోగ ఉద్యమాల నిర్మాణం కోసం... గద్దర్ ఎత్తిన గొంతు ఎన్నడూ దించలేదు. గద్దర్ లక్షలాది, కోట్లాది ప్రజల గొంతుకై నిలిచాడు. పాటై వారి హృదయంలో నిలిచారు. ప్రజాకవి, మహాకవి, దార్శనికుడిగా ఎదిగిన గద్దర్ ఎన్ని డాక్యుమెంట్లు రాశారో! ఎన్ని చర్చలు లిఖితబద్ధం చేశారో లెక్క లేదు. 'భారత దేశం భాగ్యసీమరా... భావి పంటలకు లోటు లేదురా...' అంటూ రాసిన పాట భారతీయ విప్లవోద్యమాన్ని అరటిపండు ఒలిచినట్టు అందించింది. వేల పాటలు రాసిన గద్దర్ ఎప్పటికప్పుడు సందర్భాన్ని అనుసరించి ఆశుకవిగా, వాగ్గేయకారుడిగా ముందుకు సాగుతూనే వచ్చారు.

గద్దర్ ఒక లెజెండ్. ఒక ట్రెండ్ సెట్టర్. గద్దర్‌కు ముందు, గద్దర్ తరువాత... తెలుగు సాహిత్య, సాంస్కృతిక ఉద్యమం అంటూ వేరు. గద్దర్ ప్రవేశంతో సాంస్కృతిక రంగం ఉత్తుంగ తరంగమై హిమాలయ పర్వతాలను స్పర్శించింది. వేలాది, లక్షలాది గద్దర్లు గ్రామగ్రామన, జిల్లా జిల్లాన రాష్ట్ర వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఎదిగివచ్చారు. దండకారణ్యంలో అబూజిమడ్, బెంగాల్‌లో, బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో, ఛత్తీస్‌గఢ్‌లో, మహారాష్ట్రలో, కర్నాటకలో, తమిళనాడులో, ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో, ఒరిస్సాలో వందలాది గద్దర్లు ఎదిగారు. ప్రతి గ్రామంలో, విద్యార్థుల విలేజ్ క్యాంపులో ఒక జననాట్యమండలి బృందం కలిసి నడిచింది. దాన్ని తీర్చిదిద్దినవాడు గద్దర్. ఆయన వెంకటాపురంలోని తన ఇంటినే విప్లవ సాంస్కృతిక కేంద్రంగా దశాబ్దాల తరబడి నిర్వహించారు.

ధైర్యమే గద్దర్ శ్వాస. ఆత్మ విశ్వాసమే అతని ప్రాణం. ప్రజాసేవే అతని ఆరోగ్యం. 1997 ఏప్రిల్ 6న ముష్కరుల కాల్పుల్లో ఆరు తూటాలు తగిలి, తిరిగి ప్రాణం పోసుకున్న గద్దర్‌లో ఒక తూటా శరీరంలోనే ఉండిపోయింది. ఐదు తూటాలను జయించినవాడు. చావును జయించినవాడు. కనపడని కత్తిపోట్లు, తూటాలు ఎన్నో! వెన్నుపోట్లు ఎన్నో...! అవేవీ అతణ్ణి కదిలించలేకపోయాయి. గద్దర్ ఆరోగ్యం కుదుట పడుతుందనుకున్నాను. భీష్ముడిలా స్వచ్ఛందంగా తాను కోలుకున్నప్పుడే తుదిశ్వాస విడుస్తాడనుకున్నాను. గుండె ఆపరేషన్ విజయవంతమై తిరిగి జనంలోకి వస్తాడనుకున్నాను. కేవలం 130 ఉండాల్సిన బ్లడ్ షుగర్ 350 పాయింట్లకు పెరిగినా, లెక్కచేయకుండా ఆడిపాడిన ధైర్యం అతడిది. గద్దర్ పాటలు, మాటలు అనేక సీడీలలో, యూట్యూబ్‌లో రికార్డయి ఉన్నాయి. గద్దర్ అనేక పుస్తకాలు రాశారు. 'తరగని గని' అనే పుస్తకంలో ప్రజల పాటలు ఎలా రాయాలో చెబుతూ తన అనుభవాలను వివరించారు. గద్దర్ తన పేరు లేకుండా వందలాది పాటలు పాడుతూనే వచ్చారు. వందలాది కవులు, గాయకుల పాటలు పాడి ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఇలా స్వయంగా ఒక కవి, గాయకుడు, వాగ్గేయకారుడు ఇతరుల పాటలు పాడి, ప్రాచుర్యంలోకి తేవడం సాహిత్య సాంస్కృతిక చరిత్రలో అరుదైన విషయం.




బసవేశ్వరునికీ, వాల్మీకికీ, వ్యాసునికీ, నన్నయ్యకూ, పాల్కురికి సోమన్నకూ, తిక్కనకూ మరణం ఉంటుందా? మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావో, మహాత్మా జ్యోతిబా పూలే, బి.ఆర్. అంబేద్కర్, పెరియార్ రామస్వామి నాయకర్, నారాయణ గురు, సావిత్రిబాయి పూలే తదితరులు చరిత్రను మలుపు తిప్పిన మహనీయులు. వారికి మరణం లేదు. గద్దర్‌కూ మరణం లేదు. ఆయన చిరంజీవి. పూలేకు సావిత్రీబాయిలా జీవితమంతా ఉద్యమంలో గద్దర్‌కు తోడై నిలిచిన సహచరి విమలక్కకూ, కుటుంబానికీ తీవ్ర సంతాపం. ఒక యుగకర్త గద్దర్‌కు జోహార్లు.

– వ్యాసకర్త, సామాజిక తత్వవేత్త
మొబైల్: 8331 966 987

పాటను కాల్చేస్తారా?

పాటను కాల్చేస్తారా హంతకులారా
ప్రగతిని చంపేస్తారా వంచకులారా

పాటంటే ఏమి పాట?
పదాల వంటకం కాదు,
ఎవరి మెప్పుకో తెగ వ
ల్లించే దండకం కాదు,
అణచబడ్డ జన కంఠం
నినదించిన రక్త ఘోష.



డబ్బు కొరకు ఉన్నోళ్ళే
గబ్బు పనులు చేస్తుంటే
సీట్ల కొరకు గొప్పోళ్ళే
బూట్లు నాకుతూ వుంటే
ఏం బతుకులురో అని కాం
డ్రించిన లేనోళ్ళ భాష.

ఎక్కడ దోపిడి వుంటే
అక్కడ తొడగొట్టింది.
మోసం ఎంతటిదైనా
ముసుగు చించి చూపింది.
ఏ చెరలో తొక్కేసిన
ఎర్రగ ఎగిరే పతాక.

– సి. నారాయణ రెడ్డి

(ప్రజా గాయకుడు గద్దర్‌పై జరిగిన హత్యా ప్రయత్నానికి నిరసనగా అప్పట్లో రాసిన కవిత)

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.షష్ఠి ఉ.11.14 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** రేవతి ఉ.8.11 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** రా.3.31 నుండి 5.03 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.32 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** రా.12.23 నుండి 1.54 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.28.

‘విలీనానికి’ అనుమతి

▶ మొదటి పేజీ తరువాయి

3 రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడినట్టయ్యింది.

ముగిసిన హైడ్రామా

ఆర్టీసీ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టేందుకు గవర్నర్ అనుమతి కోరుతూ ఈ నెల 2న రాష్ట్ర ప్రభుత్వం బిల్లును రాజ్‌భవన్‌కు పంపింది. అయితే బిల్లు పరిశీలనకు సమయం కావాలని 3వ తేదీన రాజ్‌భవన్ ప్రకటించింది. ఉద్యోగుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తం కావడంతో అదే రోజు బిల్లును పరిశీలించిన గవర్నర్ తమిళిసై 5 సందేహాలపై ప్రభుత్వం నుంచి వివరణలు కోరారు. మరోవైపు ఆర్టీసీ ఉద్యోగులు రాజ్‌భవన్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించగా, ప్రభుత్వ ప్రోద్బలమే ఇందుకు కారణమని రాజ్‌భవన్ ఆరోపించింది. కాగా ప్రభుత్వం పంపిన వివరణలతో సంతృప్తి చెందని గవర్నర్.. ఈ నెల 5న రెండోసారి మరికొన్ని సందేహాలకు సమాధానాలను కోరగా, ప్రభుత్వం వెంటనే ఆ మేరకు వివరణలు పంపించింది. రవాణా శాఖ, ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం ఎట్టకేలకు ఆదివారం బిల్లుకు గవర్నర్ సమ్మతి తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రభుత్వానికి పలు సిఫారసులు చేశారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

- ప్రభుత్వంలో ఉద్యోగుల విలీనం తర్వాత కూడా సంస్థ భూములు, ఆస్తులపై యాజమాన్య హక్కులను ఆర్టీసీ సంస్థే కలిగి ఉండాలి. సంస్థ అవసరాల కోసమే వాటిని వినియోగించాలి. ఈ మేరకు ప్రభుత్వం హామీ ఇవ్వాలి.
- రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్య ఆస్తుల పంపిణీ ప్రక్రియ పూర్తి కావాలి. ● ఉమ్మడి ఏపీఎస్ఆర్టీసీ నుంచి రావాల్సిన బకాయిల చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలి. బకాయిల చెల్లింపు బాధ్యతను తీసుకోవాలి.
- విలీనం తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పారితోషికాలు, జీతభత్యాలు, పే స్కేలు, సర్వీసు నిబంధనలు, బదిలీలు, పదోన్నతులు, పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు వర్తింపజేయాలి. ● వైద్యపరంగా అనర్హులు(మెడికల్లీ అన్‌ఫిట్)గా మారే ఉద్యోగులు కారుణ్య నియామకం కింద తమ కుటుంబ సభ్యులకు ఉద్యోగం కోరే సదుపాయాన్ని కల్పించాలి. ● అత్యంత కఠినంగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యల ప్రక్రియను సరళీకరించి మానవీయంగా మార్చాలి.

అందరికీ సమాన ప్రయోజనాలు

- ఆర్టీసీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో రాష్ట్ర సర్వీసు నిబంధనల మేరకు సమాన ప్రయోజనాలు, జీతాలు, పీఎఫ్ చెల్లించాలి. వారి ఉద్యోగ భద్రతను పరిరక్షించి వారి సేవలను ఇతర శాఖల్లో వినియోగించుకోవాలి. ● ఆర్టీసీ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు సర్వీసులో ఉన్నంత కాలం వారికి ఆర్టీసీ ఆస్పత్రుల్లో వైద్య సేవలు కొనసాగించాలి. ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సైతం వైద్య ప్రయోజనాలు అందించాలి.
- బస్సుల నిర్వహణలో ఆర్టీసీ సంస్థ, యూనియన్ల పాత్రే కీలకం. ప్రజల భద్రత కోసం బస్సుల నిర్వహణను ప్రభుత్వం తీసుకుని, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో స్వతంత్ర సంస్థకు లేదా మరేదైనా పద్ధతిలో అప్పగించాలి. నిర్వహణ వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇవ్వాలి.

మా అమ్ములపొదిలో ఎన్నో అస్త్రాలు

▶ మొదటి పేజీ తరువాయి

రూ.2 వేలు ఇచ్చాం. కల్యాణలక్ష్మిలో మొదట రూ.50 వేలు.. ఆ తర్వాత రూ.లక్ష ఇచ్చాం. గొర్ల యూనిట్లకు సైతం రూ.1.75 లక్షలకు పెంచాం. రైతుబంధు ఎకరాకు రూ.4 వేలతో మొదలు పెట్టి రూ.5 వేలకు పెంచాం. దీనిని మరింత పెంచుతాం. రుణమాఫీ అమలుతో కాంగ్రెస్ దిగాలు పడింది. నెల రోజుల్లో రుణమాఫీ సొమ్ము మొత్తం రైతుల ఖాతాల్లో జమ చేస్తాం..’అని కేసీఆర్ చెప్పారు.

కరెంటు గోల్‌మాల్ చేస్తారు..
రైతుబంధు రాదు

‘ఉన్న తెలంగాణను ఊడగొట్టింది ముంచింది కాంగ్రెస్ పార్టీయే. ఇదే కాంగ్రెస్ పార్టీ, జవహర్‌లాల్ నెహ్రూయే. చివరకు 1969 ఉద్యమంపై కర్కశంగా వ్యవహరించింది కూడా కాంగ్రెస్సే. 1969లో చెన్నారెడ్డి, విద్యార్థులు, ఉద్యోగుల నాయకత్వంలో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడితే... చివరకు తెలంగాణ డెమొక్రటిక్‌గా 14 ఎంపీ స్థానాల్లో 11 మంది గెలిచారు. యావత్ తెలంగాణ మా తెలంగాణ మాకు కావాలి అంటే ఆనాడు ఇందిరాగాంధీ నో తెలంగాణ అంటూ నిరాకరించారు. అలాగే కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వను అని సభలో చెప్పారు. అయినా ఒక్క తెలంగాణ మంత్రి కూడా వ్యతిరేకించలేదు. త్వరలో దామరచర్లలో 4 వేల మెగావాట్ల అల్ట్రా మెగా పవర్ ప్లాంట్‌ను రూ.30 వేల కోట్లతో అందుబాటులోకి తీసుకొస్తున్నాం. దీన్ని కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. వాళ్లు కరెంటు కూడా గోల్‌మాల్ చేస్తారు. రైతుబంధు రాదు..’అని సీఎం పేర్కొన్నారు.

కేంద్రం తప్పనిసరిగా
అవార్డులు ఇవ్వాల్సి వస్తోంది

‘కేంద్రంలో మమ్మల్ని రాసి రంపాన పెట్టే పార్టీ ప్రభుత్వమే ఉంది. అయినా తప్పనిసరిగా మూడు నెలలకోసారి అవార్డులు ప్రకటించాల్సి వస్తోంది. బండి పోతే బండి, గుండు పోతే గుండు ఇస్తా అన్నోడు పత్తా లేకుండా పోయిండు. రైతులు పండించిన పంట మొత్తం కొంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. ధరణి రద్దు చేసి ఏం చేస్తారో కాంగ్రెస్ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ బీఆర్ఎస్‌ను బీజేపీకి బీ టీమ్ అన్నాడు. సీన్ కట్ చేస్తే ఆయనే వెళ్లి బీజేపీలో జొర్రిండు. మా పార్టీ ఎప్పుడూ లౌకికవాద పార్టీయే. మజ్లిస్‌- బీఆర్ఎస్ భవిష్యత్‌లో కూడా ఫ్రెండ్లీ పార్టీలుగానే ఉంటాయి..’అని కేసీఆర్ స్పష్టం చేశారు.

వీధి నల్లాలు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ

‘ప్రపంచమంతా ప్రభావం చూపే హైదరాబాద్ స్థిరాస్తి రంగం పెరుగుతోంది. హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి స్థిరాస్తి కంపెనీలు వస్తున్నాయి. సింగరేణి కార్మికులకు వచ్చే దసరా, దీపావళి సందర్భంగా రూ.వెయ్యి కోట్లు బోనస్ ఇవ్వబోతున్నాం. అప్పుల్లో తెలంగాణ 23వ స్థానంలో ఉంది. పరిమితికి లోబడే అప్పులు చేశాం. నియామక పరీక్షలు దశలవారీగా నిర్వహిస్తున్నాం. గ్రూప్ 2 పరీక్షల షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో వాటిని మార్చేందుకు వీలుకాదు. పల్లెలు, పట్టణాల్లో రూపాయికే నల్లా కనెక్షన్ ఇస్తున్నాం. వీధి నల్లాలు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ. మిషన్ కాకతీయ పుణ్యమే 30 లక్షల బోర్లు నీళ్లు పోస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. కాళేశ్వరం నుంచే తుంగతుర్తి, కోదాడ, డోర్నకల్‌కు నీళ్లు వెళ్తున్నాయి. దేశంలోనే అత్యుత్తమ పునరావాసాలు నిర్మించింది తెలంగాణ. కరోనా, నోట్ల రద్దు వంటివి రాకపోయి ఉంటే తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించేది..’అని కేసీఆర్ పేర్కొన్నారు.

7 వేల దరఖాస్తులు పెండింగ్‌లో..

సీఎం సమాధానం తర్వాత ఎంఐఎం నాయకుడు అక్బరుద్దీన్ అడిగిన ప్రశ్నకు కేసీఆర్ వివరణ ఇచ్చారు. ‘మౌజంలు, ఇమాంలకు ఇప్పటికే నెలకు రూ.10 వేలు ఇస్తున్నాం. అయితే ఇంకా 7 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అందరికీ సోమవారం సాయంత్రంలోగా ఉత్తర్వులు ఇచ్చేస్తాం. ఖబరస్తాన్ కోసం మేడ్చల్‌-మల్కాజ్‌గిరి జిల్లాలోని కొన్ని గ్రామాల్లో 150 ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 112 ఎకరాల భూమికి సంబంధించి రేపటిలోగా ఉత్తర్వులు ఇస్తాం..’ అని ముఖ్యమంత్రి తెలిపారు.

జగన్‌ను అనేక రకాలుగా వేధించారు..

‘రాజశేఖర్‌రెడ్డి చనిపోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ జగన్‌మోహన్‌రెడ్డిని రాంగ్ హ్యాండిల్ చేసింది. ఆయన్ని అనేక రకాలుగా వేధించి, చివరకు జైల్లో కూడా పెట్టారు. ఆయన సొంత పార్టీ స్థాపించుకున్నారు. ఆ తర్వాత కడప ఎంపీ స్థానానికి ఉప ఎన్నిక వస్తే ఆయన నాలుగైదు లక్షల బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిచారు. అనంతరం వచ్చిన ఒకటి రెండు ఎన్నికలను కూడా ఆయన స్వీప్ చేయడంతో ఇక ఆంధ్రాలో మన పని అయిపోయిందనే ఆలోచనకు వచ్చారు. 2014 ఎన్నికల సందర్భంగా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఎదురుగాలి వచ్చింది. ఫలితాలు కూడా అదే విధంగా వచ్చాయి. ఆంధ్రాలో పోయింది. తెలంగాణలోనన్న కనీసం పది సీట్లన్నా రాకపోతాయా అనే ఒత్తిడిలో తెలంగాణ ఇచ్చారే కానీ ప్రేమతో ఇవ్వలేదు..’ అని కేసీఆర్ అన్నారు.

చంద్రబాబు పాలనలో రైతులపై కాల్పులు

‘చంద్రబాబు పాలన సమయంలోనూ కాంగ్రెస్ పార్టీ మౌన ప్రేక్షక పాత్ర వహించింది. తెలుగుదేశం హయాంలో తెలంగాణలో పరిస్థితులు మరింత దిగజారాయి. ఆనాడు స్పీకర్ స్థానంలో కూర్చున్న వ్యక్తి.. ప్రణయ్ భాస్కర్ అనే ఎమ్మెల్యే ‘తెలంగాణ’అంటే.. నో నో తెలంగాణ అనే పదం వాడకూడదని రూలింగ్ ఇచ్చిన స్థాయికి దిగజారింది. ఆ రోజు కూడా కాంగ్రెస్ మౌన ప్రేక్షక పాత్ర పోషించింది. చంద్రబాబు నాయుడు విద్యుత్ సంస్కరణల ముసుగులో విద్యుత్ చార్జీలను పెంచారు. ఒక సంవత్సరం కాదు.. మూడు సంవత్సరాలు 15 శాతం పెరుగుతుందని చెబితే ఆ సమయంలో నేను డిప్యూటీ స్పీకర్‌గా ఉండి లేఖ రాశా. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ప్రజలు, రైతులు బషీర్‌బాగ్‌లో నిరసన తెలిపేందుకు వస్తే కాల్పులు జరిపారు. పట్టపగలు జరిగిన ఆ కాల్పుల్లో కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు చనిపోయారు..’అని కేసీఆర్ గుర్తు చేశారు.

గవర్నర్‌కు జ్ఞానోదయం అయినందుకు సంతోషం: సీఎం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వంలోకి తీసుకోవాలని గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే, తగిన డబ్బిస్తామని నడిపించుకోవాలని చెప్పాం. లాభాలు తీసుకురావాలని బెస్ట్ ఐపీఎస్ అధికారిని నియమించాం. మంచి అనుభవమున్న బాజిరెడ్డి గోవర్ధన్‌ను చైర్మన్‌ను చేశాం. వారు విశ్వప్రయత్నాలు చేసినా డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో నష్టాలు మరింత పెరిగాయి. డీజిల్ లీటర్ రూ. 60 నుంచి రూ.110 కావడంతో ఖర్చు పెరిగి రోజుకు రూ.2.5 కోట్ల నష్టం వాటిల్లింది. దీంతో ఇటీవల కేబినెట్‌లో.. గతంలో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో కలపొద్దని అనుకున్నామని, ఇప్పుడేం చేద్దామని చర్చించాం. ప్రజలకు రవాణా సదుపాయం కల్పించడం ఏ ప్రభుత్వానికైనా సామాజిక బాధ్యత. పైగా ఆర్టీసీని తీసేయడానికి లేదు. అది మంచి నైపుణ్యాలున్న సంస్థ. జీరో యాక్సిడెంట్‌తో ప్రయాణికులను క్షేమంగా చేరవేసే సంస్థ. కానీ అది మనుగడ సాగించే అవకాశం లేదు. దీంతో ప్రభుత్వమే సాకాలి. మరో దారిలేదు. ఇప్పటికే ఏడాదికి బడ్జెట్‌లో పెట్టి మరీ రూ.1,500 కోట్లు వారికి ఇస్తున్నాం. ప్రభుత్వంలో లేదన్న పేరే తప్ప గవర్నమెంటే సాదుతోంది. కాబట్టి ప్రభుత్వంలోకి తీసుకుందాం. ఉద్యోగులకు భద్రత వస్తుంది. సంస్థకు చిక్కులు పోతాయనే ఉద్దేశంతో విలీనం నిర్ణయం తీసుకున్నాం’ అని కేసీఆర్ వివరించారు.

భూములపై కన్ను అంటూ..

‘గతంలో వద్దన్నవారే మళ్లీ ఎట్లా తీసుకున్నారని పిచ్చివాగుడు చేసే వాళ్లు ఉన్నారు. ప్రభుత్వం ఏ పనిచేసినా ఓ బాధ్యతతో చేస్తుంది. ఇక సగం సగం ఎందుకు పూర్తిగానే బాధ్యత తీసుకుందామని నిర్ణయించాం. మరో ఇద్ద రు యువ ఐఏఎస్ అధికారులను పెట్టి ఆదాయం పెంచే చర్యలు తీసుకోవాలని అనుకున్నాం. కానీ ఆర్టీసీ ఆస్తులపై ప్రభుత్వం కన్నేసిందని కొందరు దుర్మార్గులు, నీచులు మాట్లాడుతున్నారు. ఇంతకంటే దౌర్భాగ్యం ఏమైనా ఉంటుందా? ఇంటి పిల్లవాడిని సాదుకోవాలి తప్ప చంపుకోలేము. మరిన్ని సౌకర్యాలు పెంచి, అవసరమైతే మరిన్ని స్థలాలు సేకరించి ప్రభుత్వ పరంగా సర్వీసులు పెంచుతాం. ఆర్టీసీ ఉద్యోగులకూ పీఆర్సీ ఇస్తాం. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చేవి వారికి కూడా వస్తాయి’ అని సీఎం తెలిపారు.



రాజ్‌భవన్‌లో రవాణా శాఖ కార్యదర్శి, ఇతర అధికారులతో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై

ఆర్టీసీ బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం

▶ మొదటి పేజీ తరువాయి

గుత్తాసుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

ఆస్తులు యథాతథంగా కార్పొరేషన్‌లోనే ఉంటాయి : మంత్రి అజయ్

సంస్థ ఆస్తులు యథాతథంగా ఆర్టీసీ కార్పొరేషన్‌లోనే ఉంటాయని మంత్రి అజయ్ స్పష్టంచేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడంలో భాగంగా వారితో ముడిపడిన వివిధ అంశాలకు సంబంధించి త్వరలోనే నియమ, నిబంధనలను రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పూర్తి పీఆర్సీ వర్తిస్తుందని, టీఎస్ఆర్టీ కార్పొరేషన్ అనేది కొనసాగుతున్నందున ఆస్తులు, అప్పులు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు కార్పొరేషన్ చెల్లిస్తుందని, సీసీఎస్ బకాయిలు వంటివి దాని పరిధిలోకే వస్తాయని చెప్పారు. జీతభత్యాల వరకే ప్రభుత్వం చూస్తుందన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విషయంలోనూ బిల్లు పాసయ్యాక వీలైనంత తొందరలో మార్గదర్శకాలను రూపొందిస్తామన్నారు. ఆయా అంశాలపై ఉద్యోగులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

43,055 మంది పర్మనెంట్ ఎంప్లాయీస్..

ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం 43,055 మంది పర్మనెంట్ ఎంప్లాయీస్‌కు సంబంధించినదని, 240 మంది కాంట్రాక్ట్ డెయిలీవేజ్ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్.. కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా విధుల్లో కొనసాగుతారని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని, ఐతే ఉద్యోగులకు భద్రత, సీసీఎస్ బకాయిలు, టీఏ బిల్లులు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్,డెయిలీవేజ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో స్పష్టత నివ్వాలని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోరారు. వాటిపై స్పందిస్తూ మంత్రి అజయ్ వివరణనిచ్చారు. ఈ బిల్లుకు ఎంఐఎం సభ్యుడు మౌజంఖాన్ మద్దతు తెలిపారు.

సాత్నాల వాగులో రిమ్స్ పీజీ వైద్యుడి గల్లంతు

- ఫోన్ కోసం వాగులోకి దిగిన భుక్యా ప్రవీణ్
- కాపాడేందుకు యత్నించిన కార్తీక్‌కు స్వల్ప అస్వస్థత
- కొనసాగుతున్న గాలింపు చర్యలు



ప్రవీణ్

జైనథ్: ఆదిలాబాద్ రిమ్స్‌లో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న ఆర్థోపెడిక్ వైద్యుడు భుక్యా ప్రవీణ్ (27) సాత్నాల వాగులో ఆదివారం సాయంత్రం గల్లంతయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రవీణ్ రిమ్స్‌లో పీజీ సెకండియర్ చదువుతున్నాడు. ఆదివారం కావడంతో తొమ్మిది మంది మిత్రులు ఆదిలాబాద్ వినాయక్ చౌక్ నుంచి ఆదిలాబాద్ రూరల్ మండలం మీదుగా శివ్‌ఘాట్ వెళ్లారు. పక్కనే ఉన్న సాత్నాల వాగు వద్ద కోటి లింగాలను దర్శించుకున్నారు. కాగా ప్రవీణ్ ఫోన్ వాగులో పడిపోవడంతో, దాని కోసం అందులోకి దిగాడు. ఈ క్రమంలో ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అతడిని కాపాడేందుకు కార్తీక్ అనే మరో పీజీ విద్యార్థి అందులోకి దిగగా ఉక్కిరిబిక్కిరి కావడంతో బయటకు వచ్చేశాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. చీకటి పడటంతో గాలింపు కష్టంగా మారినట్లు తెలిపారు. అస్వస్థతకు గురైన కార్తీక్ ప్రస్తుతం రిమ్స్‌లో కోలుకుంటున్నాడు. ప్రవీణ్ తప్ప మిగిలిన ఎనిమిది మంది సురక్షితంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి చేసుకొమ్మంటే.. ప్రాణం తీశాడు

- ప్రియురాలిని ట్యాంకర్ కిందకు తోసేసిన ప్రియుడు
- తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి



తిరుపతి



ప్రమీల

నిజాంపేట్: పాత పరిచయం కాస్త..ప్రేమగా మారింది. ఇద్దరిదీ ఒకే ప్రాంతం..ఒకే సామాజికవర్గం. అయినా పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి ఎందుకో ప్రియుడికి మనసొప్పలేదు. ప్రియురాలు ఒత్తిడి తేవడంతో మట్టుబెట్టాడు. పోలీసుల కథనం ప్రకారం...కామారెడ్డి జిల్లా మాచరెడ్డి మండలం నెమలిగుట్టతండాకు చెందిన ప్రమీల (22) ఏడాది క్రితం భర్త చనిపోవడంతో ఉపాధి నిమిత్తం బాచుపల్లి ఏరియాకు వచ్చింది. స్థానికంగా ఓ షోరూమ్‌లో పనికి కుదిరింది. భౌరంపేట్‌లోని ఇందిరమ్మ కాలనీలో రెడ్డి ల్యాబ్‌లో పనిచేసే స్నేహితురాళ్లతో కలిసి ఉంటోంది. అదే మండలంలోని సోమరంపేట్ తండాకు చెందిన బాణావత్ తిరుపతి కొండాపూర్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రమీలకు తిరుపతితో పాత పరిచయం ఉంది. ఐదారు నెలలుగా ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు.

పెళ్లి సంబంధాల విషయం తెలుసుకొని..

తిరుపతికి కుటుంబసభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న ప్రమీల పెళ్లి చేసుకుందామంటూ తిరుపతిపై కొద్దిరోజులుగా ఒత్తిడి చేస్తుండగా, వాయిదా వేస్తూ వస్తున్నాడు. ఇటీవల ప్రమీల తన స్వగ్రామానికి వెళ్లి మూడు రోజుల క్రితం నగరానికి తిరిగివచ్చింది. అయితే ప్రమీల శనివారం రాత్రి 9 గంటల తర్వాత గాయాలతో రూమ్‌కు వచ్చిందని ఆమె స్నేహితురాళ్లు చెప్పా రు. అయితే పెళ్లి విషయంలో తిరుపతితో గొడవ జరిగి ఉంటుందని తెలిసింది.

మాట్లాడుకుందామని రమ్మంటే....

ప్రమీల ఆదివారం ఉదయం తిరుపతికి ఫోన్ చేసింది. ఎప్పుడూ కలుసుకునే బాచుపల్లి వీఎన్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద్దకు రమ్మని చెప్పింది. ఉదయం పదిన్నర ప్రాంతంలో తిరుపతి అక్కడకు రాగా, ఇద్దరూ గంటన్నరకుపైగా మాట్లాడుకున్నారు. పెళ్లి విషయమై ప్రమీల ఎంత ఒత్తిడి చేసినా తిరుపతి ఒప్పుకోలేదు. నేను వెళుతున్నానంటూ తిరుపతి రోడ్డు దాటేందుకు వెళుతుండగా, ప్రమీల కూడా అతనిని అనుసరించింది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఇద్దరూ రోడ్డు మధ్యలో డివైడర్ మీదనే ఉన్నారు. ఈ క్రమంలోనే గండిమైసమ్మ చౌరస్తా వైపు నుంచి బాచుపల్లి వైపు వస్తున్న ఓ ట్యాంకర్‌ను తిరుపతి గమనించాడు. ట్యాంకర్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా ప్రమీలను తోసేశాడు. దీంతో ట్యాంకర్ ఢీకొని ప్రమీల అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. ఈ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన కొందరు స్థానికులు 108కు కాల్ చేశారు. పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రమీల మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. తిరుపతిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు.

నాంపల్లి, యాదాద్రి రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి షురూ

- వర్చువల్‌గా పనులు ప్రారంభించిన ప్రధాని మోదీ
- తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి దోహదం: గవర్నర్ తమిళిసై
- యాదాద్రికి ఎంఎంటీఎస్, త్వరలో కాచిగూడ స్టేషన్ అభివృద్ధి: కిషన్‌రెడ్డి



నాంపల్లి రైల్వేస్టేషన్‌లో పునరాభివృద్ధి పనుల శిలాఫలకం వద్ద గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్, యాదాద్రి: నిజాంకాలం నాటి చారిత్రక నాంపల్లి రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సుమారు రూ.309 కోట్ల నిధులతో చేపట్టిన నాంపల్లి రైల్వేస్టేషన్ రీడెవలప్‌మెంట్‌కు ప్రధాని లాంఛనంగా పునాదిరాయి వేశారు. ఈ సందర్భంగా నాంపల్లి రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తమిళి సై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, సికింద్రాబాద్ డివిజనల్ అధికారి భరతేశ్‌కుమార్ పాల్గొన్నారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ, అమృత్ భారత్ స్టేషన్ పథకం తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో 12 కొత్త ప్రాజెక్టులకు రైల్వేశాఖ రూ. 8,494 కోట్లు మంజూరుచేసిందని చెప్పారు. త్వరలో రూ.350 కోట్లతో యాదాద్రికి ఎంఎంటీఎస్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మరో రూ.300 కోట్లతో కాచిగూడ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులకు కూడా ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రూ.700 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మూడేళ్లలో అధునాతన సికింద్రాబాద్ స్టేషన్ వినియోగంలోకి వస్తుందన్నారు చర్లపల్లి స్టేషన్ అభివృద్ధి, విస్తరణ తుది దశకు చేరుకుందని, 2024లో సేవలు ప్రారంభమవుతాయని కిషన్‌రెడ్డి చెప్పారు.

ఆర్టీసీ విలీనం చేయాల్సిందే కానీ...

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ అందుకోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతి సరైంది కాదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆర్టీసీకి ఉన్న రూ.వేల కోట్ల విలువైన స్థలాలను కాజేసేందుకే ఆగమేఘాల మీద విలీనం చేస్తున్నట్లుగా తెలుస్తోందని ఆరోపించారు.

రూ.25.24 కోట్లతో యాదాద్రి స్టేషన్ అభివృద్ధి

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం రాయిగిరిలోని యాదాద్రి రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.25.24 కోట్ల వ్యయంతో ఈ స్టేషన్ అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని చిత్ర పటానికి భువనగిరి మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి పాలాభిషేకం చేశారు.

నా పాటకు ప్రేరణే గద్దర్ : ఏపూరి సోమన్న

తిరుమలగిరి: గద్దరే తన పాటలకు ప్రేరణ అని ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న అన్నారు. చిన్నతనంలో టేప్ రికార్డుల్లో ఆయన పాటలు విని.. బాణీలు కట్టుకొని పాటలు రాశానని చెప్పారు. 2001 నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎన్నో వేల వేదికల్లో గద్దరన్నతో కలిసి ఆడి పాడానని తెలిపారు.

జగిత్యాల జైత్రయాత్రకు ఊపునిచ్చిన గద్దర్

కోరుట్ల/కరీంనగర్: ప్రస్తుత జగిత్యాల జిల్లా కేంద్రంలో 1978 సెప్టెంబర్ 7న వేలాది మంది రైతులు, రైతు కూలీలతో జగిత్యాల జైత్రయాత్ర బహిరంగసభ జరిగింది. అప్పటి పీపుల్స్‌వార్ అగ్రనేతలు కొండపల్లి సీతారామయ్య, ముప్పాల లక్ష్మణ్‌రావు, మల్లోజుల కోటేశ్వర్‌రావు, మల్లోజుల వేణుగోపాల్, సుద్దాల వెంకటి తదితరులతో కలిసి గద్దర్ ఈ జైత్రయాత్రకు హాజరయ్యారు. ప్రజానాట్య మండలి కళాకారులతో కలిసి భూస్వామ్యవ్యవస్థ, దొరల గడీల్లో సాగుతున్న అరాచకాలపై తన ఆటాపాటలతో రైతులు, వ్యవసాయ కూలీలను ఉర్రూతలూగించారు.

‘జననాట్య మండలి’తో యుద్ధభేరి

చిన్నతనం నుంచి దోపిడీ, పీడన, అణచివేతలను ప్రత్యక్షంగా అనుభవించిన వాడు కాబట్టే గద్దర్ విప్లవోద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు. ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతున్నప్పుడే ‘మాభూమి’ దర్శకుడు నర్సింగ్‌రావు, ఇతరులతో కలసి ‘ఆర్ట్ లవర్స్’ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఉద్యోగం, రాజీనామా తర్వాత మావోయిస్టు పార్టీలో పూర్తికాలం పనిచేసినప్పుడు ఆయన పాటలు పదునెక్కాయి. 1985లో కారంచేడులో జరిగిన దళితుల హత్యాకాండపై గద్దర్ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో నర్సింగ్‌రావు, సంజీవ్, ఎల్ఎస్ఎన్ మూర్తి తదితరులతో కలిసి ‘జననాట్యమండలి’ని స్థాపించారు. పీపుల్స్‌వార్‌తో కలసి పోరుబాటలో నడిచారు. 1991 తర్వాత అజ్ఞాతం వీడినా జననాట్య మండలితో యుద్ధభేరి కొనసాగించాడు. గద్దర్ పాటల స్ఫూర్తితోనే తెలంగాణ పల్లెల్లో రైతుకూలీ సంఘాలు ఏర్పడ్డాయి. ఆ సంఘాలే అప్పట్లో నక్సల్ దళాలకు అండగా నిలిచాయి. అందుకే ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ గద్దర్‌ను మొట్టమొదటిసారి ‘ప్రజా యుద్ధనౌక’గా అభివర్ణించారు.

9 నుంచి ‘మేరీ మాటీ-మేరా దేశ్’ కార్యక్రమాలు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ‘మన మట్టికి నమస్సులు, మన వీరులకు వందనం’అనేది మేరీ మాటీ (మట్టి)-మేరా దేశ్ కార్యక్రమ నినాదమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అమరవీరులకు నివాళిగా వారి శిలాఫలకాలను ఏర్పాటు చేయడం వంటివి ఇందులో భాగంగా ఉంటాయని చెప్పారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి అన్ని జిల్లాల నుంచి ‘మేరీ మాటీ - మేరా దేశ్’కమిటీ సభ్యులు హాజరయ్యారు. దేశానికి స్వాతంత్య్రం లభించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భారతదేశ చరిత్రను, స్వాతంత్య్రం కోసం త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈనెల 9 నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు ‘హర్ ఘర్ తిరంగా’కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా నిర్వహించాలని అన్నారు. గ్రామ స్థాయి నుంచి ఢిల్లీ వరకు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు త్యాగం చేసినవారిని స్మరించుకుంటూ.. ఆయా ప్రాంతాల్లో శిలాఫలకాలపై వారి పేర్లను చెక్కించాలన్నారు.

ఆర్టీసీ ఆస్తుల కోసమే విలీనం డ్రామా

- కేటీఆర్.. దమ్ముంటే రాజాసింగ్‌పై పోటీ చెయ్
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్




కరీంనగర్ రూరల్: కేసీఆర్‌కు దమ్ముంటే తన కొడుకు కేటీఆర్‌ను సీఎంగా ప్రకటించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ సవాల్ విసిరారు. ఆదివారం కరీంనగర్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల ప్రారంభ కార్యక్రమంలో సంజయ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు, వైద్యశాఖ సిబ్బందితో పాటు పలు ఉద్యోగ సంఘాలు, నిరుద్యోగులు సంజయ్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ అహంకారంతో వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటని దుయ్యబట్టారు. కొడుకు వైఖరి చూసే కేసీఆర్ ఆయన్ని సీఎంగా ప్రకటించడంలేదని ఎద్దేవాచేశారు. కేటీఆర్‌ను సీఎంగా ప్రకటించిన వెంటనే ఒక్క ఎమ్మెల్యే కూడా బీఆర్ఎస్‌లో ఉండరని చెప్పారు. కేటీఆర్ దమ్ముంటే గోషామహల్‌లో రాజాసింగ్‌పై పోటీచేసి గెలవాలని సవాల్ విసిరారు. ఆర్టీసీకి ఉన్న లక్షకోట్ల ఆస్తులను దోచుకునేందుకే సీఎం విలీనం డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికుల ప్రయోజనాల కోసం గవర్నర్ ప్రయత్నిస్తే సీఎం కేసీఆర్ గవర్నర్ వ్యవస్థను బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై ఎవరికీ అభ్యంతరం లేదని, కమిటీలు, ఉత్తర్వుల పేరిట కాలయాపన చేసి ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

అటవీ అధికారులపై సర్పంచ్‌ల దాడి

బోర్లు వేసి..రెండు గంటలు నిర్బంధం

కారేపల్లి: అటవీ అధికారులపై ఇద్దరు సర్పంచ్‌లతోపాటు పలువురు దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాణిక్యారం-చీమలపాడు రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు, అటవీ అధికారుల కథనం ప్రకారం..కారేపల్లి రేంజ్ పాటిమీదిగుంపు బీట్‌లోని అటవీ భూమిలో బోర్లు వేస్తున్నారనే సమాచారంతో తాళ్లగూడెం సెక్షన్ అధికారి దేవర రమేష్, పాటిమీదిగుంపు బీట్ అధికారి నక్కలబోయిన రమేష్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది భుక్యా భాస్కర్‌కుమార్, వాంకుడోతు వీరేందర్, బేస్‌క్యాంపు సిబ్బంది కడియాల రాధాకృష్ణలు జీపులో బయలుదేరారు. మాణిక్యారం పంచాయతీ గుడితండా వద్ద శనివారం రాత్రి 9 గంటల సమయంలో చీమలపాడు సర్పంచ్ మాలోత్ కిషోర్, మాణిక్యారం సర్పంచ్ భూక్యా రంగారావు, బోర్ ఏజెంట్ అజ్మీర బిక్కులాల్, అజ్మీర రమేష్, ఉప్తల శ్రీను మరికొందరు తమ కారును అడ్డంగా పెట్టి జీపును ఆపేశారు. అటవీ భూముల్లో బోర్లు వేస్తుంటే అడ్డుకుంటారా అంటూ అధికారులను బయటకు లాగి విచక్షణారహితంగా దాడిచేశారు. వారి సెల్‌ఫోన్లు లాక్కున్నారు. ‘మీ అందరినీ చంపేస్తాం.. మీ జీపు తగులబెడతాం ’అంటూ సర్పంచ్ కిషోర్ తన చేతిలో ఉన్న తాళం చెవితో ఎఫ్ఎస్ఓ రమేష్ కడుపు, ఛాతీ భాగంలో కొడుతుండగా, చేయి అడ్డుపెట్టడంతో అరచేతికి తీవ్ర గాయమైంది. బీట్ అధికారి రమేష్‌పైనా దాడి చేసి ప్యాంట్ చించి, సెల్‌ఫోన్ లాక్కున్నారు. అడ్డొచ్చిన సిబ్బందిపైనా దాడి చేయటంతో వీరేందర్ చేతికి గాయమైంది. అటవీ భూమిలో బోరు వేసి, ఆ వాహనం వెళ్లేంతవరకూ సుమారు రెండు గంటల పాటు వారిని నిర్బంధించారు. పోలీసు కేసులు పెడితే చంపుతామని సర్పంచ్ కిషోర్ బెదిరించాడని ఎఫ్ఎస్ఓ దేవర రమేష్, ఎఫ్‌బీఓ ఎన్.రమేష్ ఆదివారం విలేకరుల ఎదుట వాపోయారు.ఈ ఘటనపై ఎఫ్ఆర్ఓ సిద్ధార్థరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్పంచ్‌లు మాలోత్ కిషోర్, భూక్యా రంగారావుతో పాటు అజ్మీరా బిక్కులాల్, అజ్మీర రమేష్, ఉప్తల శ్రీను, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కారేపల్లి ఎస్‌ఐ పుష్పాల రామారావు తెలిపారు.

వోయేజర్-2కు మళ్లీ జీవం!



గత నెల 21న నాసా వ్యోమనౌక నుంచి సిగ్నల్స్ కట్

పక్కకు జరిగిన యాంటెనా ● కమాండ్ పంపించిన నాసా సైంటిస్టులు

18 గంటల తర్వాత మళ్లీ భూమిపైకి యథావిధిగా సంకేతాలు

ఇతర గ్రహాలపై పరిశోధనల కోసం అమెరికా అంతరిక్ష పశోధనా సంస్థ 46 ఏళ్ల క్రితం ప్రయోగించిన వోయేజర్-2 వ్యోమనౌక మళ్లీ యథాతథంగా పనిచేయడం ప్రారంభించింది. ఒకరకంగా చెప్పాలంటే కీలకమైన ఈ స్పేస్‌క్రాఫ్ట్ మళ్లీ ప్రాణం పోసుకుంది. ఈ వ్యోమనౌక ప్రస్తుతం భూమికి దాదాపు 12 బిలియన్ల మైళ్ల (దాదాపు 2,000 కోట్ల కిలోమీటర్లు) దూరంలో ఉంది. కమ్యూనికేషన్ వ్యవస్థలో చోటుచేసుకున్న పొరపాటు వల్ల గత నెల 21 తేదీన వోయేజర్-2 నుంచి భూమికి సంకేతాలు ఆగిపోయాయి. కంట్రోలర్లు పొరపాటున తప్పుడు కమాండ్ పంపించడమే కారణమని సమాచారం. ఫలితంగా వోయేజర్-2 యాంటెనా స్వల్పంగా పక్కకు జరిగింది. దాంతో సంకేతాలు నిలిచిపోయాయి. నాసా సైంటిస్టులు వెంటనే రంగంలో దిగారు. సంకేతాల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. భారీ రేడియో యాంటెనాలతో కూడిన డీప్ స్పేస్ నెట్‌వర్క్ ద్వారా కమాండ్ పంపించారు. దీనికి వోయేజర్-2 స్పందించి 18 గంటల తర్వాత భూమిపైకి సంకేతాలను పంపించింది. నాసా శాస్త్రవేత్తలు వోయేజర్-2 యాంటెనాను సరిచేసే పనిలో విజయం సాధించారు. ఇందుకోసం కమాండ్‌ను పంపించారు. స్పేస్‌క్రాఫ్ట్‌తో కమ్యూనికేషన్‌ను దాదాపు పూర్తి స్థాయిలో పునరుద్ధరించినట్లు ఇస్రో సైంటిస్టులు ప్రకటించారు. వోయేజర్-2 ఎప్పటిలాగే పనిచేస్తోందని, యథావిధిగా సేవలు అందిస్తోందని హర్షం వ్యక్తం చేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ వోయేజర్-2?

అంతరిక్షంలో భూమికి కొన్ని కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న శనిగ్రహం, కుజ గ్రహం, బృహస్పతి, గురుగ్రహంపై పరిశోధనల కోసం 'నాసా' 1977 సెప్టెంబర్ 5న వోయేజర్-1, 1977 ఆగస్టు 20న వోయేజర్-2 వ్యోమనౌకలను పంపించింది. కాలిఫోర్నియాలో నాసాకు చెందిన జెట్ ప్రాపల్షన్ ల్యాబ్‌లో వీటిని రూపొందించారు. భూమికి సంబంధించిన శబ్దాలు, చిత్రాలు, సందేశాలను ఇందులో చేర్చారు. గత 36 ఏళ్లుగా నిర్విరామంగా పనిచేస్తున్నాయి. ఇతర గ్రహాల సమాచారాన్ని భూమిపైకి చేరవేస్తున్నాయి. 2012 ఆగస్టులో వోయేజర్-1 ఇంటర్‌స్టెల్లార్ స్పేస్‌లోకి ప్రవేశించింది. అంటే అంతరిక్షంలో లక్షల కోట్ల ఏళ్ల క్రితం కొన్ని నక్షత్రాలు అంతరించిపోవడం వల్ల ఏర్పడిన ఖాళీ ప్రదేశంలోకి చేరుకుంది. ఆ తర్వాత వోయేజర్-2 కూడా ఈ స్పేస్‌లోకి ప్రవేశించింది. వోయేజర్-2 1986లో యురేనస్ గ్రహం సమీపానికి వచ్చింది. దాని ఉపగ్రహాలను గుర్తించింది. గురు, శనిగ్రహాలకి సంబంధించిన యూరోపా, ఎన్సిలాడస్ అనే ఉపగ్రహాలపై మంచు కింద సముద్రాల ఆనవాళ్లు ఉన్నట్లు కనిపెట్టింది.

క్లుప్తంగా...

'అడియాలా'కి బదులు 'అటోక్'కి ఇమ్రాన్ ఖాన్

ఇస్లామాబాద్: తోషఖానా అవినీతి కేసులో మూడేళ్ల జైలు పడిన పాకిస్తాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్‌ఖాన్‌ను ప్రభుత్వం అటోక్ జైలుకు తరలించింది. కానీ ఇమ్రాన్‌ను రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉంచాలని ఇస్లామాబాద్ ట్రయల్ కోర్టు ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. ఇమ్రాన్‌కు అడియాలా జైల్లో భద్రత కల్పించాలని పేర్కొంది. అయితే ప్రభుత్వం మాత్రం కోర్టు ఆదేశాలు పట్టించుకోకుండా అటోక్ జైలుకి తరలించినట్టుగా ఒక నివేదిక వెల్లడించింది. అటోక్ జైలుకి తరలించడం కోసమే లాహోర్ పోలీసులుఇమ్రాన్‌ను అరెస్ట్ చేసినట్టు ఆ నివేదిక పేర్కొంది.

ఇమ్రాన్‌ను కలవడానికి అనుమతించడం లేదు: పీటీఐ ఆందోళన

జైల్లో ఉన్న ఇమ్రాన్‌ను కలవడానికి పార్టీ న్యాయవాదులకి అనుమతించడం లేదని తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ ఆరోపించింది. కోర్టుకు సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకోవడానికి అనుమతి కోరినా అధికారులు నిరాకరించినట్టు ఒక ప్రకటనలో పేర్కొంది. ఇమ్రాన్‌ను అరెస్ట్ చేయలేదని కిడ్నాప్ చేసి తీసుకువెళ్లారని విరుచుకుపడింది.

యూపీ స్కూల్ టీచర్ 'ప్యాడ్ బ్యాంక్'

లక్నో: నిరుపేద యువతులు, మహిళల్లో రుతుస్రావంలో పరిశుభ్రతపై అవగాహన పెంచడానికి ఉత్తరప్రదేశ్‌లో ఒక స్కూలు టీచర్ వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. తన సొంత డబ్బులతో ''ప్యాడ్ బ్యాంక్''ను ఏర్పాటు చేసి గ్రామంలో అమ్మాయిలకు శానిటరీ ప్యాడ్స్ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు. బరేలి జిల్లా బొరియా బ్యాంకులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న రాఖీ గంగ్వార్ తమ ఊళ్లో యుక్త వయసుకి వచ్చిన అమ్మాయిలు, మహిళలు రుతుస్రావం సమయంలో ఇంకా పాతకాలం పద్ధతుల్లో బట్టలనే వాడడం పట్ల ఆవేదనతో ఉండేవారు. వారిలో శానిటరీ ప్యాడ్స్‌పై అవగాహన పెంచడానికి స్కూల్లోనే ప్యాడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. తన సొంత డబ్బుతో ప్యాడ్స్ కొని ఆ బ్యాంకులో ఉంచుతున్నారు. అవి వాడడానికి ముందుకొచ్చిన వారికి ఉచితంగా ఇస్తూ ఎలా వాడాలో నేర్పిస్తూ వారిలో అవగాహన పెంచుతున్నారు. మే 15న మదర్స్ డే సందర్భంగా ఈ బ్యాంక్ ప్రారంభించారు. మొదట్లో శానిటరీ ప్యాడ్స్ వాడడానికి ఎవరూ ముందుకు రాలేదు. కానీ ఆ సమయంలో పరిశుభ్రత గురించి వివరంగా చెప్పాక ఒక్కొక్కరు వచ్చి ప్యాడ్స్ తీసుకోవడం మొదలు పెట్టారు. అలా ప్రస్తుతం ప్రతీ నెలా 150 వరకు మహిళలు ప్యాడ్ బ్యాంక్‌కి వస్తున్నారని రాఖీ గంగ్వార్ వివరించారు.

అయోధ్య రామమందిరానికి 400 కేజీల తాళం



అలీగఢ్ (యూపీ): అయోధ్యలో రామమందిరం కోసం అలీగఢ్‌కు చెందిన ఒక కళాకారుడు అరుదైన కానుకను రూపొందించాడు. చేతితో తాళాలు తయారు చేయడంలో సిద్ధహస్తుడైన సత్యప్రకాశ్ శర్మ రాముడి మందిరం కోసం ప్రత్యేకంగా 400 కేజీల తాళం తయారు చేశాడు. శ్రీరాముడికి వీరభక్తుడైన సత్యప్రకాశ్ ప్రపంచంలో చేత్తో తయారు చేసిన అతి పెద్ద తాళమని చెప్పారు. ఈ తాళం 10 అడుగుల ఎత్తు, 4.5 అడుగుల వెడల్పు, 9.5 అంగుళాల మందంతో ఉంది. తాళం చెవి నాలుగడుగుల పొడవుంది. సత్యప్రకాశ్ శర్మ కుటుంబం తరాలుగా ఈ తాళాల తయారీ వృత్తిలోనే ఉంది.ఈ ఏడాది మొదట్లో అలీగఢ్ ఎగ్జిబిషన్‌లో ఈ తాళాన్ని ఉంచారు. తాళం తయారు చేయడంలో తన భార్య రుక్మిణి కూడా సాయం చేశారని చెప్పారు. ఈ తాళం తయారీకి ఆయనకి రూ.2 లక్షల ఖర్చయింది. ఈ ఏడాది చివర్లో ఆయన ఈ తాళాన్ని శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కి సమర్పిస్తారు.

కుటుంబ పాలన.. 'క్విట్ ఇండియా'

- ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన
- విపక్షాలు ప్రతికూల రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజం
- 508 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి శంకుస్థాపన

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు ప్రతికూల రాజకీయాలు చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. అవినీతి, కుటుంబ పాలన, బుజ్జగింపు రాజకీయాలను దేశం నుంచి తరిమికొట్టేందుకు 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో భారత్ యావత్తూ ముందుకొస్తోందని చెప్పారు. దేశవ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ప్రధాని మోదీ ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిపక్షంలోని ఓ వర్గం తాము పనిచెయ్యం, ఇతరులను పని చెయ్యనివ్వబోమన్న ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇది నిజంగా దురదృష్టకరమైన పరిస్థితి అని వాపోయారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అధునాతన పార్లమెంట్ భవనం నిర్మించామని, ప్రజాస్వామ్యానికి అదొక చిహ్నమని, ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి అది ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. అలాంటి పార్లమెంట్‌ను సైతం విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని, అందులోకి అడుగుపెట్టేందుకు నిరాకరిస్తున్నాయని ఆక్షేపించారు. కర్తవ్యపథ్‌ను అభివృద్ధి చేయడాన్ని కూడా వ్యతిరేకించాయని ఆవేదన వ్యక్తం చేశారు.



కొన్ని పార్టీలు కేవలం ఎన్నికల సమయంలోనే సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్‌ను స్మరిస్తాయని, తాము గుజరాత్‌లో అతిపెద్ద విగ్రహం ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. గత 70 ఏళ్లలో మన అమర జవాన్ల కోసం కనీసం యుద్ధ స్మారకాన్ని కూడా నిర్మించలేదని కాంగ్రెస్ పార్టీపై పరోక్షంగా ధ్వజమెత్తారు. తాము నిర్మిస్తే నిస్సిగ్గుగా బహిరంగంగా విమర్శలు చేశాయని దుయ్యబట్టారు.

దేశ ప్రగతికి రెక్కలు తొడుగుతున్న యువత

ప్రతికూల రాజకీయాలను పూర్తిగా దూరం పెట్టామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. దేశ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని, ఓటు బ్యాంకు రాజకీయాలను, పార్టీ రాజకీయాలను లెక్కచేయకుండా అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. దేశంలో 10 లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రస్తుతం రోజ్‌గార్ మేళా కొనసాగుతోందన్నారు. దేశంలో మార్పు మొదలైందని, దేశ అభివృద్ధితో యువతకు నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని వెల్లడించారు. దేశ ప్రగతికి మన యువత కొత్త రెక్కలు తొడుగుతున్నారని ప్రశంసించారు.

ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా

ఈ నెల 9న జరిగే 'క్విట్ ఇండియా' వార్షికోత్సవాన్ని మోదీ ప్రస్తావించారు. ఇదొక చరిత్రాత్మక దినం అని చెప్పారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చిన రోజు అని పేర్కొన్నారు. ఇప్పుడు దేశమంతా క్విట్ ఇండియా అంటూ బిగ్గరగా నినదిస్తోందని వివరించారు. అవినీతి, కుటుంబ పాలన, బుజ్జగింపు రాజకీయాలు వంటివి దేశం వదిలి వెళ్లిపోవాలని ఆకాంక్షిస్తోందని వ్యాఖ్యానించారు. గత ఏడాది లాగే ఈసారి కూడా ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సదుపాయాలు పెరగడం, జీవనం సులభతరం కావడంతో దేశంలో పన్నులు చెల్లించేవారి సంఖ్య మరింత పెరిగిందని వివరించారు. ఐటీ రిటర్న్‌లు దాఖలు చేసినవారి సంఖ్య ఈ ఏడాది 16 శాతం పెరిగిందన్నారు. 'అమృత్‌భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా 508 రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం మోదీ శంకుస్థాపన చేయగా, వీటిలో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 55, తెలంగాణలో 21, ఆంధ్రప్రదేశ్‌లో 18 రైల్వేస్టేషన్లు ఉన్నాయి.

పాక్ వధువు.. భారత్ వరుడు వర్చువల్ వివాహం

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లోని కరాచీ నగరానికి చెందిన వధువు అమీనా, భారత్‌లోని జోద్‌పూర్‌కు చెందిన అర్బాజ్ ఖాన్ మధ్య వర్చువల్‌గా వివాహం జరిగింది. వధువు అమీనాకు భారత వీసా లభించకపోవడంతో బుధవారం ఆన్‌లైన్‌లో పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. పాకిస్తాన్‌లో జరిగితే ఆ పెళ్లికి చట్టబద్ధంగా గుర్తింపు లభించదని, అందుకే స్వదేశాన్ని ఎంచుకున్నానని వరుడు అర్బాజ్ ఖాన్ చెప్పాడు. అమీనాకు వీసా దొరికి, భారత్‌కు వచ్చాక మళ్లీ పెళ్లి చేసుకుంటామని తెలిపాడు. అర్బాజ్ ఖాన్ చార్టెర్డ్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. జోద్‌పూర్‌లోని ఓస్వాల్ సమాజ్ భవన్ అతడి వివాహానికి వేదికగా మారింది. బంధుమిత్రుల సమక్షంలో, జోద్‌పూర్ ఖాజీ ఆధ్వర్యంలో వర్చువల్‌గా నిఖా చేసుకున్నాడు. ఇది ఇరువైపులా పెద్దలు కుదిర్చిన పెళ్లి కావడం విశేషం.



ఇండిగో విమానంలో ఏసీ బంద్

ఉక్కపోతతో గంటన్నరపాటు ప్రయాణికుల అవస్థలు

న్యూఢిల్లీ: ఇండిగోకు చెందిన చండీగఢ్–జైపూర్ విమానంలో ఏసీ లేకపోవడంతో ప్రయాణికులు ఉక్కపోతతో తీవ్ర అవస్థలు పడ్డారు. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనపై ఇండిగో సంస్థ ప్రయాణికులకు క్షమాపణలు తెలిపింది. సాంకేతిక సమస్యతోనే ఈ తప్పిదం జరిగిందని వివరించింది. మున్ముందు ఇలాంటివి జరక్కుండా అప్రమత్తంగా ఉంటామని పేర్కొంది. అదే విమానంలో ప్రయాణించిన పంజాబ్ కాంగ్రెస్ చీఫ్, ఎమ్మెల్యే అమరీందర్ సింగ్ వర్రింగ్ తోటి ప్రయాణికులు పడిన అవస్థలపై ఒక వీడియోను ట్వీట్ చేశారు. ఉక్కపోతను భరించలేని ప్రయాణికులు తమకందజేసిన సేఫ్టీ కార్డులతో విసురుకుంటున్నట్లు, చెమట తుడుచుకునేందుకు ఒక ఎయిర్ హోస్టెస్ టిష్యూ పేపర్లను పంపిణీ చేస్తున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. 'విమానం ఎక్కేటప్పుడు ఎండలోనే పావు గంట సేపు నిల్చోబెట్టారు. లోపలికి వెళ్లాక చూస్తే ఏసీ లేదు. జైపూర్ వెళ్లే వరకు దాదాపు గంటన్నరసేపు చెమట్లు తుడుచుకుంటూ నరకయాతన అనుభవించాం' అని అమరీందర్ పేర్కొన్నారు.



ఉత్తరకొరియాలోని తమ ప్రభుత్వ ఆయుధాగారంలో అధునాతన రైఫిల్‌ను పేల్చి పరీక్షిస్తున్న ఉ.కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్. శనివారం ఆయన దేశంలోని ఆయుధ కర్మాగారాలను సందర్శించారు. తుపాకుల నుంచి అణ్వస్త్రాలను మోసుకెళ్లే క్షిపణుల వరకు పలు ఆయుధాలను పరిశీలించారు.

ఆగని మణిపూర్ అల్లర్లు

15 ఇళ్లకు నిప్పు

ఇంఫాల్: మణిపూర్‌లో ఇంకా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఆదివారం చెలరేగిన హింసాకాండలో పదిహేను ఇళ్లు తగలబడ్డాయి. లంగోల్ గేమ్స్ విలేజ్‌లో అల్లరిమూక దాడులకు తెగబడి ఇళ్లను తగులబెట్టారు. దీంతో భద్రతా సిబ్బంది బాష్పవాయువుని ప్రయోగించి పరిస్థితుల్ని అదుపులోనికి తీసుకువచ్చారు. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని చెకోన్ ప్రాంతంలో దుండగులు వాణిజ్య సముదాయాలను తగులబెట్టారు. మరోవైపు రాజకీయంగా ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలింది. ఎన్డీయేలో ఇన్నాళ్లూ భాగస్వామ్యపక్షంగా ఉన్న కుకీ పీపుల్స్ అలయెన్స్ బైరెన్ సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది.



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగిన మెయిటీ వర్గం నిరసనకారులు

లూటీ చేసిన ఆయుధాలు వెనక్కి

మణిపూర్‌లో అల్లరిమూకలు భారీగా లూటీ చేసిన ఆయుధాల్ని తిరిగి స్వాధీనం చేసుకునే కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు లూటీ అయిన ఆయుధాల్లో 1,195 తిరిగి స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. మణిపూర్ లోయ ప్రాంతం జిల్లాల నుంచి 1,057 ఆయుధాలు , కొండ ప్రాంతం జిల్లాల నుంచి 138 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఐజీ ర్యాంకు అధికారి ఒకరు ఆయుధాగారాల లూటీకి సంబంధించి విచారణ జరుపుతున్నారు.

జంకుతున్న ఎమ్మెల్యేలు

ఈ నెల 21 నుంచి మణిపూర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడానికి కుకీ వర్గానికి చెందిన అత్యధిక ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యే అవకాశం ఉంది. పార్టీలకతీతంగా ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీకి హాజరుకావడానికి విముఖతతో ఉన్నారు. జాతుల మధ్య ఘర్షణలు ఇంకా కొనసాగుతూ ఉండడంతో తమకి భద్రత లేదని వారు భయపడుతున్నారు. శాంతి భద్రతలు అదుపులో లేకపోవడం వల్ల తాము అసెంబ్లీకి హాజరు కావడం లేదని కుకి వర్గానికి చెందిన ఎమ్మెల్యే ఎల్.ఎమ్ ఖాటే చెప్పారు. ఎమ్మెల్యేల ఇంఫాల్ ప్రయాణం సురక్షితం కాదని అన్నారు.

అయిదుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన హేయమైన ఘటనలో అయిదురుగు పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. ఆ ప్రాంతం పోలీసు స్టేషన్ ఇన్‌చార్జ్ సహా అయిదుగురు సిబ్బందిని దీనికి సంబంధించిన వీడియో బయటకి వచ్చిన వెంటనే సస్పెండ్ చేసినట్టుగా పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం వెల్లడించారు. ఒక వర్గం ప్రజలు వారి సస్పెన్షన్‌ని వెనక్కి తీసుకోవాలని ప్రతీరోజూ పోలీసు స్టేషన్ ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నా వెనక్కి తగ్గ లేదని చెప్పారు.

మూత్రం తాగించి, మలద్వారంలో మిర్చి పెట్టి..


దొంగతనం అనుమానంతో బాలురపై యూపీలో దారుణం



సిద్ధార్థనగర్: బలవంతంగా మూత్రం తాగించారు. మలద్వారంలో మిరపకాయలు రుద్దారు..పెట్రోల్ ఇంజెక్షన్లు చేశారు... రెండు వేల రూపాయలు దొంగతనం చేశారన్న అనుమానంతో ఇద్దరు బాలురపై కొందరు పాల్పడిన అమానుష చర్యలివి. యూపీలోని సిద్ధార్థనగర్ జిల్లా పత్రాబజార్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఈ దారుణం చోటుచేసుకుంది. నిందితులే స్వయంగా ఈ దారుణాన్ని చిత్రీకరించి, వీడియోను సోషల్ మీడియాలో ఉంచటంతో వైరల్ అయ్యింది. దీనిపై జిల్లా ఎస్పీ అభిషేక్ కుమార్ అగర్వాల్ చర్యలకు ఆదేశించారు. పత్రా బజార్‌లోని కొంకటి సమీపంలోని ఓ చికెన్ దుకాణంలో రూ.2 వేలు దొంగిలించారనే అనుమానంపై అఫ్జల్, విజయ్ సాహ్ని అనే బాలురను కొందరు నిర్బంధించారు. వారి చేతుల్ని కట్టేసి, పెట్రోల్ ఇంజెక్షన్లు చేశారు. బలవంతంగా వారితో మూత్రం తాగించారు. మిరపకాయలను వారి మలద్వారంలో రుద్దారు. బాధతో విలవిల్లాడుతూ రోదిస్తున్న వారిద్దరినీ కాపాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అఫ్జల్ తండ్రి మహ్మద్ హుస్సేన్ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు.. వీడియో ఆధారంగా 8 మంది నిందితులను గుర్తించి, వారిలో ఆరుగురిని అరెస్ట్ చేశారు. మిగతా ఇద్దరిని పట్టుకునే పనిలో ఉన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్ని బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ పరామర్శించారు. బాలుర పట్ల తాలిబన్ల కంటే ఘోరంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.

మీరిప్పుడున్నది సముచిత స్థానం కానీ..

అజిత్ పవార్‌పై అమిత్ షా ఆసక్తికర వ్యాఖ్యలు



కార్యక్రమంలో అమిత్‌షా, అజిత్ పవార్

పుణే: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఇద్దరు నేతలు ఆదివారం పుణేలో జరిగిన ఒక కార్యక్రమంలో ఒకే వేదికపై ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. 'చాలా కాలం తర్వాత మీరిప్పుడు సరైన స్థానంలో ఉన్నారు. కానీ, చాలా ఆలస్యమైంది'అని పేర్కొన్నారు. 'అజిత్ పవార్‌తో కలిసి నేను పాల్గొన్న మొట్టమొదటి కార్యక్రమమిది. ఈ సందర్భంగా ఆయనకు ఒక విషయం చెప్పదల్చుకున్నా. చాలా కాలం తర్వాత ఆయన ఇప్పుడు సముచిత స్థానానికి చేరుకున్నారు. ఆయన ఎప్పుడూ ఇదే స్థానంలోనే ఉండటం సబబు. కానీ, ఈ స్థానంలోకి ఆయన చాలా ఆలస్యంగా వచ్చారు' అని అమిత్ షా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ కూడా పాల్గొన్నారు. నెల క్రితం ఎన్సీపీని చీల్చిన అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన–బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో చేరిన విషయం తెలిసిందే. అజిత్ పవార్‌కు డిప్యూటీ సీఎం పదవితోపాటు ఆయన వర్గానికి మంత్రి పదవులు దక్కిన విషయం తెలిసిందే.

ఘటనాస్థలి వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు



పాక్‌లో పట్టాలు తప్పిన రైలు

30 మంది మృత్యువాత

కరాచీ: పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో ఆదివారం జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 30 మంది మరణించారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. కరాచీ నుంచి రావల్పిండికి వెళుతున్న హజారా ఎక్స్‌ప్రెస్ నవాబ్‌షా జిల్లాలోని సర్హారి రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు తప్పింది. కరాచీకి 275 కి.మీ. దూరంలో ఈ ప్రమాదం జరిగింది. దాదాపుగా 10 బోగీలు పట్టాలు తప్పి ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారిలో ఎక్కువ మంది పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇంకా బోగీల కింద చాలా మంది ఉండడంతో పాక్ ఆర్మీ సహాయ చర్యలకు దిగింది. విషమంగా ఉన్న వారిని కరాచీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. రైలు ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోందని రైల్వే శాఖ మంత్రి సాద్ రఫీక్ తెలిపారు.

వదంతులు ఆపకుంటే.. సర్వేను బహిష్కరిస్తాం

జ్ఞానవాపి మసీదు కమిటీ హెచ్చరిక

వారణాసి: వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ)అధికారుల సర్వే సందర్భంగా హిందూ మతానికి సంబంధించిన కొన్ని చిహ్నాలు కనిపించాయంటూ వస్తున్న వదంతులపై మసీదు కమిటీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి ప్రచారానికి అడ్డుకట్ట వేయకుంటే మసీదులో జరుగుతున్న సర్వేను బహిష్కరిస్తామని హెచ్చరించింది. ఏఎస్ఐ అధికారులు మసీదులో మూడో రోజైన ఆదివారం సర్వే కొనసాగించారు. 17వ శతాబ్దంలో ఈ మసీదును ఆలయమున్న ప్రాంతంలోనే నిర్మించారా అన్న విషయం తేల్చేందుకు కోర్టు ఆదేశాలతో సర్వే జరుపుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం సర్వేకు దూరంగా ఉన్న మసీదు కమిటీ శనివారం సర్వే సమయంలో మసీదులోనే ఉంది. అధికారుల సర్వేకు తాము పూర్తి సహకారం అందిస్తామని కమిటీ సభ్యులు చెప్పారు. అయితే, శనివారం పునాది వద్ద జరిగిన సర్వే సందర్భంగా త్రిశూలం, కలశం, విగ్రహాలు వంటివి కనిపించాయంటూ ఒక వర్గం మీడియా వదంతులు ప్రచారం చేసిందని ఆరోపించారు. ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేయకుంటే మసీదు కమిటీ సర్వేను బహిష్కరిస్తుందని స్పష్టం చేశారు.



టమాటాల వ్యాను బోల్తా.. ఎగబడ్డ జనం

హజారీబాగ్: టమాటాల లోడుతో వస్తున్న వ్యాను బోల్తా పడగా అందులోని టమాటాల కోసం జనం ఎగబడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేసి కొంత సరుకును మాత్రం తిరిగి స్వాధీనం చేసుకోగలిగారు. ఈ ఘటన బిహార్‌లో జరిగింది. నేపాల్ నుంచి టమాటాల లోడుతో వస్తున్న వ్యాను ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో బిహార్‌లోని రాంచీ–పట్నా హైవేపై చర్హి వ్యాలీ వద్ద పల్టీ కొట్టింది. డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వ్యాను బోల్తా పడి అందులోని టమాటాలు రోడ్డుపై పడిపోయాయి. ఇంకేముంది..? టమాటాల ధర కిలో వందల్లో ఉన్న వేళ..ఈ ఘటన సమీప గ్రామస్తులకు అనుకోని వరంలా మారింది. వెంటనే అక్కడికి పరుగెత్తుకొచ్చారు. సంచులు, డబ్బాలతో టమాటాలు ఎత్తుకుపోవడం మొదలుపెట్టారు. వ్యాను డ్రైవర్, క్లీనర్ అడ్డుకున్నా వారు లెక్కచేయలేదు. అయితే, ఈ గందరగోళంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని జనాన్ని చెదరగొట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. గ్రామస్తులు ఎత్తుకెళ్లిన టమాటాల్లో చాలా వరకు తిరిగి రాబట్టారు.

చంద్రయాన్-3 నుంచి చంద్రుడి వీడియో



బెంగళూరు: చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన వీడియోను చంద్రయాన్-3 మిషన్ ఆదివారం చిత్రీకరించింది. ఈ వీడియోను ఇస్రో సోషల్ మీడియా ద్వారా విడుదల చేసింది. చంద్రయాన్-3 మిషన్ శనివారమే చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించింది. ఈ వీడియోలో చందమామ ఉపరితలం నీలి ఆకుపచ్చ రంగుల్లో కనిపిస్తోంది. అంతేకాకుండా చందమామపై ఉన్న లోతైన బిలాలు కూడా కనిపిస్తున్నాయి. చంద్రుడికి సంబంధించి చంద్రయాన్-3 పంపించిన తొలి వీడియో ఇదే కావడం విశేషం.

కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులకు విప్ జారీ

న్యూఢిల్లీ: తమ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులకు కాంగ్రెస్ విప్ జారీ చేసింది. సోమవారం సభ్యులంతా తప్పనిసరిగా సభకు హాజరుకావాలని సూచించింది. వాయిదాపడేదాకా సభలోనే ఉండాలని పేర్కొంది. కీలకమైన ఢిల్లీ బిల్లుపై సోమవారం రాజ్యసభలో చర్చ, ఓటింగ్ జరిగే అవకాశం ఉండడంతో కాంగ్రెస్ తన సభ్యులకు విప్ జారీ చేసినట్లు తెలుస్తోంది. 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ(అమెండ్‌మెంట్) బిల్లు–2023'ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

'ఇండియా' చైర్‌పర్సన్‌గా సోనియా గాంధీ!

పట్నా: 26 పార్టీలతో కూడిన విపక్ష 'ఇండియా' కూటమి సమన్వయ కమిటీ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ నేత సోనియా గాంధీ, కన్వీనర్‌గా బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కూటమి తదుపరి సమావేశం ఆగస్టు 31, సెప్టెంబర్ 1న ముంబైలో జరుగనుంది. కూటమికి చెందిన 11 మంది సభ్యుల సమన్వయ కమిటీ చైర్‌పర్సన్‌గా సోనియా గాంధీని, కన్వీనర్‌గా నితీశ్ కుమార్‌ను ఈ సమావేశాల్లో ఎన్నుకోనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

కరీంనగర్: టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడాన్ని హర్షిస్తూ కరీంనగర్ 1–2 డిపోల సిబ్బంది స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం గద్దర్‌కు నివాళి అర్పించారు.



సీఎంను కలిసిన సింగ్

కరీంనగర్: రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ జన్మదినం సందర్భంగా సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకొని పూలమొక్క అందజేశారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'వైఖరి మార్చుకోవాలి'



మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తమ వైఖరి మార్చుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు సూచించారు. తనక్యాంపు కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ.. ఎంపీ సంజయ్ కల్వల ప్రాజెక్టు పరిశీలించి, ఆర్టీసీ కార్మికుల గురించి మాట్లాడటం సిగ్గుగా ఉందన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ నెల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ స్పృహకు సాక్ష్యం



పుస్తకం ఆవిష్కరిస్తున్న మహేశ్వర్, తదితరులు

విద్యానగర్(కరీంనగర్): పుల్లూరు జగదీశ్వరరావు రాసిన పుస్తకం పర్యావరణ స్పృహకు సాక్ష్యంగా నిలుస్తుందని కరీంనగర్ ఆర్డీవో కె.మహేశ్వర్ అన్నారు. ఆదివారం ఫిల్మ్‌భవన్‌లో పుల్లూరు జగదీశ్వర్‌రావు రాసిన మై ట్రస్ట్ విత్ నైటింగేల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. మహేశ్వర్ మాట్లాడుతూ.. రచయిత సున్నితత్వానికి నిదర్శనం ఈ పుస్తకమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్, పెద్దపల్లి జెడ్పీ సీఈవో ఎం. శ్రీనివాస్, ఓ.కుమార్, మానేటి ప్రతాప్‌రెడ్డి, సీహెచ్.రమణకుమార్, బీవీఎస్.స్వామి,రవీందర్ పాల్గొన్నారు.

నోటిఫికేషన్ రద్దుకు వినతి



వినతిపత్రం ఇస్తున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్ ఎ(ఎఫ్) పోస్టుల భర్తీ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయించేందుకు కృషి చేయాలని కోరుతూ ఆదివారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 1,520 పోస్టుల భర్తీ కోసం పరీక్ష నిర్వహిస్తారని, కాంట్రాక్టు ఉద్యోగులకు 20మార్కులు వెయిటేజీ ఇచ్చినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని వివరించారు. ఖాళీ పోస్టుల్లో సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ చేయాలని, నోటిఫికేషన్‌ను రద్దు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరగా ఎంపీ సానుకూలంగా స్పందించారు. యూనియన్ ప్రతినిధులు సంపూర్ణ, వరలక్ష్మి, రమాదేవి, సంతోషి,శోభ, ముబీనా, నిర్మల,ప్రవంతి, పుష్పలత పాల్గొన్నారు.

యుద్ధభేరికి తరలిరండి

జమ్మికుంట: ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే యాదవ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రటరీ కన్నబోయిన శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జీఎస్ఆర్ ఐటీఐ ప్రాంగణంలో యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల యాదవ సంఘం అధ్యక్షుడు గిరవేణి శ్రీనివాస్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పాక కుమారస్వామి, కమలాపూర్ అధ్యక్షుడు పోతరవేన రాజన్న, హుజూరాబాద్ మండల అధ్యక్షుడు బద్దుల రాజ్‌కుమార్, నాయకులు ముష్కె వీరరాజు, చిన్నాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'నగరంలోని బోయవాడకు చెందిన ఓ మహిళ తన భర్త చనిపోవడంతో ఆయన పేరిట ఉన్న ఇంటిని తనపేరుకు మార్చాలని నగరపాలకసంస్థలో దరఖాస్తు చేసుకుంది. పేరు మార్పిడికి కొంతమంది రెవెన్యూ సిబ్బంది అక్షరాలా రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. అవాక్కైన సదరు మహిళ కనికరించాలని వేడుకోవడంతో రూ.లక్షన్నరైనా ఇవ్వకపోతే నీ పని చేయమంటూ తేల్చిచెప్పారు. దిక్కుతోచని మహిళ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఉద్యోగుల టార్చర్ తట్టుకోలేక నగరపాలకసంస్థ కార్యాలయంలో బిగ్గరగా రోదించింది. కొద్దిరోజుల క్రితం చోటు చేసుకొన్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది.'

'నగరశివారులో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తీగలగుట్టపల్లిలో ఓ ఇంటి స్థలం వివాదంలో ఉంది. ఆ స్థల యజమాని ఇల్లు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ విభాగం అనుమతి మంజూరు చేసింది. అయితే ఆ స్థలం తనదేనంటున్న మరో వ్యక్తి కూడా దరఖాస్తు చేసుకోగా.. ఇంటి నిర్మాణానికి రెవెన్యూ అధికారులు అనుమతిని ఇచ్చి, సమస్యను మరింత జటిలం చేశారు. ఒకేస్థలంలో ఇంటి నిర్మాణానికి వేర్వేరు వ్యక్తులకు అనుమతినిచ్చిన రెవెన్యూ లీలలపై బాధితులు కలెక్టర్‌ను ఆశ్రయించారు.'

'నగరంలోని విలీనగ్రామం వల్లంపహాడ్‌లోని ఓ గోదాం సమీపంలో కొంత ఖాళీస్థలం ఉంది. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు లేవు. కనీసం రేకుల షెడ్డు కూడా లేదు. కానీ.. ఆ స్థలంలో ఇల్లు ఉన్నట్లు నగరపాలకసంస్థ రెవెన్యూ విభాగం ఇంటి నంబర్ కేటాయించింది. ఉన్న ఇళ్లకే నంబర్లు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకొనే ఉద్యోగులు ఖాళీ స్థలానికి మాత్రం ఇంటినంబర్ ఇవ్వడం గమనార్హం.'

ముడుపులిస్తేనే.. మ్యుటేషన్

బల్దియాలో రెవెన్యూ విభాగం అక్రమ దందా

- ఖాళీ స్థలాలకు ఇంటినంబర్లు
- ఒకే స్థలంలో రెండు ఇళ్లకు అనుమతులు
- నగరపాలకసంస్థలో ఉద్యోగుల లీలలు



కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం లీలల్లో మచ్చుకు కొన్ని ఇవీ. ఏళ్లుగా రెవెన్యూ విభాగంలో తిష్టవేసుకొని కూర్చున్న కొంతమంది అవినీతి ఉద్యోగులు ఈ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు డబ్బులు ముట్టచెబితే కాని పనిచేయని స్థాయికి వారు చేరుకున్నారు. ఉన్నతాధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం, కొంతమంది అధికారులు వారికి దన్నుగా నిలుస్తుండడంతో ఆ ఉద్యోగుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

ఆన్‌లైన్ అయినా..

→ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సేవలను ఆన్‌లైన్ చేసినా రెవెన్యూ ఉద్యోగులు దండుకోవడాన్ని మాత్రం ఆపడం లేదు. ప్రతీ పనికో రేట్ ఫిక్స్ చేసి డబ్బులు ఇస్తే గాని పనులు చేయడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి.

→ పేరుమార్పిడి (మ్యుటేషన్), ఇంటినంబర్ కేటాయింపు, ఆస్తి పన్ను లెక్కించడం తదితర పనుల కోసం ఎక్కువగా ప్రజలు రెవెన్యూ కార్యాలయానికి వస్తుంటారు.

→ ప్రస్తుతం నంబర్ ఉన్న ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తున్న సమయంలోనే రిజిస్ట్రేషన్‌శాఖ మ్యూటేషన్ చేస్తోంది. కాని వారసత్వ మ్యుటేషన్‌లో అవకాశం ఉండడంతో రెవెన్యూ ఉద్యోగులు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.

→ భర్త చనిపోయి భార్య పేరిట మ్యుటేషన్ చేయడానికీ కొర్రీలు పెడుతున్నారు. మీ భర్తకు ఇంకో భార్య ఉందట...మీ పిల్లలు ఉన్నారు కదా...ఒప్పుకొంటారా..అంటూ వేధిస్తూ...వాళ్లు చెప్పినట్టు వినేలా ఒత్తిడి చేస్తున్నారు.

→ అయినా.. డబ్బులు ఇవ్వనివారిపై ఇతరులతో ఫిర్యాదులు ఇప్పించిన సందర్భాలు ఉన్నాయి. దీంతో తప్పనిసరిగా ఉద్యోగులు ఎంత చెబితే అంత ముట్టచెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

→ ఇక ఇంటి నంబర్లు ఇవ్వడంలో రెవెన్యూశాఖ అధికారుల లీలలు ఎంతగా చెప్పినా తక్కువే. ప్రభుత్వ భూముల్లో, వివాదంలో ఉన్న స్థలాల్లో తమను 'కలిసిన' వారికి ఇంటి నంబర్లు కేటాయించడంలో వీరు ఎప్పుడూ ముందుంటారు.

→ ఆస్తిపన్ను లెక్కించడంలోనూ సదరు ఉద్యోగుల లెక్కలు వేరేగా ఉంటాయి. తమకు అందిన లెక్క ప్రకారం లెక్కించడం, లేదంటే ఎక్కువగా పెంచడంలో వారిది అందె వేసిన చేయి.

→ ఇదంతా కూడా రెవెన్యూ విభాగంలో ఉన్న ఒకరిద్దరు ఉద్యోగుల కనుసన్నల్లో జరుగుతుందనే ఆరోపణలున్నాయి. కార్యాలయం మొత్తాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొన్న సదరు ఉద్యోగులు, సంవత్సరాలుగా ఇదే దందాను కొనసాగిస్తున్నారు.

→ ఇప్పటికైనా ఉన్నతాధికారులు రెవెన్యూ విభాగంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై దృష్టిసారించి, పారదర్శక పాలనను అందించాలని నగరప్రజానీకం కోరుతోంది.

రూ.914 కోట్లతో 21 రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ

- కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు రూ.26.60కోట్లు మంజూరు
- అమృత్‌భారత్ స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- అధికారుల గైర్హాజరుపై ఎంపీ బండి సంజయ్ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీ సంజయ్‌కుమార్

కరీంనగర్‌రూరల్: తెలంగాణలోని 39 రైల్వేస్టేషన్ల లో మొదటి విడతలో రూ.914కోట్లతో 21 రైల్వేస్టేషన్లను ఆధునీకరణ చేయనున్నట్లు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్ తెలిపారు. అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలోని 508 రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనుల కార్యక్రమాన్ని ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించి సందేశాన్ని అందించగా.. కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ సంజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అయితే కార్యక్రమానికి ఆర్డీవో మహేశ్వర్ మాత్రమే హాజరుకాగా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ... అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. అభివృద్ధి పనులకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో అత్యాధునిక ప్లాట్‌ఫామ్, రెస్ట్‌రూమ్స్, లాంజెస్ తదితర సౌకర్యాలను కల్పించేందుకు కేంద్రం రూ.26.60కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. కరీంనగర్–హసన్‌పర్తి మీదుగా హన్మకొండ వరకు రైల్వేలైన్‌కు రూ.20కోట్లు కేటాయించగా సర్వే పనులు జరుగుతున్నట్లు చెప్పారు. సేతుబంధన్ కింద కరీంనగర్–తీగలగుట్టపల్లి ఆర్వోబీకి రూ.150కోట్లు, బిజిగిరి షరీఫ్–జమ్మికుంటకు రూ.50కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైనులో 12 ఆర్వోబీల నిర్మాణం పూర్తయిందని, ఖాజీపేట–బల్హార్షా మార్గంలో 4 ఆర్వోబీలు మంజూరైనట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.రైల్వే అధికారులు కృష్ణారెడ్డి, కౌశల్‌పాండే, ఐఎస్ఆర్ మూర్తి, కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, జితేందర్ పాల్గొన్నారు.

'రైతులపై మొసలి కన్నీరు వద్దు'



మాట్లాడుతున్న మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్: అకాలవర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఎంపీ బండి సంజయ్ చేతనైతే కేంద్రం నుంచి నష్టపరిహారం ఇప్పించేలా చొరవ చూపాలని, రైతులపై మొసలి కన్నీరు కార్చడం తగదని మేయర్ వై.సునీల్‌రావు మండిపడ్డారు. ఆదివారం ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో మాట్లాడుతూ వర్షాలు, వరదలు వచ్చి పదిరోజులు గడిచాక ఎంపీ బండి సంజయ్ పర్యటనల పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. బాధ్యత గల ఎంపీగా కేంద్రం నుంచి నయాపైసా నిధులు తేకుండా వరద, బురద రాజకీయాలు చేయడం ఆయనకే చెల్లిందని ధ్వజమెత్తారు. కల్వల ప్రాజెక్టు, మోతే వాగులను పరిశీలించి ప్రభుత్వాన్ని విమర్శించడం దయ్యాలు, వేదాలు వల్లించినట్లుందని ఆరోపించారు. ఆర్టీసీ బిల్లుపై, రైతులపట్ల బండి సంజయ్‌కు అవగాహనే లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు గందె మాధవి, కంసాల శ్రీనివాస్, గుగ్గిళ్ల జయశ్రీ, ఐలేందర్‌యాదవ్, మేచినేని అశోక్‌రావు, నక్క కృష్ణ, పిట్టల శ్రీనివాస్, ఎదుల్ల రాజశేఖర్, షౌకత్ అలీ, చెన్నాడి అజిత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ గుండెల్లో

గద్దర్ గళం



తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రెస్‌భవన్‌లో గద్దర్ ఆటాపాట(ఫైల్)

- హుస్నాబాద్ స్తూపం నుంచి జగిత్యాల జైత్రయాత్ర వరకు
- గద్దర్‌కు ఉమ్మడి జిల్లాతో పెనవేసుకున్న బంధం

కరీంనగర్/కరీంనగర్‌కార్పొరేషన్/తిమ్మాపూర్: ఉమ్మడి జిల్లాతో గద్దర్‌కు ఎనలేని బంధం ఉంది. హుస్నాబాద్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని సీఎం మర్రి చెన్నారెడ్డి నక్సల్స్‌పై నిషేధం సడలించిన సమయంలో అమరవీరుల స్తూపాన్ని ఆవిష్కరించడం ప్రధాన ఘట్టమని చెప్పవచ్చు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేసీఆర్ కరీంనగర్ ఎంపీగా రాజీనామా చేసి 2006లో ఉపఎన్నికకు సిద్ధమైతే కళాకారులను, కవులను పోగు చేసి జిల్లాకేంద్రంలోని సర్కస్‌గ్రౌండ్‌లో తెలంగాణ ధూంధాం వేదికకు పురుడుపోసిన అగ్రగన్యుల్లో గద్దర్ ఒకరు. దళిత, సామాజిక, వామపక్ష, కుల,వర్గ పోరాటాల్లో గద్దర్ తన పాటలతో జనాన్ని జాగృతం చేసిన తీరును ఉమ్మడి జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటూ నివాళి అర్పించారు.

జగిత్యాల జైత్రయాత్ర..

పీపుల్స్‌వార్, మావోయిస్టు పార్టీల నిర్మాణానికి ఊపిరులూదిన జగిత్యాల జైత్రయాత్రలో అప్పటి విప్లవ రథసారథులతో కలిసి గద్దర్ పాల్గొన్నారు. జననాట్య మండలి తరఫున గడీల్లో దొరల పాలన, వెట్టిచాకిరీ, భూస్వాముల ఆగడాలపై పాటతో ధ్వజమెత్తారు.

సింగరేణి పరిరక్షణకు..

గద్దర్‌తో సింగరేణికి విడదీయరాని అనుబంధం ఉంది. సింగరేణి సంస్థ పరిరక్షణకు గోలేటి నుంచి కొత్తగూడెం వరకు చైతన్యయాత్ర నిర్వహించారు. సంస్థవ్యాప్తంగా గనులపై మీటింగ్‌లు నిర్వహించారు. ఏఐటీయూసీతో కలిసి సంస్థ పరిరక్షణ యాత్ర నిర్వహించారు.

మానేరుతీరం.. గద్దర్ పాట ప్రవాహం

సిరిసిల్ల, వేములవాడలో సాగిన సాయుధ పోరాటంలో గద్దర్ పాట ప్రవాహమైంది. 1990 దశకంలో నిజామాబాద్‌లో జరిగిన అప్పటి పీపుల్స్‌వార్(మావోయిస్టు) పార్టీ బహిరంగ సభకు జిల్లా నుంచి వేలాది మంది యువకులు తరలివెళ్లారు. లారీలు, బస్సుల్లో తరలివెళ్లి గద్దర్ సభలో పాల్గొన్నారు. ఆ స్ఫూర్తితో వందలాది మంది యువకులు పీపుల్స్‌వార్ ఉద్యమంలో భాగస్వాములయ్యారు.



2006లో తెలంగాణ ధూంధాం కోసం సర్కస్‌గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న గద్దర్(ఫైల్)

తీరని లోటు

ప్రజా యుద్ధనౌక, జననాట్య మండలి వ్యవస్థాపక సభ్యుడు, ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం అణగారిన వర్గాలకు తీరని లోటన్నారు. 1978లో వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కాలేజ్(ఆర్ఈసీ)లో మొట్టమొదటిసారి తాను ఇంటర్ విద్యార్థిగా గద్దర్‌ను చూశానని తెలిపారు. అప్పుడు విద్యార్థులనుద్దేశించి ఆయన చేసిన ప్రసంగాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు.

పొడుస్తున్న పొద్దు అస్తమించింది



గద్దర్ మృతదేహం వద్ద రసమయి

ప్రజాగాయకులు గద్దర్ మరణం నమ్మలేకపోతున్నామని, పొడుస్తున్న పొద్దు అస్తమించిందని, గర్జించే గొంతు మూగబోయిందని మానకొండూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

గద్దర్ గళంతోనే పోరుబాట

స్వరాష్ట్ర సాధనలో ప్రతిఒక్కరూ పోరుబాట పట్టడానికి గద్దర్ గళమే కారణమని మేయర్ సునీల్‌రావు తెలిపారు. విప్లవోద్యమంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారని గుర్తుచేశారు. ఎర్రజెండాను ఎత్తి పీడిత ప్రజలను పోరుబాట పట్టించిన వ్యక్తి అన్నారు. గద్దర్ మరణం తెలంగాణ రాష్ట్రానికి తీరనిలోటన్నారు.

1973 నుంచి పరిచయం

1973లో వేములవాడలో రైతుకూలీ సభలో పాల్గొనేందుకు జననాట్యమండలి గాయకుడిగా వచ్చిన గద్దర్‌తో పరిచయమైందని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. నాటి నుంచి నేటి వరకు అనేక సామాజిక, దళిత, తెలంగాణ మలిదశ ఉద్యమాలతో పాటు సాంస్కృతిక ఉద్యమాల్లో పాలుపంచుకున్నానని గుర్తు చేశారు.

బహుజనుల భూములు అమ్ముకుంటున్నారు



గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఎస్పీ నేతలు

- అసెంబ్లీని వాయిదా వేసి కేసీఆర్ పారిపోయిండు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- చొప్పదండిలో బహుజన రణభేరి

చొప్పదండి: బహుజనుల వద్ద ఉన్న భూములను లాక్కుని ప్రభుత్వమే ఎకరం రూ.వంద కోట్లకు అమ్ముకుంటోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. పట్టణ శివారులోని భూపాలపట్నం రోడ్డులో ఆదివారం రాత్రి బహుజన రణభేరీ నిర్వహించారు. గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి రోడ్‌షో నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బహిరంగసభకు ర్యాలీగా తరలారు. పాఠశాల క్రీడా మైదానంలో అనుమతి లేకపోవడంతో బహిరంగసభ స్థలం ఆదివారమే మార్చారు. భారీవర్షంలోనే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. రాష్ట్రంలో 99శాతం బహుజనులే ఉన్నారని, అధికార పార్టీవాళ్లు రూ.పది లక్షలు ఇచ్చినా, రూ.పది కోట్లు ఇచ్చినా, బతుకమ్మ చీరలు, మటన్‌లు ఇచ్చినా ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బహుజనుల వద్ద గుంజుకున్న భూములను మళ్లీ పంచుతామని తెలిపారు. గర్షకుర్తిని మండలంగా ప్రకటించాలని బీఎస్పీ డిమాండ్ చేస్తోందన్నారు. కొంకటి శేఖర్, మంద రవీందర్, నల్లాల శ్రీనివాస్, మాంకాళి తిరుపతి, మనోహర్, రమేశ్, రాజేందర్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన లక్ష్యం



జగిత్యాల జిల్లా తాటిపల్లికి చెందిన బాదినేని రాజేశ్వర్‌ది వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్న గంగు– గంగారెడ్డి. 2014లో డిగ్రీ పూర్తిచేశాడు. అప్పటి నుంచి పోలీస్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. 2016లో టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చినా వెళ్లలేదు. 2018లో అర్చనతో వివాహమైంది. నాలుగేళ్ల కూతురు అన్విత ఉంది. అయినా ప్రిపరేషన్ ఆపకుండా ఎస్సై కొలువే లక్ష్యంగా ముందుకు సాగాడు. కరీంనగర్‌లో ఉంటూ.. ఓ ప్రయివేటు సంస్థలో శిక్షణ పొందాడు. ఆదివారం నాటి ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో విజయం సాధించాడు. రాజన్న సిరిసిల్ల జోన్‌లో సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. ఇన్నేళ్ల తన కల నెరవేరినందుకు సంతోషంగా ఉందని జగదీశ్వర్ వివరించాడు.

పేదింటి సూపర్ 'స్టార్లు'

- ఎస్సై కొలువుల్లో జిల్లావాసుల సత్తా..
- పట్టుసడలని ప్రిపరేషన్‌తో విజయం సొంతం

కరీంనగర్‌క్రైం/చొప్పదండి: పోలీస్.. పేరులో ఉండే పవరే వేరు.. అందులోనూ బుజానికి రెండుస్టార్లు మెరిస్తే ఆ హుందాతనం... సమాజంలో గౌరవం చెప్పలేనిది. ఉమ్మడి జిల్లాలోని పలువురు పేదింటి యువత మామూలు వ్యవసాయ, కూలీ కుటుంబాల నుంచి వచ్చి అణిముత్యాలుగా మెరిశారు. లక్ష్యం కోసం ఏళ్లుగా కష్టపడి చదివి విజయం సాధించారు. ఎస్సై కొలువు కొట్టి.. 'స్టార్ల'తో మెరవనున్నారు.

చొప్పదండి మండలానికి చెందిన ముగ్గురు పేదింటి యువత ఎస్ఐలుగా ఎంపికయ్యారు. గుమ్లాపూర్‌కు చెందిన రైతు అంజయ్య, కవితల ఏకైక కుమారుడు పొరండ్ల అనిల్‌కుమార్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. రుక్మాపూర్‌కు చెందిన కూలీ కుటుంబం నుండి కుంచం మానస ఎస్ఐగా ఎంపికైంది. గుమ్లాపూర్‌కు చెందిన బత్తుల నారాయణ కుమారుడు బత్తుల అభిలాష్ ఆర్ఎస్ఐగా ఎంపికయ్యాడు.



కుంచం మానస



పొరండ్ల అనిల్



బత్తుల అభిలాష్

పోలీస్ యూనిఫాం అంటే ఇష్టం



రాజన్న సిరిసిల్ల జిల్లా దుండ్రపల్లికి చెందిన గుంటి అరుణ్ కుమార్‌కు చిన్ననాటి నుంచి పోలీస్ యూనిఫాం వేసుకోవాలనేది కల. వీరిది వ్యవసాయ కుటుంబం. అమ్మనాన్నలు అంజవ్వ–ఎల్లయ్య. బీటెక్ కొండగట్టు జేఎన్‌టీయూలో, ఎంటెక్ ఉస్మానియాలో పూర్తి చేశాడు. మిత్రులందరూ సాఫ్ట్‌వేర్ వైపు వెళ్తే.. అరుణ్ మాత్రం పట్టు వదలకుండా కరీంనగర్‌లో కోచింగ్ తీసుకున్నాడు. రెగ్యులర్‌గా ఈవెంట్స్, థియరీ ప్రిపేర్‌అవుతూ సివిల్ ఎస్సైగా ఉద్యోగం సాధించాడు.

క్లుప్తంగా

మంత్రి గంగులపై ఆరోపణలు చేసిన నాయకుడి అరెస్టు

కరీంనగర్‌ క్రైం: వక్ఫ్‌ బోర్డుకు చెందిన ఆస్తులను మంత్రి గంగుల కమలాకర్‌ అక్రమంగా రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారని ఆరోపిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నాడని వక్ఫ్‌ ఆస్తుల పరిరక్షణ కమిటీ(కాంగ్రెస్‌) అధ్యక్షుడు సమద్‌ నవాబ్‌ను శనివారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై ఆదివారం మధ్యాహ్నం విడుదల చేశారు. కరపత్రాలతో మసీదుల వద్ద మంత్రిపై అసత్య ప్రచారం చేస్తున్నాడని పలువురు బీఆర్‌ఎస్‌ నాయకులు సీపీ సుబ్బారాయుడికి ఫిర్యాదు చేశారన్నారు. నవాబ్‌ అరెస్టు విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌ నాయకులు సీపీతో మాట్లాడారు. ఈ ఘటనను ఖండిస్తూ త్రీటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎదుట ఆందోళన చేపట్టారు.

చెట్లు నరికిన వ్యక్తులపై కేసు

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని కాట్రపల్లిలో రాజగోపాల్‌కు చెందిన స్థలంలో నిమ్మ, అశోక చెట్లను అదే గ్రామానికి చెందిన వ్యక్తులు తాడూరి మొగిలి, ముప్పు అశోక్‌, సంగాల సదానందం నరికివేశారని ప్రకృతి ప్రేమికులు ఆదివారం ఫిర్యాదు చేశారు. చెట్లపై కోతుల చేరి, ఇబ్బందులు కలిగించడం వల్లే నరికివేశామని చెబుతున్నారని తెలిపారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేశ్‌ పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

శంకరపట్నం: మండలంలోని కరీంపేటకు చెందిన ఏనుగుల ఎల్లవ్వ(77) ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్‌ నారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లవ్వకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో చిన్న కుమారుడు రాజయ్య వద్ద ఉంటోంది. శనివారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి టీవీ చూసి పడుకుంది. ఆదివారం తెల్లవారుజామున చూడగా ఆమె కనిపించలేదు. అనుమానంతో రాజయ్య వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా అందులో ఎల్లవ్వ మృతదేహం కనిపించింది. దీంతో అతను పోలీసులకు సమాచారం అందించాడు. వయసు పైబడటంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్‌ పేర్కొన్నారు.

అల్లీపూర్‌లో దొంగతనం

- 3 తులాల బంగారం, రూ.లక్ష చోరీ



సుల్తానాబాద్‌రూరల్‌: సుల్తానాబాద్‌ మండలంలోని అల్లీపూర్‌ గ్రామానికి చెందిన చిక్కుడు రవీందర్‌ ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్సై విజేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్‌ పాల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం ఉదయం పాలు సేకరించేందుకు ఇంటి తలుపులు దగ్గరకు వేసి, కుటుంబసభ్యులతో కలిసి డెయిరీ ఫాం వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా ఇంట్లోని సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉంది. బీరువాలో ఉన్న 3 తులాల బంగారం, రూ.లక్ష ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చిన గద్దర్‌

- ప్రజా యుద్ధ నౌకకు జిల్లాతో అనుబంధం
- ఆయన మృతికి కళాకారుల నివాళి

విద్యానగర్‌(కరీంనగర్‌): పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా.. పోరు తెలంగాణమా.. అంటూ తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చిన ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు కరీంనగర్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. కరీంనగర్‌లో ఐవీ సుబ్బారావు కలెక్టర్‌గా ఉన్న సమయంలో తొలిసారి జరిగిన జానపద విజ్ఞాన సదస్సుకు ఆయన హాజరయ్యారు. వామపక్ష ఉద్యమ ప్రస్థానంలో సాంస్కృతిక విప్లవానికి జీవం పోసిన గద్దర్‌ తెలంగాణ ఉద్యమంలో ధూంధాం పేరిట స్వరాష్ట్ర కల సాకారమయ్యేందుకు కళాకారులను ఒకే వేదిక పైకి తీసుకువచ్చారు. ప్రతిఒక్కరూ పోరుబాట పట్టడానికి ఆయన గళమే కారణమైంది. అప్పట్లో నిజాం సర్కారు మీద బండెనక బండి కట్టి అంటూ పాటను ఎక్కుపెట్టి, మొన్నటి తెలంగాణ ఉద్యమంలో 'పొడుస్తున్న పొద్దు మీద' వరకు పాటలతో ప్రజల్లో ఉత్తేజాన్ని, చైతన్యాన్ని నింపారు. ఆదివారం గద్దర్‌ మృతిచెందడంతో కరీంనగర్‌ జిల్లా కళాకారులు ఆయనతో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ నివాళి అర్పించారు.

గద్దరన్నతో వేదికలు పంచుకున్న




2009 తెలంగాణ ఉద్యమం నుంచి గద్దరన్నతో కలిసి ఎన్నో వేదికలు పంచుకున్న. రెండేళ్ల క్రితం బెల్లి లలితక్క పాటను ఆయన చేతులమీదుగా రిలీజ్‌ చెద్దామని వాళ్ల ఇంటికి వెళ్లాను. అప్పుడు ఆయన నేను గిన్ని పాటలు రాసిన.. పాడిన.. ఎవ్వడన్న నా మీద ఒక్క పాటన్న రాసిండ్రారా అని అన్నారు. పదేళ్ల కిత్రమే మీ మీద నేను పాట రాసిన.. కానీ మీరు విన్నట్లు లేదు అని మళ్లీ పాడి వినిపించిన. గద్దర్‌ జ్ఞాపకాలు మా మదిలో ఎప్పటికీ సజీవంగా ఉంటాయి.
– బుర్ర సతీశ్‌, జానపద గాయకుడు, కరీంనగర్‌

2013లో కరీంనగర్‌లో తెలంగాణ సభ



తెలంగాణ ఉద్యమ సమయంలో 2013లో కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన తెలంగాణ సభలో గద్దర్‌తోపాటు పాల్గొన్నాను. ఆ సభలో ఆయన ముందు మైక్‌ పట్టుకొని, మాట్లాడాను. ప్రజా ఉద్యమాలకు పురుడు పోసి, పీడిత ప్రజలను చైతన్యపరిచిన యుద్ధనౌక ఆగిపోవడం అణగారిన ప్రజానీకానికి తీరని లోటు.
– పూసాల సంపత్‌, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రజక సంఘం, కరీంనగర్‌

ఆయన పాటలకు కోరస్‌ పాడాను



మా అమ్మమ్మ ఊరు హుస్నాబాద్‌ పరిధిలోని మీర్జాపూర్‌. నేను హుస్నాబాద్‌లో 5వ తరగతి చదువుతున్నప్పుడు స్థానిక అమర వీరుల స్తూపం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అప్పుడే మొదటిసారి ఆయనను మా తాతతో వెళ్లి, కలిశాను. ఆ తర్వాత ఉద్యమ సమయంలో అనేకసార్లు గద్దర్‌ పాటలకు కోరస్‌ పాడాను. ఆయన మరణం సమాజానికి తీరని లోటు. ఆయన పాట ఎప్పటికీ ప్రజాబాహుళ్యంలో ఉంటుంది. – కోటి అమూల్య, జానపద గాయని, కరీంనగర్‌

2010లో కలిశాను



2010లో తొలిసారి గద్దర్‌ను ఆయన ఇంట్లోనే కలిశా. ఆయన పాటలు విని, పాటడం నేర్చుకున్న. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో వేదికలపై పాలుపంచుకున్న. గద్దర్‌ లేని తెలంగాణ పాటను ఊహించడం కష్టం. – పొద్దుపొడుపు శంకర్‌, జానపద గాయకుడు, కరీంనగర్‌

ప్రొఫెసర్‌ జయశంకర్‌కు నివాళి



జయశంకర్‌ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మేయర్‌ సునీల్‌రావు, కార్పొరేటర్లు

కరీంనగర్‌: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్‌ జయంతిని పురస్కరించుకొని ఆదివారం మేయర్‌ వై.సునీల్‌రావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. జయశంకర్‌ ఆశయసాధనలో భాగమే తెలంగాణ రాష్ట్ర సాధన అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

మహాపాదయాత్ర ముగింపు సభకు రండి



పాదయాత్ర చేస్తున్న నాయకులు

కరీంనగర్‌: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్స్‌లో జరిగే విద్యార్థి చైతన్య మహాపాదయాత్ర ముగింపు సభకు తరలిరావాలని ఫెడరేషన్‌ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్‌ పిలుపునిచ్చారు. ఆదివారం మహాపాదయాత్ర జిల్లా కేంద్రానికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 450 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకొని, అనేక విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్లకు వెళ్లామని తెలిపారు. హాస్టళ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ చార్జీలు లేక పౌష్టికాహారం తినలేని దుస్థితి నెలకొందన్నారు. జూనియర్‌ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తానని చెప్పిన ప్రభుత్వం దాని ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందజేయడం లేదన్నారు. జిల్లాలో 16 మండలాలు ఉంటే ఏ మండలంలోనూ రెగ్యులర్‌ ఎంఈవో లేరని తెలిపారు. ఖాళీగా ఉన్న లెక్చరర్‌, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, జిల్లాలో ప్రభుత్వ ఇంజినీర్‌ కళాశాల ఏర్పాటు చేయాలని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. నాయకులు మక్కపెల్లి పూజ, జిల్లా అధ్యక్షుడు కాంపల్లి అరవింద్‌, సహాయ కార్యదర్శి వినయ్‌, వినీషా, శ్రీజ, జిల్లా ఉపాధ్యక్షులు రోహిత్‌, సురేష్‌, మనోజ్‌, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్‌, రాకేశ్‌, సందీప్‌, శ్రీవాణి, శివ తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న 'అల్ఫోర్స్‌ జిగేల్‌'



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొత్తపల్లి: విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని, ప్రోత్సాహం అందిస్తే వాటిలో పట్టు సాధిస్తారని అల్ఫోర్స్‌ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌ రెడ్డి అన్నారు. రేకుర్తిలోని అల్ఫోర్స్‌ జూనియర్‌ కళాశాలల ఆధ్వర్యంలో ఆదివారం అల్ఫోర్స్‌ జిగేల్‌ పేరిట నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనను జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన ఉండాలన్నారు. వారికి వారాంతపు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల నత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణురాలు కె.అనిత, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ ఇవ్వండి



కరీంనగర్‌: ఉపాధ్యాయ బదిలీ ఉత్తర్వులు 5, 9 అసెంబ్లీ చట్టబద్ధత పొందినందున సోమవారం కోర్టు అనుమతి తీసుకొని, వెంటనే టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ విడుదల చేయాలని టీఆర్‌టీఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం రమేశ్‌ ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌ పాఠశాల ఆవరణలో జిల్లా అధ్యక్షుడు నందికొండ విద్యాసాగర్‌ అధ్యక్షతన నిర్వహించిన ఫెడరేషన్‌ జిల్లా శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్‌ రద్దు, పీఆర్‌సీ ఏర్పాటు, ఐఆర్‌లపై సీఎం కేసీఆర్‌ ప్రకటన చేయాలన్నారు. ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, విద్యావలంటీర్లు, పాఠశాలల స్వీపర్లు, స్కావెంజర్ల నియామకం విషయంలో ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఆర్థిక శాఖ మంత్రి అసెంబ్లీలో మాట్లాడుతూ.. బిల్లులు ఈ నెల లేదా వచ్చే నెలలో పెండింగ్‌ ఉండవని పేర్కొన్నారని, అసెంబ్లీలో ఇచ్చిన మాటలు అమలయ్యేలా చర్యలు ఉండాలన్నారు. పండిత పోస్టుల అప్‌గ్రేడేషన్‌, 10 వేల ఎల్‌ఎఫ్‌ఎల్‌ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు. భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యను తక్షణం పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపల్లి అశోక్‌రావు నివేదికను ప్రవేశపెట్టగా కార్యవర్గం చర్చించి, ఆమోదించింది. రాష్ట్ర బాధ్యులు దయాకర్‌, మధుచంద్ర, సర్వర్‌, ప్రభాకర్‌రావు, జిల్లా బాధ్యులు హబిబర్‌ రహమాన్‌, రమణారావు, రవీందర్‌ రెడ్డి, సుధాకర్‌ రెడ్డి, సలీం, గంగాధర్‌, భానుప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎడ్లు మృతి



మృతి చెందిన ఎడ్లు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు ఎడ్లు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. వెదిరకు చెందిన పన్యాల లచ్చిరెడ్డి భూమిని అదే గ్రామానికి చెందిన శనిగరపు మల్లేశం అనే రైతు వరి నాటు వేసేందుకు ఆదివారం గొర్రుతో చదును చేస్తున్నాడు. ఈ క్రమంలో పొలం గట్టు పక్కనున్న విద్యుత్‌ ఇనుప స్తంభానికి విద్యుత్‌ సరఫరా అయింది. గమనించిన లచ్చిరెడ్డి మల్లేశంను అప్రమత్తం చేయడంతో పొలం గట్టు పైకి వచ్చాడు. విద్యుత్‌ షాక్‌కు గురై, ఎడ్లు అక్కడికక్కడే మృతిచెందాయి. సంఘటన స్థలాన్ని విద్యుత్‌ శాఖ అధికారులు పరిశీలించారు. ఎడ్ల విలువ రూ.లక్ష పైన ఉంటుందని తెలిపారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మహిళను వేధించిన కేసులో వ్యక్తి రిమాండ్‌

జమ్మికుంట: మహిళను వేధించిన కేసులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు పంపించినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మున్సిపల్‌ పరిధిలోని మారుతి నగర్‌కు చెందిన ఓ మహిళను జమ్మికుంట పట్టణానికి చెందిన ఓరుగంటి శ్రీనివాస్‌రావు(రౌడీ షీటర్‌) నెల రోజులుగా వెంట పడుతూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. శనివారం కిరాణా దుకాణానికి వెళ్లగా వెంబడించి, అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె ప్రశ్నించడంతో చేయి చేసుకొని, అసభ్య పదజాలంతో దూషించి, చంపుతానని బెదిరించాడు. బాధిరాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం శ్రీనివాస్‌రావును అరెస్టు చేసి, రిమాండ్‌ తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

10న తపస్‌ ధర్నా విజయవంతం చేయండి



కరీంనగర్‌: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్‌) ఆధ్వర్యంలో ఈ నెల 10న కలెక్టరేట్‌ ఎదుట నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా రాజేశ్వర్‌ కోరారు. ఆదివారం కరీంనగర్‌లోని తపస్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ వేసి, ఐఆర్‌ ప్రకటించడం, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టడం, పెండింగ్‌ బిల్స్‌ చెల్లింపు, మోడల్‌ స్కూల్‌, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు రంగారావు, వెంకటరమణారావు, తిరుపతిరావు, వినయధర్‌ రాజు, అచ్యుతరెడ్డి, సత్యం, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, హరిచరణ్‌, శంకరయ్య, వెంకటేశ్వర్లు, మల్లికార్జున్‌, సత్యం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌, ద్విచక్రవాహనం ఢీ

- ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌ గ్రామంలో ట్రాక్టర్‌, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సైదాపూర్‌ మండలంలోని లస్మన్నపల్లికి చెందిన మాడ రాఘవరెడ్డి ఆదివారం విక్కీ అనే యువకుడితో కలిసి ద్విచక్రవాహనంపై రాజాపూర్‌ వెళ్తున్నాడు. మొలంగూర్‌లో వీరి వాహనం, కాచాపూర్‌కు చెందిన ట్రాక్టర్‌ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాఘవరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది సురేశ్‌ వచ్చి, బాధితుడికి ప్రథమ చికిత్స చేసి, ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ తరగతులు



రామేశ్వర్‌గౌడ్‌ను సన్మానించిన డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్‌: ఎస్‌ఈఆర్‌టీ, విల్‌ టు కెన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంగ్లిష్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో 40 రోజుల ఉచిత ఆన్‌లైన్‌ శిక్షణ తరగతులు కరీంనగర్‌ జిల్లా టీచర్లకు నిత్యం ఒక గంటపాటు జరగనున్నాయి. ఆదివారం ఫిజికల్‌ క్లాస్‌ కలెక్టరేట్‌ ఆడిటోరియంలో తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో జనార్దన్‌రావు హాజరై, మాట్లాడారు. టీచర్లు ఇంగ్లిష్‌ బాగా నేర్చుకొని, ఫీలింగ్స్‌ ద్వారా భాషను నేర్పించినట్లయితే పిల్లలు బాగా నేర్చుకోగలుగుతారని తెలిపారు. విల్‌ టు కెన్‌ సంస్థ అధినేత రామేశ్వర్‌ గౌడ్‌ 500 మంది ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంగ్లిష్‌ సులభంగా ఎలా మాట్లాడవచ్చో చెప్పారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఇప్పటివరకు రాష్ట్రంలోని 13 జిల్లాల్లో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వివిధ అంశాల్లో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి శిక్షణ తరగతులు మరికొన్ని నిర్వహించాలని డీఈవోను కోరారు. కార్యక్రమంలో క్వాలిటీ కో–ఆర్డినేటర్‌ కె.అశోక్‌ రెడ్డి, మండల విద్యాధికారి మధుసూదనాచారి, డిస్ట్రిక్ట్‌ సైన్స్‌ ఆఫీసర్‌ చాడ జయపాల్‌ రెడ్డి, తెలంగాణ మాథ్స్‌ ఫోరం జిల్లా అధ్యక్షుడు జంగ మనోహర్‌ రెడ్డి పాల్గొన్నారు.

పర్సు పోయిందని ఠాణా భవనం ఎక్కాడు

- కరీంనగర్‌లో యువకుడి హంగామా



పోలీస్‌స్టేషన్‌ భవనంపై కూర్చున్న రాజు

కరీంనగర్‌ క్రైం: కరీంనగర్‌ బస్టాండ్‌లో నా పర్సు పోయింది.. దొరకకుంటే చచ్చిపోతానంటూ ఓ యువకుడు వన్‌ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ భవనం పైకి ఎక్కి, హంగామా చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. గన్నేరువరం మండలంలోని జంగపల్లికి చెందిన చింటు అలియాస్‌ రాజు పర్సును శనివారం రాత్రి కరీంనగర్‌ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. రాత్రి నుంచి పోలీసులకు చెబుతుంటే పట్టించుకోవడం లేదంటూ ఆదివారం ఠాణా భవనం పైకి ఎక్కి, కూర్చున్నాడు. పర్సు దొరకకుంటే దూకి చనిపోతానని బెదిరించాడు. పోలీసు సిబ్బంది అతన్ని కిందకు దింపే ప్రయత్నం చేసినా వినకుండా అరగంటపాటు హంగామా చేశాడు. చివరికి రాజును మాటల్లో పెట్టి, పైకి వెళ్లి తీసుకువచ్చారు. అతను మద్యం మత్తులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఓపెన్‌ డిగ్రీలో ప్రవేశానికి 15 వరకు గడువు

హుజూరాబాద్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో దూరవిద్య విధానం ద్వారా పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్‌ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 15వ తేదీ గడువు ఉందని హుజూరాబాద్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.ఇందిరాదేవి, అధ్యయన కేంద్రం కో–ఆర్డినేటర్‌ శనిగరపు సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా వివరాలకు 98852 88540, 93983 62887 నంబర్లలో సంప్రదించాలన్నారు. అలాగే శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని వీఎస్‌ఆర్‌ డిగ్రీ కళాశాలలో బీఏ జర్నలిజం కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వి.వి.ఎస్‌.హనుమకుమార్‌ తెలిపారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తు అందజేయాలని సూచించారు.





'సండే' సరదాగా..

- కేబుల్‌బ్రిడ్జిపై ఫ్రెండ్‌షిప్‌ డే జోష్‌
- ఇరువైపులా కిక్కిరిసిన పర్యాటకులు
- సెల్ఫీలు, వీడియోలతో సందడి

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): ఆదివారం.. అందులోనూ ఫ్రెండ్‌షిప్‌ డే.. ఇంకేముంది నగరశివారులోని కేబుల్‌ బ్రిడ్జి పర్యాటకులతో సందడిగా మారింది. పెద్దవాళ్లు.. యువత..చిన్నారులు.. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి వంతెనపై సందడిగా గడిపారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా వంతెనపైనే కేక్‌కట్‌ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సెల్ఫీలు దిగి సందడిగా గడిపారు. యూట్యూబ్‌ వీడియోలు, రీల్స్‌, స్నాప్‌చాట్‌లతో సరదాగా గడిపారు. పలువురు చిన్నారులు డ్యాన్స్‌లతో ఆకట్టుకున్నారు. పెద్ద ఎత్తున పర్యాటకులు తరలిరావడంతో బ్రిడ్జిపై ట్రాఫిక్‌ జాం అయ్యింది.

ఏటా కలుస్తాం



మాది పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సెక్రెడ్‌ హార్ట్‌ స్కూల్‌ ఓల్డ్‌ బ్యాచ్‌. ఏటా ఫ్రెండ్‌షిప్‌ డే రోజున అందరం కలుసుకుంటాం. ఈసారి కరీంనగర్‌ కేబుల్‌బ్రిడ్జి చూసేందుకు వచ్చాం. రోజంతా సరదాగా గడిపాం.
– లలిత, అధ్యాపకురాలు

హైదరాబాద్‌ నుంచి వచ్చా



ఫ్రెండ్‌షిప్‌ డే వేడుకలకు నేను హైదరాబాద్‌ నుంచి వచ్చా. ఫ్రెండ్స్‌ అందరం రోజంతా సరదాగా గడిపాం. మేం సెక్రెడ్‌ హార్ట్‌ స్కూల్‌ పేరిట ఫౌండేషన్‌ స్టార్ట్‌ చేశాం. సమాజ సేవకు ఉపయోగిస్తున్నాం. ఈసారి కేబుల్‌బ్రిడ్జిపై ఫ్రెండ్‌షిప్‌డే జరుపుకోవడం సంతోషాన్నిచ్చింది. – శ్రీనివాస్‌

పేరెంట్స్‌తో వచ్చా



మాది కరీంనగర్‌. ఉదయం ఫ్రెండ్స్‌తో, సాయంత్రం పేరెంట్స్‌తో కేబుల్‌ బ్రిడ్జిపై ఫ్రెండ్‌షిప్‌ డే వేడుకలు జరుపుకున్నాం. హ్యాపీగా ఉంది. కేబుల్‌ బ్రిడ్జి బాగుంది. – రిషిత

ఆనందంగా గడిపాం



మాది కరీంనగర్‌. ఫ్రెండ్‌షిప్‌ డే సందర్భంగా కేబుల్‌ బ్రిడ్జికి వచ్చాం. పేరెంట్స్‌తో కలిసి సంతోషంగా గడిపా. సాయంత్రం చాలా మంది వచ్చారు. ఫ్రెండ్‌షిప్‌ డే సందర్భంగా అందరినీ విష్‌ చేశాను. – సాన్విక

క్లుప్తంగా

మానేరు వాకర్స్ వెల్ఫేర్ నూతన కార్యవర్గం ఎన్నిక


కనకాచారి

సప్తగిరికాలనీ(కరీంనగర్): మానేరు వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఆనందం, ముఖ్య సలహాదారుడిగా గంగుల సుధాకర్, అధ్యక్షుడిగా రేవోజు కనకాచారి, ప్రధాన కార్యదర్శిగా ముసుకుల విద్యాసాగర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మడుపు మోహన్‌రెడ్డి, నరసింహారావు, లక్ష్మి, కనకయ్య, సంయుక్త కార్యదర్శులుగా కటకం శ్రీనివాస్, రాజేందర్, రేణు శర్మ, ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీపతి, బత్తిని సంపత్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గునుకుల సత్యనారాయణరెడ్డి, సలహాదారులుగా నారాయణరెడ్డి, రామలింగారెడ్డి, దాసరి తిరుపతిరెడ్డి, హనుమంతరావు, రఘు శంకర్ రెడ్డి, గూడ సత్యనారాయణరెడ్డి, వెంకట నరసయ్య, జె.హనుమంతరావులతో పాటు సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ వాకర్స్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి టీకా

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో సోమవారం నుంచి గ్రామాల వారీగా పశువులకు గాలికుంటు వ్యాధి నియంత్రణ టీకా వేయనున్నట్లు బొమ్మకల్ పశువైద్యాధికారి రామకృష్ణ తెలిపారు. సోమవారం తాహెర్‌కొండాపూర్, బహదూర్‌ఖాన్‌పేట, 8న ఫకీర్‌పేట, జూబ్లీనగర్, 9న ఇరుకుల్ల, ఎలబోతారం, 10న దుర్శేడ్, 11న గోపాల్‌పూర్, 12న చామనపల్లి, దుబ్బపల్లి, 14న వల్లంపహాడ్, తీగలగుట్టపల్లి, 16న నల్లగుంటపల్లి, మొగ్దుంపూర్, 17న ఆరెపల్లి, 18న చెర్లభూత్కూర్, 19న చేగుర్తి, 21న బొమ్మకల్ గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు తప్పకుండా రైతులు వేయించాలని సూచించారు.

ఎంఐఎంలో చేరిక


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గులాం అహ్మద్ హుస్సేన్

విద్యానగర్(కరీంనగర్): నగరంలోని వివిధ డివిజన్లకు చెందిన పలువురు యువకులు ఆదివారం ఎంఐఎం పార్టీలో చేరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 12 డివిజన్ల నుంచి 250 మంది ఎంఐఎంలో చేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, యూసుఫ్, ఖమరుద్దీన్ ఇబ్రహీం, కార్పొరేటర్ షర్ఫుద్దీన్, నాయకులు అతిన, అలీబాబా, అజార్ దబీర్, ఫసియుద్దీన్ ఖాలీద్ పాల్గొన్నారు.

సుష్మా స్వరాజ్‌కు నివాళి



కరీంనగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పార్లమెంట్‌లో ఎలుగెత్తిన తెలంగాణ చిన్నమ్మ, మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ నేత సుష్మా స్వరాజ్ వర్ధంతి, తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఆదివారం ఎంపీ కార్యాలయంలో నిర్వహించారు. ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, క్లెం వాసుదేవ రెడ్డి, నాయకులు బండ రమణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి, రమేశ్, రాచర్ల శ్రీనివాస్, కొండల్ రెడ్డి, గుర్రం సంతోష్ ముప్పు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు నివాళి


జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం


పోలీస్ కమిషనరేట్‌లో..


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..


నివాళి అర్పిస్తున్న వోపా బాధ్యులు


జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...

కరీంనగర్/కరీంనగర్‌క్రైం/విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణలో ఆయన సేవలను కొనియాడారు.

- బీఆర్ అంబేడ్కర్ బస్‌స్టేషన్‌లో రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.చందర్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె.సత్యనారాయణ, సెక్యూరిటీ అధికారి భావ్‌రావు, పర్సనల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్య, వన్, టూ డిపోల మేనేజర్లు, ప్రవీణ్, మల్లయ్య, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రజనీకృష్ణ, మనోహర్‌రెడ్డి, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.
- పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ ఎ.లక్ష్మీనారాయణ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమకారుడిగా ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన వ్యక్తి జయశంకర్ సార్ అన్నారు. ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్‌ఐలు సురేష్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.
- మంకమ్మతోటలోని బీసీ సంఘం జిల్లా కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలను కొనసాగించాలని అన్నారు.
- నగరంలోని విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వోపా రాష్ట్ర కన్వీనర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు వేములవాడ ద్రోణాచారి, జిల్లా అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి గజ్జెల హరిహరాచారి, కోశాధికారి యాస్వాడ అంజయ్య, కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యోగులు గౌతమి, బీఆర్‌ఎస్ నాయకులు సోమిరెడ్డి నరేశ్ రెడ్డి, గుర్రం సతీశ్, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.


బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

- జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండోజు లక్ష్మయ్య, సంఘం నాయకులు బ్రహ్మశ్రీ, రవీంద్రచారి, శ్రీనివాస్, ప్రభాకర్, సత్యనారాయణ, శ్రీనివాస్, రమేశ్, బ్రహ్మచారి, దామోదర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతం స్నేహం


కేక్ కట్ చేసిన మేయర్ సునీల్‌రావు


గ్రంథాలయంలో..


కోరా, జాన్సన్ పాఠశాలలో..

సప్తగిరికాలనీ: స్నేహితుల దినోత్సవం కుల, మత బేధాలు లేని సమైక్యతకు ప్రతీక అని కరీంనగర్ కశ్మీర్‌గడ్డ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, నగర మేయర్ సునీల్‌రావు అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా నగరంలోని కశ్మీర్‌గడ్డ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కుల, మత బేధాలకు అతీతంగా నిర్వహించుకునే పండుగ స్నేహితుల దినోత్సవమన్నారు. వాకర్స్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధుసూదనాచారి, సభ్యులు సయ్యద్ సైఫొద్దీన్, ఆది శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌రావు, విద్యాసాగర్, బాబా, రాము, కమల్, నారాయణ, లక్ష్మీనారాయణ, ఖలీల్ అహ్మద్, భూమయ్య, ఫజల్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

కరీంనగర్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్ విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఒకరికొక్కరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకొని స్వీట్లు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, యూత్ నాయకులు సంపత్‌గౌడ్, శ్రావణ్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, రవిగౌడ్, చుక్క శ్రీనివాస్, సతీశ్, గ్రంథాలయ సిబ్బంది గౌతమి, లక్ష్మి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కోరా, జాన్సన్ పాఠశాలలో..

నగరంలోని కోరా, జాన్సన్ పాఠశాలలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చిన్నారుల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందించాలని అన్నారు. విద్యార్థులు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగళ సంతోశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొలం కాదు.. వడగళ్ల ఫలితం


ఇది వానాకాలంలో సాగు చేసిన వరి పొలం అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ఇది నాటేసిన పొలం కాదు మరి. కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో యాసంగి సీజన్‌లో వరిపంట కోత దశలో కురిసిన వడగళ్ల వానకు పొలంలో రాలిన గింజలు ఇటీవల కురిసిన వర్షాలకు మొలకెత్తి పొలాన్ని తలపిస్తోంది. చామనపల్లి, తాహెర్‌కొండాపూర్, చెర్లభూత్కూర్ తదితర గ్రామాల్లోని పొలాల్లో కనిపిస్తున్న ఈ దృశ్యాలను చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - కరీంనగర్‌రూరల్

గద్దర్ మరణం తీరని లోటు


గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


చెర్లభూత్కూర్‌లో..


నివాళి అర్పిస్తున్న మాలమహానాడు నేతలు

కరీంనగర్‌టౌన్: తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాటలు ఉర్రూతలూగించాయని, ఆయన మరణం తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఇందిరాచౌక్ వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం తన గొంతుకతో యుద్ధ నౌక అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం విలాస్‌రెడ్డి, దన్న సింగ్, షబానా మహమ్మద్, కుర్ర పోచయ్య, ఎండీ చాంద్, పొరండ్ల రమేశ్, సలేమొద్దీన్, మెతుకు కాంతయ్య, అన్నే జ్యోతిరెడ్డి, నెల్లి నరేశ్, కంకణాల అనిల్ కుమార్, మహమ్మద్ బారీ, బషీర్, ఇమామ్, సయ్యద్ ఖలీల్, హనీఫ్, ముల్కల యోనా, మామిడి సత్యనారాయణ రెడ్డి, దామోదర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ కార్యాలయంలో..

కరీంనగర్‌టౌన్: ప్రజా యుద్ధనౌక, గాయకుడు గద్దర్ మృతికి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, వెన్న రాజమల్లయ్య, శకుంతల, సీరాజ్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, ఎండి ఇమ్రాన్, రోల్ల సతీశ్ పాల్గొన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో..

గద్దర్ మృతి తీరని లోటని మాల మహానాడు నేతలు అన్నారు. నగరంలోని కోర్టు చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో తాళ్ల వెంకటేష్, ఇరుకుల యాదగిరి, కాడే శంకర్, కర్నే పవన్‌కుమార్, దామెర సత్యం, కటకం లోకేష్, ఎన్ని రాజమల్లయ్య, గోడ కనకయ్య, గంటల రేణుక, శకుంతల, మాధవి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..

కరీంనగర్: కలెక్టరేట్ ఎదుట ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు ప్రజా సంఘాల నాయకుడు పొలాడి రామారావు, సంఘం నాయకులు మీసాల మల్లిక్, తిరుపతి, బలరాంనాయక్, రమేశ్, రవి, రాధాకృష్ణ, జయరాం, శంకర్, నర్సింగం, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చెర్లభూత్కూర్‌లో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ఆదివారం రాత్రి ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు యువకులు కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మెరుగు శ్రీధర్, మాసగోని రమేశ్‌గౌడ్, కదారి రమేశ్, గుర్రం మునీందర్, ఆకుల రాజు, ఈరు శంకరయ్య, కుమార్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు


చామనపల్లిలో దెబ్బతిన్న సీసీ రోడ్డు

కరీంనగర్‌రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కరీంనగర్ మండలంలో రహదారులు ధ్వంసమయ్యాయి. పలు గ్రామాల్లోని పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ రహదారులు వరద ఉధృతికి దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల కొట్టుకపోయాయి. గతంలో ఎక్కడైతే కల్వర్టులు, రహదారులు ధ్వంసమయ్యాయో మళ్లీ అక్కడే రోడ్లపై బీటీ కొట్టుకపోయి గుంతలేర్పడ్డాయి. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖ ఇంజినీరింగ్ అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి వరద ఉధృతికి దెబ్బతిన్న కల్వర్టులు, రహదారులను పరిశీలించారు. ప్రాథమికంగా నష్టం వివరాలను అంచనా వేశారు. ఆయా రహదారులు, కల్వర్టుల మరమ్మతులకు అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించారు. పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో చెర్లభూత్కూర్–తాహెర్‌కొండాపూర్ రోడ్డు కొట్టుకపోగా మరమ్మతుకు రూ. 2లక్షలు, చామనపల్లి–బహదూర్‌ఖాన్‌పేట రోడ్డు మరమ్మతుకు రూ.2లక్షలతో ప్రతిపాదన చేసినట్లు పీఆర్ ఏఈ రమణారెడ్డి తెలిపారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో రోడ్లు, కల్వర్టుల తాత్కాలిక మరమ్మతుకు రూ.11కోట్లు, శాశ్వత నిర్మాణాలకు రూ.14కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపించినట్లు ఏఈ లక్ష్మణ్‌రావు తెలిపారు.

- చెర్లభూత్కూర్–ఐతరాజ్‌పల్లె నడుమ ఉన్న లోలెవల్ కల్వర్టు తాత్కాలిక మరమ్మతుకు రూ.5లక్షలు కాగా వంతెన నిర్మాణానికి రూ.4కోట్లు.
- మొగ్దుంపూర్–చెర్లభూత్కూర్ మధ్య ఉన్న లోలెవల్ కల్వర్టు మరమ్మతుకు రూ. 5లక్షలు కాగా వంతెన నిర్మాణానికి రూ. 4కోట్లు.
- నగునూరు పాతరోడ్డు తాత్కాలిక మరమ్మతుకు రూ.3లక్షలు, వంతెన నిర్మాణానికి రూ.4కోట్లు.
- కొత్తపల్లిలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కిష్టరావుపేట లోలెవల్ కల్వర్టు తాత్కాలిక మరమ్మతుకు రూ.3లక్షలు, వంతెన నిర్మాణానికి రూ.2కోట్లు.

పచ్చిగడ్డి తింటూ పంచాయతీ కార్మికుల నిరసన


పచ్చిగడ్డి తింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట డిమాండ్లను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారంతో 32 రోజుకు చేరింది. ఆందోళనలో భాగంగా సమ్మె శిబిరంలోని పంచాయతీ కార్మికులు పచ్చిగడ్డిని తింటూ వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. నెలరోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సమంజసం కాదని గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కూర అంజిరెడ్డి అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు సంపత్, కాశిపాక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని విద్యానగర్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మేయర్ సునీల్‌రావు తెలిపారు. డివిజన్ అభివృద్ధి కోసం సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకోవడం మంచిపరిణామమని అన్నారు. ఆదివారం నగరంలోని విద్యానగర్ పద్మావతి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన విద్యానగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యానగర్, కొత్త యాస్వాడ అభివృద్ధికి ఎన్నో నిధులు కేటాయించామని తెలిపారు. వెంకటేశ్వరస్వామి రోడ్డును నెలలోగా పూర్తి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ తదితర పనులను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ ఎదుట నైట్ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేస్తున్నామని, దీంతో విద్యానగర్‌కు మరింత శోభ చేకూరుతుందన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముప్పిడి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గుంటుక ప్రసాద్, ఉపాధ్యక్షులు కొలనుపాక అనిల్, కొల్లూరి భారతి, కోశాధికారి గూడ సూర్యప్రకాశ్ రెడ్డి, వూట్ల రజిత, కార్తీక్, ప్రభాకర్, రాజిరెడ్డి, మురళీధర్‌రావు, మారుతి, కామ అంజిబాబు, శ్రీరామ్ భద్రయ్య, మీరయ్య, అమర్‌బాబు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటి పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు భగత్‌నగర్ ఏరియాలోని ఎన్‌జీవోస్ కాలనీ, శివాలయం వెనుక ప్రాంతం, శివగంగ వాటర్ ప్లాంట్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

వినూత్నంగా రవీందర్ సింగ్ జన్మదిన వేడుకలు


మద్యం బాటిళ్లు పంపిణీ చేస్తున్న కేమసారం తిరుపతి

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర పౌరసరఫరా కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ పుట్టిన రోజు వేడుక కొత్త సంప్రదాయానికి తెర తీసింది. పుట్టిన రోజు సందర్భంగా కేక్ కటింగ్‌లు, అన్నదానాలు, రక్తదానాలు, పండ్లు, బట్టల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించడం సర్వసాధారణం, కాగా ఆదివారం జరిగిన రవీందర్‌సింగ్ పుట్టిన రోజు వేడుకల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేమసారం తిరుపతి కొత్త ఒరవడిని సృష్టిస్తూ ఏకలవ్యనగర్‌లో 200 మంది ఎరుకల కుటుంబాలకు పంది మాంసంతో పాటు మద్యం బాటిళ్లు(180 ఎంఎల్), 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎరుకల జాతి తరఫున రవీందర్‌సింగ్‌కు వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ చౌక్‌లో..

నగరంలోని తెలంగాణచౌక్‌లో బర్త్‌డే కేక్ కట్ చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో 100మంది టిప్పర్ డ్రైవర్లకు హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. కిసాన్‌నగర్‌లో రెండు క్వింటాళ్ల టమాటాలు అందజేశారు.

'పెరుగుతున్న మనువాద మతోన్మాదం'

విద్యానగర్(కరీంనగర్): దేశంలో మనువాద, మతోన్మాద ఫాసిజం రోజురోజుకు పెరిగి పోతుందని విద్యా పరిరక్షణ వేదిక జాతీయ నాయకులు రమేశ్ పట్నాయక్ అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన భారత్ బచావో కరీంనగర్ జిల్లా సదస్సుకు ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదానికి పెను ప్రమాదం ఏర్పడిందన్నారు. భారత్ బచావో జిల్లా నిర్వహణ కమిటీ బాధ్యులు మర్వాడీ సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో గాదె ఇన్నారెడ్డి, వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



విద్యానగర్(కరీంనగర్): నగరంలోని కుమార్వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1985–86 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కేఈఎస్ గార్డెన్ వేదికైంది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా 37 ఏళ్ల తర్వాత ఒక్క చోట చేరి తమ చిన్న నాటి అనుభూతులను పంచుకున్నారు. నాడు చదువులు చెప్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఆటపాటలతో సందడి చేశారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు పెద్ది శ్రీధర్, కొత్త శ్రీనివాస్, తోట రమణ, నాళ్ల చంద్రశేఖర్, దేవులపెల్లి వాణి, అన్నపూర్ణ, ఎ.శ్రీనివాస్, ఆది కరుణాకర్ రావు, గుండా గోపాల్, పాల్తి లక్ష్మణ్, విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నిబద్ధతతో పనిచేస్తే అత్యున్నత స్థాయికి

ఆత్మీయ సన్మానసభలో హైకోర్టు రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి నవీన్‌రావు



జస్టిస్ నవీన్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

ధర్మారం(ధర్మపురి): నిబద్ధతతో పనిచేస్తే అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని హైకోర్టు రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పాను గోటి నవీన్‌రావు అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన జస్టిస్ నవీన్‌రావు, జిల్లా కోర్టు రిటైర్డు పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరిశంకర్‌రావును ఆదివారం రైతువేదిక సమావేశ హాల్‌లో హైకోర్టు ఏజీపీ సాయిరాం మున్నా ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆత్మీయ పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ నవీన్‌రావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న రంగాల్లో కష్టపడి ఎదిగి అత్యుత్తమ స్థానంలో నిలవాలని ఉద్బోధించారు. నంది మేడారం రిజర్వాయర్ టూరిజం అభివృద్ధికి, మేడారం శివారు ప్రాంతంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు తన వంతు ప్రయత్నాలు చేస్తానని తెలిపారు. మేడారంలో జూనియర్ సివిల్ జడ్జి- జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు భవన నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని హామీనిచ్చారు.

సీఎంకు పీఆర్టీయూటీఎస్ నేతల కృతజ్ఞతలు



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పీఆర్టీయూటీఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో పీఆర్సీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి అసెంబ్లీలో స్పష్టం చేయడం పట్ల ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్, తెలంగాణ (పీఆర్టీయూటీఎస్) నేతలు హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మిగులు నుంచి లోటుకు..

▶ మొదటి పేజీ తరువాయి

గణాంకాలను వెల్లడించింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ ప్రభుత్వ శాఖల ఆర్థిక పారదర్శకతపై ఆడిట్ నిర్వహించి కాగ్ రూపొందించిన నివేదిక అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం సభ ముందుంచకపోవడం గమనార్హం.

2021–22 అకౌంట్ల నిర్వహణలో కాగ్ గుర్తించిన ముఖ్యాంశాలు

- 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి అడ్వాన్సులు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో కనీస నగదు నిల్వ ఉంచింది 76 రోజులు. స్పెషల్ డ్రాయింగ్ సౌకర్యం (ఎస్‌డీఎఫ్) వినియోగించుకుంది 30 రోజులు. వేజ్ అండ్ మీన్స్‌కు వెళ్లింది 159 రోజులు. ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లింది 100 రోజులు.
- అడ్వాన్సులు తీసుకున్న 289 రోజుల్లో (ఎస్‌డీఎఫ్ 30, వేజ్ అండ్ మీన్స్ 159, ఓడీ 100 రోజులు కలిపి) ఎస్‌డీఎఫ్ కింద రూ.9,636 కోట్లు, వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్సుల రూపంలో రూ.34,969 కోట్లు వినియోగించుకుంది. ఓడీ కింద రూ.22,669 కోట్లు తెచ్చుకుంది.
- 2021–22 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అప్పుల రూపంలో తెచ్చిన రూ.42,936 కోట్లు, ప్రజాపద్దు కింద వినియోగించాల్సిన రూ.3,773 కోట్లను ద్రవ్యలోటు కింద చూపెట్టారు.
- ఆర్థిక జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బీఎం) కింద 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఇందులో రెవెన్యూ మిగులుతో ఖజానా నిర్వహించాలనేది మొదటి లక్ష్యం కాగా, రూ.9,335 కోట్లు రెవెన్యూ లోటు ఏర్పడింది. జీఎస్‌డీపీలో 3 శాతానికి మించకుండా ద్రవ్యలోటు ఉండాలనేది రెండో లక్ష్యం కాగా, అది 4.06 శాతంగా నమోదైంది. నికర అప్పులు జీఎస్‌డీపీలో 25 శాతం మించవద్దనే మూడో లక్ష్యం కూడా నెరవేరలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి జీఎస్‌డీపీలో 27.40 శాతం అప్పులు మిగిలాయి.
- రెవెన్యూ రాబడుల కింద వచ్చిన రూ.1,27,468 కోట్లలో దాదాపు 50 శాతం అనివార్య వ్యయం కిందనే ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఇందులో రూ.30,375 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలకు, రూ.19,161 కోట్లు వడ్డీ చెల్లింపులు, రూ.14,025 కోట్లు పింఛన్ల కింద ఖర్చు పెట్టారు.
- ఏప్రిల్ 1, 2021 నాటికి రాష్ట్ర ప్రభుత్వ నికర అప్పులు రూ.2,78,017.64 కోట్లు. ఆ ఏడాదిలో తీసుకున్న అప్పులు రూ.43,593.94 కోట్లు. 2022 మార్చి 31 నాటికి నికర అప్పులు రూ.3,21,611.58 కోట్లు.
- పలు కార్పొరేషన్లు, సంస్థలకు రుణాలు తీసుకునేందుకు గాను రూ.40,449 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చింది. దీంతో 2022 మార్చి 31 నాటికి ప్రభుత్వ నికర గ్యారంటీల మొత్తం రూ.1,35,283 కోట్లకు చేరింది.
- మొత్తం అప్పుల్లో రూ.28,883 కోట్లు మూలధన వ్యయం కింద, రూ.8,469 కోట్లు రుణాలు, అడ్వాన్సుల చెల్లింపులకు వెచ్చించారు. జీఎస్‌డీపీకి సమాంతరంగా మూలధన వ్యయం లేదు. జీఎస్‌డీపీలో 2.51 శాతం మాత్రమే మూలధన పద్దు కింద వెచ్చించారు.
- వివిధ మేజర్ పద్దులను ఆడిట్ చేయగా, ఉండాల్సిన నగదు నిల్వ కంటే తక్కువ ఉంది.
- 2021–22 ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రభుత్వ పథకాల అమలుకు గాను కేంద్రం నేరుగా ఇచ్చిన రూ.18,392 కోట్లు ప్రభుత్వ అకౌంట్లలో కనిపించలేదు. తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ లిమిటెడ్, తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లకు పలు పథకాల అమలు కోసం ఈ నిధులను కేంద్రం ఇచ్చింది.
- హౌసింగ్, పరిశ్రమల శాఖలకు బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం కంటే చాలా తక్కువ ఖర్చు పెట్టారు. బడ్జెట్ అంచనాల రూపకల్పనలో ఆయా శాఖలకు స్పష్టత లేని కారణంగానే ఇది జరిగింది.
- ఇక ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కంట్రిబ్యూటరీ పింఛన్ పథకం కోసం ప్రతి నెలా వసూలు చేసే మొత్తంలో రూ.2,074.22 కోట్లు మాత్రమే నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్)కు జమ చేసింది. మరో రూ.313.72 కోట్లు జమ చేయాల్సి ఉంది.

వివిధ స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు 2021-22లో విడుదల చేసిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ వివరాలు

సంస్థ	గ్రాంట్ ఇన్ ఎయిడ్ (రూ.కోట్లలో)
జిల్లా పరిషత్‌లు	4,615.15
పంచాయతీ సమితులు	1,137.38
గ్రామ పంచాయతీలు	2,768.15
మున్సిపల్ కార్పొరేషన్లు	685.79
మున్సిపాలిటీలు	1,010.18
చట్టబద్ధ కార్పొరేషన్లు	3,369.57
యూనివర్సిటీలు	1,031.76
అభివృద్ధి సంస్థలు	355.47
సహకార సంస్థలు	166.94
ఎన్జీవోలు	599.61
ఇతర సంస్థలు	43,327.03

(ఈ ఏడాదిలో మొత్తం రూ. 61,399.70 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో వివిధ సంస్థలకు ఇవ్వగా, అందులో రాష్ట్ర నిధులు రూ. 58,630.60 కోట్లు కాగా, కేంద్రం ఇచ్చిన నిధులు రూ. 2,769.10 కోట్లు)

బడ్జెట్ కన్నా అధికంగా, తక్కువగా వ్యయం (రూ.కోట్లలో) చేసిన శాఖల వివరాలు

అధిక వ్యయం చేసిన శాఖలు

శాఖ	బడ్జెట్ కేటాయింపు	ఖర్చు	తేడా శాతం
వైద్య, ఆరోగ్యం	381	509	34
పంచాయతీరాజ్	5,167	5,734	11
సాగునీటి శాఖ	11,490	12,071	5

తక్కువ ఖర్చు చేసిన శాఖలు

శాఖ	బడ్జెట్ కేటాయింపు	ఖర్చు	తేడా శాతం
హౌసింగ్	7,222	252	97
పరిశ్రమలు	1,686	286	83
పౌరసరఫరాలు	1,584	548	65
పురపాలక శాఖ	8,617	3,461	60

ప్రొఫెసర్ జయశంకర్‌కు సీఎం కేసీఆర్ నివాళి

- అసెంబ్లీహాల్‌లో జయశంకర్ చిత్రపటానికి మంత్రుల నివాళి
- జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా పాలన: కేటీఆర్



దివంగత ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దివంగత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా అసెంబ్లీహాల్‌లోని ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నివాళులర్పించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌తో పాటు మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, నిరంజన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, చీఫ్‌విప్ దాస్యం వినయ భాస్కర్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు, పలువురు ఎమ్మెల్యేలు జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. శాసన మండలి ప్రాంగణంలో జయశంకర్ చిత్రపటానికి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, చీఫ్‌విప్ భానుప్రసాదరావుతో పాటు పలువురు ఎమ్మెల్సీలు నివాళులర్పించినవారిలో ఉన్నారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని మంత్రి కేటీ రామారావు అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి కేటీఆర్ పార్టీ నేతలతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్రను నేతలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు పలు కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మంత్రుల నివాస సముదాయంలో

జయశంకర్ జయంతి సందర్భంగా మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆయన చిత్రపటం వద్ద రాష్ట్ర రోడ్లు భవనాలు, శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నివాళి అర్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ తన జీవిత కాలం తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం కృషి చేశారన్నారు.

ఎస్సై ఫలితాల వెల్లడి

- 587 ఉద్యోగాలకు 434 మంది పురుషులు, మహిళలు 153 మంది ఎంపిక
- నేడు వెబ్‌సైట్‌లో తుది ఎంపిక అభ్యర్థుల జాబితా
- నియామక బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా వివిధ విభాగాల్లో ఎస్సై, ఏఎస్సై పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి ఆదివారం విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితా పోలీస్ నియామక మండలి వెబ్‌సైట్‌లో సోమవారం ఉదయం నుంచి అందుబాటులో ఉండనుంది. ఈ మేరకు పోలీసు నియామక మండలి చైర్మన్ వి.వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. వివిధ విభాగాలకు చెందిన 587 ఉద్యోగాలకు 434 మంది పురుషులు, 153 మంది మహిళల్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎస్సై,ఏఎస్సై పోస్టులకు సోమవారం నుంచి టీఎస్ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో కటాఫ్ మార్కుల కేటాయింపు, అభ్యర్థుల జన్మతేదీ వంటి వివరాలు వెల్లడి స్తామన్నారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు 9 నుంచి 11 వరకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక ఫార్మాట్‌లో వారిపై ఉన్న కేసులు, మెడికల్ అంశాల వివరాలు అటెస్టేషన్ చేయించాలని సూచించారు. అటెస్టేషన్ కాపీని ఏ4 సైజులో ప్రింట్ తీసి, వాటిపై పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు అంటించి మూడు కాపీల్లో గెజిటెడ్ అధికారితో సంతకాలు చేయించి వాటిని సూచించిన కేంద్రాల్లో ఆగస్టు 14 నాటికి అందజేయాలని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో సందేహాల నివృత్తికి సైతం నియామక మండలి అవకాశం కల్పించింది. ఆగస్టు 7వ తేదీ నుంచి 9 వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో సందేహాలు నివృత్తికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు ఎస్సీ, ఎస్టీలకు రూ.2వేలు, ఇతరులకు రూ.3వేలు ఆన్‌లైన్‌లో చెల్లించాలని బోర్డు అధికారులు పేర్కొన్నారు.

'మత్స్యకారులంటే రాహుల్‌కు ప్రేమ'



మాణిక్ రావ్ ఠాక్రేకు జ్ఞాపికను ఇస్తున్న ఫెర్నాండో, సాయికుమార్. చిత్రంలో పొన్నాల, యాష్కీ

సాక్షి, హైదరాబాద్: చేపలు పట్టే సృజనాత్మకత కలిగిన మత్స్యకారులంటే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి ప్రేమ అని జాతీయ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ చైర్మన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఫెర్నాండో అన్నారు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం చైర్మన్ మెట్టు సాయికుమార్ అధ్యక్షతన ఆదివారం గాంధీభవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రోహిణ్ రెడ్డి, శత్రులతో పాటు ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఫెర్నాండో మాట్లాడుతూ రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీఇచ్చారు.

45 ఏళ్ల తరువాత ఒకేచోట...



లక్సెట్టిపేటలో పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

లక్సెట్టిపేట: వారంతా ఒకేచోట కలిసి చదువుకున్నారు. ఉన్నత చదువుల కోసం వేరే ప్రదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. మళ్లీ మండల కేంద్రంలోని గుండ పెద్దకాశయ్య ఆర్యవైశ్య భవనంలో కలుసుకున్నారు. వీరే జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1977–1978లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

బాసరలో భక్తుల రద్దీ



ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

భైంసా(ముధోల్): బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. వేకువజామునుంచే ఆలయంలో భక్తులు కిక్కిరిసి కనిపించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రద్దీ కొనసాగింది. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. తమ చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎస్టీపీపీ జీఎంగా బసివిరెడ్డి



బసివిరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

జైపూర్:జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు (ఎస్టీపీపీ) జీఎంగా పీసీ.బసివిరెడ్డి ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఆయాశాఖల అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీపీపీని విద్యుత్ ఉత్పత్తితోపాటు అన్నిరంగాల్లో ముందజల్లో ఉంచడానికి అధికారులంతా సమష్టిగా పని చేయాలని కోరారు. ఇందులో ఎస్టీపీపీ అధికారులు శ్రీనివాస్, రమణ, వేణుగోపాల్, లక్ష్మణ్, సముద్రాల శ్రీనివాస్, ధరావత్ పంతులానాయక్ ఉన్నారు.

ట్రిపుల్‌ఐటీలో ముగిసిన ఓరియంటేషన్



ఆడిటోరియంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

భైంసా(ముధోల్): 2023–24 విద్యాసంవత్సరంలో బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశం పొందిన నూతన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఆరేళ్ల ఇంజనీరింగ్ కోర్సు, ట్రిపుల్‌ఐటీ విద్యావిధానం, నేర్చుకునే అంశాలు, వివిధ కోర్సుల గురించి విద్యార్థులకు వివరించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. విద్యార్థులు జానపదాలపై వేసిన స్టెప్పులు ఆకట్టుకున్నాయి. ట్రిపుల్‌ఐటీ బాసర సెరల్ అండ్ సోషల్ యాక్టివిటీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

పాము కాదు చేపే...



ఈ ఫొటోలో కనిపిస్తున్నది పాము కాదు.. చేప. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం మైలారం మత్తడి వాగులో కర్పతి సాయి, అతిమల నీలయ్య ఆదివారం చేపలు పడుతుండగా వారి వలకు ఈ చేప చిక్కింది. మొదట వారు కొండచిలువ అనుకుని భయపడ్డారు. తర్వాత అది తంబు చేప అని గుర్తించారు. ఐదు ఫీట్ల పొడవున్న ఈ తంబు చేప ఎనిమిది కిలోలు బరువు ఉంది. పొడవైన, అరుదైన చేప లభించడం ఈ ప్రాంతంలో దొరకడం ఇదే మొదటి సారి అని తెలిపారు. దీనిని గుమ్మడి పాము చేప అని కూడా అంటారని పేర్కొన్నారు. ఇది ఎక్కువగా నదులు, సముద్రాల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఈ చేపను ఔషధాల తయారీకి ఉపయోగిస్తారని మత్స్యకారులు తెలిపారు. ఈ చేపను రూ.2,400 విక్రయించినట్లు పేర్కొన్నారు. – నెన్నెల

ఉత్తమ ఉపాధ్యాయుడిగా జమీల్ అహ్మద్



అవార్డు అందుకుంటున్న జమీల్ అహ్మద్

కుంటాల(ముధోల్): విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన మండలంలోని ఓలా ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన జమీల్ అహ్మద్ రాష్ట్ర ఉత్తమ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని సాలార్‌మిల్లర్ ఆడిటోరియం, ఉర్దూ మస్కాన్ ఖిల్వత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డును అందజేశారు. తెలంగాణ ఉర్దూ మీడియం అకాడమి చైర్మన్ కాజాముజిబొద్దీన్, కార్యదర్శి షఫీ ఉల్లా, మైనార్టీ కార్పోరేషన్ ఇంతియాజ్ ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. డీఈవో రవీందర్‌రెడ్డి, సర్పంచ్ కనీష్ ఫాతిమ, హెచ్ఎం సునీల్‌రెడ్డి అభినందించారు.

మిక్సోపతిపై నిరంతర పోరాటం

- డాక్టర్లపై దాడులు చేస్తే సహించేదిలేదు
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్.రావు
- కరీంనగర్‌లో ఐఎంఏ జోన్‌- 2 కాన్ఫరెన్స్




జ్యోతిప్రజ్వలన చేస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: మిక్సోపతితో ప్రజలకు కలిగే ఇబ్బందులపై నిరంతర పోరాటం చేస్తామని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్.రావు అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రతిమ మల్టీప్లెక్స్‌లో ఐఎంఏ జోన్–2 అకాడమిక్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీఎన్‌రావు మాట్లాడుతూ.. ఆర్ఎంపీలకు రెండు, మూడు నెలలు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేసి చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానం ద్వారా మంచి కన్నా చెడు ప్రభావం ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆరేళ్లపాటు మెడిసిన్ చదివినవారు వైద్యం అందిస్తుంటే... కేవలం రెండు నెలల్లోనే పూర్తి వైద్య పరిజ్ఞానాన్ని వారికి ఎలా నేర్పుతారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ జీవోను ఉపసంహరించుకోవాలని కోరారు. మెడికల్ కాలేజీలను జనాభాతో సంబంధం లేకుండా మంజూరు చేస్తున్నారని, తద్వారా నాణ్యమైన విద్య, వైద్యం అందకపోవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. చిన్న నర్సింగ్ హోమ్‌లను ప్రోత్సహించాలన్నారు. 10 పడకల ఆసుపత్రులకు కొన్ని మినహాయింపులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఐఎంఏ రాష్ట్రవ్యాప్తంగా 200లకుపైగా గ్రామాలను దత్తత తీసుకుని ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో కేన్సర్ వ్యాధిపై డాక్టర్ చేతన, గుండె వ్యాధులపై డాక్టర్ కిరణ్‌కుమార్, నరాలవ్యాధులపై డాక్టర్ రంజిత్‌కుమార్, నిద్రలేమిపై డాక్టర్ హర్షిణి వివరించారు. స్టేట్ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ అమిత్ కుమార్, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షకార్యదర్శులు పొలాస రాంకిరణ్, వెంకట్‌రెడ్డి, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, ఐఎంఏ రాష్ట్ర బాధ్యులు సంపత్ రావు, ఖాశీప్రసాద్‌రావు, ఎడవెల్లి విజేందర్‌రెడ్డి, అలీం, పి.కిషన్, వసంత్‌రావు, శ్రీధర్, రాచకొండ రమేశ్, సురేష్, విజయలక్ష్మి, ఝాన్సీ, శేషశైలజ, నవీన, ప్రీతితో పాటు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, హైదరాబాద్, వరంగల్ నుంచి అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

సిరిసిల్ల నేతన్నల బతుకు మార్చిన బతుకమ్మ

- బతుకమ్మ చీరపై కేటీఆర్ చిత్రం
- మంత్రికి నూలు పోగుల దండ
- నేడు తారక రామారావుకు ప్రదానం



బతుకమ్మ చీర అంచుపై మంత్రి కేటీఆర్ చిత్రం



నూలు పోగులతో తయారు చేసిన దండ

సిరిసిల్ల: ఆకలి చావులు.. ఆత్మహత్యల ఖిల్లా.. సిరిసిల్ల... ఇప్పుడు అభివృద్ధికి.. సంక్షేమానికి చిరునామాగా మారింది. సిరిసిల్ల నేతన్నల బతుకుచిత్రాన్ని మార్చిన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కేటీఆర్ చిత్రాన్ని బతుకమ్మ చీరల అంచులపై సిరిసిల్ల నేతన్నలు జకార్డు డిజైన్ సాయంతో నేశారు. ఆ చీరను, నూలు పోగుల దండను జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో సోమవారం జరిగే సమావేశంలో మంత్రి కేటీఆర్‌కు అందించనున్నారు. ఈమేరకు సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు, బీఆర్ఎస్ నాయకుల ప్రణాళిక సిద్ధం చేశారు. సిరిసిల్ల నుంచి 20 బస్సుల్లో నేతకార్మికులు, వస్త్రోత్పత్తిదారులు హైదరాబాద్‌లో జరిగే జాతీయ చేనేత దినోత్సవాన్ని తరలివెళ్తున్నారు.







రాజన్నకు మొక్కుల చెల్లింపులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు, ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం పంపిణీ చేపట్టారు. అనుబంధ బద్దిపోచమ్మ, భీమేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. రిటైర్డ్ ఐజీ టి.ప్రభాకర్‌రావు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ స్వాగతం పలికారు. ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు ప్రసాదాలు అందించారు. డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ కృష్ణకుమార్ తదితరులు ఉన్నారు.

మంచిమాట

పథం దృక్పథం



దృక్పథం... ప్రతి వ్యక్తికి తప్పనిసరిగా ఉండేది దృక్పథం. మనస్థితి, పరిస్థితి వీటిని బట్టి ఎవరికైనా దృక్పథం అన్నది ఉంటూనే ఉంటుంది. దృక్పథం ఉండని మనిషి ఉండడు. మనిషి అన్నాక దృక్పథం ఉండకుండా ఉండదు. దృక్పథం మనిషి మనుగడ స్థాయిని, తీరును, నిర్ణయిస్తుంది. దృక్పథం మనిషి ప్రగతికి, పతనానికి మూలం ఔతుంది. సరైన దృక్పథం లేకపోతే మనుగడ సరిగ్గా లేనట్టే; మేలైన దృక్పథం ఉంటే మనుగడ మేలుగా ఉన్నట్టే.

చంద్రుడిపై కాలు మోపిన తొలి మనిషి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అన్నది మనకు తెలిసిందే. కానీ ప్రణాళిక ప్రకారం ఎడ్విన్ ఆల్‌డ్రిన్ ముందుగా చంద్రుడిపై దిగాలి. ఆల్‌డ్రిన్ చంద్రుడిపై కాలు పెట్టబోయే తొలి మానవుడుగా నిర్ణయం అయిపోయింది. అయితే చంద్రుడిపై రాకెట్ దిగి తలుపులు తెరుచుకున్నాక ఆల్‌డ్రిన్ కదల్లేదు. అతడికి దిగమని ఆదేశాలు అందినా అతడు కదల్లేదు. ముందుగా చంద్రుడిపై దిగితే తనకు ఏం జరుగుతుందో అన్న దృక్పథం ఎడ్విన్ ఆల్‌డ్రిన్‌ను కదలనివ్వలేదు. ఆల్‌డ్రిన్ కదలకపోవడంతో ఆర్మ్‌స్ట్రాంగ్‌కు దిగమని ఆదేశాలు అందాయి. ఏమైనా పరవాలేదు అన్న దృక్పథంతో ఆర్మ్‌స్ట్రాంగ్ రాకెట్ నుంచి చంద్రుడిపై దిగాడు; చంద్రుడిపై కాలు మోపిన తొలి మానవుడుగా చరిత్రలో నమోదు అయ్యాడు. ఆల్‌డ్రిన్ ఆ అవకాశాన్ని తన దృక్పథం కారణంగా జారవిడుచుకున్నాడు; చారిత్రిక ప్రాశస్త్యాన్ని కోల్పోయాడు.

> 'దృక్పథం మనిషిని ఎత్తులకు తీసుకు వెళుతుంది. దృక్పథం మనిషిని చిత్తు చేస్తుంది. దృక్పథం ఎత్తుల్లో ఉన్న వ్యక్తిని చిత్తు అయేట్టు చేస్తుంది. దృక్పథం చిత్తు అయిన వ్యక్తిని ఎత్తులకు చేరుస్తుంది. ఎత్తులకు చేరుకోవడానికైనా, చిత్తు అయిపోవడానికి అయినా దృక్పథం కీలకం'

'మనం మన దృక్పథానికి అంటిపెట్టుకుని ఉంటాం అన్నీ దాని ఆధారంగానే ఉంటాయి అని. అయినా మన అభిప్రాయాలకు శాశ్వతతత్వం లేదు. వసంతం, హేమంతాలలాగా అవి తొలగిపోతూంటాయి' అని ప్రఖ్యాత చైనీస్ తత్త్వవేత్త జువాంగ్ చి ఒక సందర్భంలో అన్నారు. తన దృక్పథం సరైంది అనుకుంటూ దాన్నే అంటిపెట్టుకుని ఉండడం మనిషి బలహీనతల్లో బలమైంది. దృఢమైన దృక్పథం అన్నది మనిషికి బరువైన అవరోధం ఔతుంది. కదలని నీరు కాలక్రమంలో బురద అయిపోయినట్టుగా మారని దృక్పథం మనిషిని పాడు చేస్తుంది. మనిషి తన దృక్పథాన్ని మార్చుకోవడానికి సిద్ధంగా ఉండాలి. పరిణామాలను బట్టి దృక్పథం ఉండాలి. దృక్పథం ప్రయోజనాల్ని సాధించగలిగేదై ఉండాలి.

కొందరు నేతల దృక్పథ దోషాలవల్ల ప్రపంచానికి ఎంతో హాని జరిగింది, జరుగుతోంది. ఇవాళ్టి రోజున రష్యా, ఉక్రెయిన్ యుద్ధం విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఉక్రెయిన్‌పై రష్యా దృక్పథం, రష్యాపై ఉక్రెయిన్ దృక్పథం వల్లే యుద్ధం సాగుతూ పెనువినాశనం జరుగుతోంది. ఆ దృక్పథ వైరుధ్యం పలు ఇతర దేశాల్ని అవాంఛనీయ పర్యవసానానికి గురిచేస్తోంది. ఈ దుస్థితి తొలగిపోవాలంటే ఇంకా విధ్వంసం జరగకుండా ఉండాలంటే ఆ ఇరుదేశాల దృక్పథాలూ మారాలి.

వ్యక్తిపరంగానూ, సామాజికంగానూ, సాంస్కృతికంగానూ, కళల పరంగానూ, భాషపరంగానూ దృక్పథం తిన్నగా ఉండడమే కావల్సింది. దృక్పథం తిన్నగా ఉండకపోవడం నష్టాన్ని, నాశనాన్ని కలిగిస్తుంది. కొన్ని దశాబ్దుల క్రితం మెరుగైన దృక్పథం లోపించడంవల్ల ఇవాళ తెలుగు భాష, తెలుగు కవిత్వం వైభవాన్ని కోల్పోవడం కాదు వికృతం అయిపోయిన వైనాన్ని అందుకు ఉదాహరణగా మనం చూడచ్చు. పలువురు తమ దృక్పథాల్ని మార్చుకోలేక తాము పతనమైపోవడమే కాకుండా తమ కుటుంబాలకు తీక్షణమైన హాని చేస్తున్నారు. దృక్పథ వక్రత అన్న దానివల్ల సమాజానికి తీవ్రమైన చేటు కలుగుతోంది.

దృక్పథం అన్నది మనిషి మనుగడలో ప్రముఖమైంది ఆపై ప్రధానమైంది. ప్రతిమనిషికి దృక్పథం అన్నది ప్రత్యగ్రంగా ఉండాలి. మనిషికి దృక్పథం భవ్యంగా ఆపై సవ్యంగా ఉంటే సత్పథం అమరుతుంది. సత్పథం అమరితే మనుగడ ఉన్నతంగా ఆపై ఉజ్జ్వలంగా ఉంటుంది. కనుక మనిషి తన దృక్పథాన్ని సరిచూసుకుంటూ ఆపై సరిచేసుకుంటూ మనుగడకు మహత్తును సాధించుకోవాలి.

– రోచిష్మాన్

గురువాణి | వాగ్గేయకార వైభవం

నోటిమాట నిప్పుతో సమానం













మనకు ప్రధానంగా మూడు ఉపకరణాలుంటాయి–శరీరం, మనస్సు, వాక్కు. శరీరం అన్నం చేత తయారవుతుంది. సూక్ష్మ శరీరమైన, సంకల్ప వికల్ప సంఘాతమైన మనస్సు కూడా అన్నం వలననే తయారవుతుంది. ఇది ప్రాణం అత్యంత ప్రధానమైనది. ఎంతకాలం ప్రాణం లోపల తిరుగుతుంటుందో అంతకాలమే ఈ శరీరానికి పూజనీయత. ఎంతకాలం వాయువు బయటికెళ్ళి లోపలకు వస్తుంటుందో అంతకాలం మాత్రమే 'బాగున్నారా !', 'బాగున్నారా!' అని అని కుశల ప్రశ్నలు వేస్తుంటారు. లోపలికి వెళ్ళిన వాయువు బయటికి వెళ్ళకపోయినా, బయటికి వెళ్ళిన వాయువు లోపలికి పీల్చబడకపోయినా .. అక్కడితో దాని మంగళప్రదత్వం పోతుంది. అది ఇక శివం కాదు, శవం.

అటువంటి ప్రాణాన్ని పోషించగలిగేది నీరు. ప్రాణులను అన్నింటినీ కూడా పోషించగలిగిన శక్తి నీటికి ఉంటుంది. అందుకే 'అమృతం వా ఆపః' అంటారు. నీరు అమృతంగా చెప్పబడింది. పరమేశ్వరుడికి అభిషేకం చేసినప్పుడు పంచామృతాభిషేకం అంటారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, మంచినీరు.. ఇవి పంచామృతాలు. నీళ్ళు ముఖాన చిలకరిస్తే... స్పృహ తప్పిపోయినవాడికి కూడా స్పృహ, ప్రాణాలు వస్తాయి. అంటే ప్రాణాలను తిరిగి యథాస్థానంలో నిలబెట్టగలిగిన శక్తి నీటికి ఉంది.

చిట్టచివరిది వాక్కు. ఈ వాక్కు.. స్వరపేటిక పేరిట భగవంతుడిచ్చిన మహత్తరమైన కానుక. దీనిని ఆధారం చేసుకుని మనిషి తాను తరించిపోవచ్చు... ఇతరుల అజ్ఞానం పోగొట్టడానికి ఉపయోగించవచ్చు. కలియుగంలో భగవంతుని నామాన్ని పలకడం కన్నా గొప్పది మరొకటి లేదు. అది భగవంతుడిని ఉద్దేశించే పలికింది కాకపోవచ్చు. 'బిడ్డపేరుపెట్టి పిలిచిననైన విశ్రామకేళినైన పద్య గద్య గీత భావార్థములనైన కమలనయనతలుప కలుషహరము' అంటారు... భాగవతంలో. బిడ్డను దేముడి పేర్లలో ఒకటిపెట్టి పిలిచినప్పటికీ... పిలిచింది బిడ్డనే అయినా... భగవంతుడి నామాన్ని ఉచ్చరించాడు కాబట్టి పాపరాశి ధ్వంసమవుతుంది... అన్నారు. విశ్రామకేళినైన... ఆడుకునే సమయంలో ఇరుపక్షాలూ ఒకరు రాముడి పక్షమనీ, మరొకరు కృష్ణుడి పక్షమంటూ అలా పేర్లుపెట్టుకుని ఆడుకుంటూ ఆ పేర్లను ఉచ్చరించినా చాలట. పద్యమో, గద్యమో, గీతమో... ఏదయినా కావచ్చు... అది భగవంతుని నామంతో కూడుకున్నదయితే చాలు అది కలుషహరము.. కలుషాలను అన్నింటినీ పోగొట్టగలిగిన శక్తిని పొంది ఉంటుంది. అలా తనకు తాను తరించడానికే కాదు.. ఇతరుల అజ్ఞానమనే చీకటిని దహించివేయడానికి కూడా వాక్కు ఉపకరిస్తుంది ... ఎలా? వాక్కు అగ్నిహోత్రంతో సమానమైనది. అగ్నిహోత్రానికి ఉన్న లక్షణం అవతలి వస్తువును దహించి వేస్తుంది. అలాగే వాక్కుకు ఉన్న లక్షణం అవతలివారి అజ్ఞానాన్ని తొలగించేస్తుంది. తెలియని విషయం అది తెలిసినవారి దగ్గర విన్నప్పుడు.. 'నాకు తెలియదు' అన్న తెలియనితనం పోతుంది. అంత గొప్ప వాక్కు మహాత్ములయినవారి నోటివెంట వచ్చినప్పుడు దేశకాలాలతో సంబంధం లేకుండా ఎప్పటికీ అది వ్యక్తి ఉద్ధరణకు, సమాజ ఉద్ధరణకు కారణమయి ఉంటుంది. వారు దేశికులై ... అంటే మార్గనిర్దేశకులై మనం ఎటువైపు ప్రయాణం చేయాలో దిశానిర్దేశనం చేస్తుంటారు.




బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

(సశేషం).

యద్ధర్మం... సద్ధర్మం

బౌద్ధవాణి



అది శ్రావస్తి నగరానికి దాపున ఉన్న జేతవనం. ఆ వనం మధ్యలో ఉన్న ఆనందబోధి వృక్షం కింద ప్రశాంత వదనంతో కూర్చొని ఉన్నాడు బుద్ధుడు.

భిక్షు సంఘం ఆ చెట్టు చల్లని నీడలో కూర్చొని ఉన్నారు. వారు ధరించిన కాషాయ వస్త్రాలు కాంతిమంతంగా ఉన్నాయి. ఆ వెలుగు వారి దేహం మీద పడి ప్రకాశిస్తోంది.

''భిక్షువులారా! మనం ఎలాంటి ధర్మాన్ని తెలుసుకోవాలి? ఎలాంటి ధర్మాన్ని సేవించాలి? ఎలాంటి ధర్మాన్ని ఆచరించాలి? అని ఆలోచించాలి'' అన్నాడు గంభీరంగా.

భిక్షువులందరూ ప్రశాంతంగా వినసాగారు.

మనం పాటించే ధర్మం నాలుగు విధాల ఫలితాలనిస్తుంది. అందులో మొదటిది విషపదార్థం కలిసిన చేదు గుమ్మడికాయ రసం లాంటిది. దీని రుచీ, వాసన, రంగూ ఏదీ బాగోదు. పైగా తాగితే ప్రమాదం కూడా. అలాగే... వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ దుఃఖాన్ని ఇచ్చే ధర్మం అలాంటిది. అలాంటి కుశలం ఇవ్వని ధర్మాన్ని గ్రహించి దూరంగా ఉండాలి.

ఇక, రెండోరకం ధర్మాచరణ బంగారు పాత్రలో ఉన్న కుళ్ళిన పదార్థం లాంటిది. ఈ పదార్థం రంగు, రుచి, వాసనలు ఇంపుగా ఉంటాయి. పైగా బంగారు పాత్రలో ఉంది. కానీ, దీన్ని సేవిస్తే అనారోగ్యం కలిగి, ప్రాణాలకే ముప్పు. వర్తమానంలో సుఖాన్ని, దీర్ఘకాలంలో దుఃఖాన్ని ఇచ్చే ధర్మాచరణ ఇలాంటిది.

మరి, భిక్షువులారా! ఒక చెక్క పాత్ర ఉంది. దానిలో ఎన్నో మూలికలతో మరిగిన మూత్రం ఉంది. పాండు రోగానికి అది మంచి ఔషధం. దాని రంగు, రుచి, వాసనలు ఏవీ బాగో లేదు. అయినా దాన్ని సేవిస్తే రోగం తగ్గుతుంది. ఉపశమనం కలుగుతుంది. అలాగే... వర్తమానంలో దుఃఖాన్ని, దీర్ఘకాలంలో సుఖాన్ని ఇచ్చే ధర్మాచరణ కూడా ఇలాంటిదే!'' అన్నాడు.

''అలాగే... ఒక పాత్రలో పెరుగు, తేనె, నెయ్యి కలిపిన బెల్లం రసం ఉంది. అది కడుపులో బాధల్ని హరించే ఔషధం. ఆ బెల్లం రసం రంగు బాగుంటుంది. రుచి బాగుంటుంది. వాసన కూడా బాగుంటుంది. అది చేసే మేలు కూడా బాగుంటుంది. ఇలా వర్తమానంలో సుఖాన్ని, దీర్ఘ కాలంలో కూడా సుఖాన్ని ఇచ్చేది సద్ధర్మం.''

''భిక్షువులారా! సద్ధర్మం అనేది శరత్కాలంలోని సూర్యుని కాంతి లాంటిది. అది ప్రకాశిస్తుంది. మనిషి దుఃఖాన్ని పారద్రోలుతుంది'' అని చెప్పి, అందరి వంకా ఓసారి చూశాడు.

అందరి మనస్సుల్లోని ఉషస్సు వారందరి ముఖాల్లో తేజస్సుగా ప్రతిఫలిస్తోంది!

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా



● సుశాంత్, చిరంజీవి, కీర్తీ సురేశ్, అనిల్ సుంకర, మెహర్ రమేష్

రీమేక్స్ చేస్తే తప్పేంటి? - చిరంజీవి

''రీమేక్స్ చేస్తారేంటి? అని అంటుంటారు. మంచి కంటెంట్‌ని తెలుగు ప్రేక్షకులకు చూపించాలనే ప్రయత్నం మన యాక్టర్స్, దర్శకులు చేస్తే తప్పేంటో నాకు అర్థం కావడం లేదు. 'వేదాళం' సినిమా ఏ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో లేదు. ఎవరూ చూసి ఉండరు. ఆ ధైర్యంతోనే మెహర్, అనిల్ నా వద్దకు రావడంతో 'భోళాశంకర్' చేశాను'' అని చిరంజీవి అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'భోళాశంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన 'భోళాశంకర్' ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవి మాట్లాడుతూ– ''భోళాశంకర్' సినిమా నాకు నచ్చింది కాబట్టే చేశాను. మీకు (ప్రేక్షకులు) కూడా నచ్చుతుందనే ధైర్యంతో విడుదల చేస్తున్నాం. స్వయంకృషితో మెహర్ రమేశ్ దర్శకుడిగా ఎదిగాడు. కొత్తవారి ప్రతిభతో ఇండస్ట్రీ మరింత ఎదగాలి. ఇండస్ట్రీని నమ్ముకుని వస్తే గొప్ప లైఫ్‌ని ప్రసాదిస్తుంది. ఇండస్ట్రీ పుష్పక విమానంలాంటిది.. ఎంతమంది వచ్చినా ఇంకా చోటు మిగిలే ఉంటుంది. ఇండస్ట్రీ అక్షయ పాత్రలాంటిది. ఎంతమంది తిన్నా కూడా ఇంకా భోజనం అందిస్తుంది ఈ కళామతల్లి. కేవలం స్టార్స్ మాత్రమే ఉండే ఈ ఇండస్ట్రీలోకి బిక్కు బిక్కు మంటూ నేను ప్రవేశించాను. నా ప్రతిభపై నాకు నమ్మకం ఉంది. నా లోపల ధైర్యం ఉంది. 'కొత్త అల్లుడు' సినిమాలో ఓ చిన్న వేషం వేయమన్నారు.. బాధగా అనిపించింది కానీ చేశాను. అలాగే 'కొత్తపేట రౌడీ' సినిమాలో కృష్ణగారి పక్కన చిన్న వేషం వేయమన్నారు. ఓ వైపు 'శుభలేఖ', 'ఇంట్లో కృష్ణయ్య వీధిలో రామయ్య' వంటి సినిమాలు చేస్తున్నాను.. ఇప్పుడు ఇలాంటి రోల్స్ చేస్తే బాగుంటుందా? అంటే.. 'చేయండి సార్' అన్నారు. చేయనంటే నా భవిష్యత్ మీద ప్రభావం పడుతుందేమో అనే భయంతో చేశాను. కానీ, ఈ ఇండస్ట్రీ నన్ను ఆదరించిన దానికంటే... నన్ను ప్రోత్సహించి, భుజాన ఎత్తుకుంది, పైకి లేపింది ప్రేక్షకులు. వారికి రుణపడి ఉంటాను'' అన్నారు. ''మీరంతా (అభిమానులు) చిరంజీవిగారి సినిమాలు చూస్తూ పెరిగితే.. నేను చిరంజీవిగారితో సినిమాలు చేస్తూ పెరిగాను'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్ . ''చిరంజీవిగారితో సినిమా చేయడాన్ని లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్‌గా భావిస్తున్నాను'' అన్నారు అనిల్ సుంకర్. ''ఒక షాడోలో ఉన్న నా మీద మెగాస్టార్ అన్నయ్య వెలుగు పడింది. 'భోళా శంకర్' నాకు దర్శకుడిగా పునర్జన్మ లాంటిది'' అన్నారు. ఈ వేడుకలో పలువురు దర్శక– నిర్మాతలు పాల్గొన్నారు.

విక్రమ్‌కు జోడీగా?



● రష్మిక మందన్నా

హీరోయిన్ రష్మికా మందన్న హీరో విక్రమ్‌కి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. 2018లో కేరళలో వచ్చిన వరదల నేపథ్యంలో '2018' అనే చిత్రం తెరకెక్కించారు డైరెక్టర్ జూడ్ ఆంథోనీ జోసెఫ్. ఈ సినిమా మలయాళంలో అద్భుత విజయాన్ని సాధించి బాక్సాఫీస్ కొత్త రికార్డులను సృష్టించింది. కాగా జూడ్ ఆంథోనీ జోసెఫ్ తన తర్వాతి చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్‌లో చేయనున్నారు. ఈ చిత్రంలో విక్రమ్ హీరోగా నటిస్తారని, భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించడానికి నిర్మాత సుభాస్కరన్ సన్నాహాలు చేస్తున్నారని కోలీవుడ్ టాక్. ఇందులో హీరోయిన్‌గా రష్మికా మందన్న, మాళవిక మోహనన్ పేర్లు వినిపించాయి. అయితే రష్మికా మందన్న ఫైనల్ అయ్యారని, అతి త్వరలోనే ఈ సినిమాపై అధికారిక ప్రకటన రానున్నట్లు సమాచారం. విక్రమ్– రష్మిక జోడీ అధికారికంగా ఓకే అయితే... కార్తీ 'సుల్తాన్', విజయ్ 'వారిసు' చిత్రాల తర్వాత రష్మికా మందన్న నటించనున్న మూడో తమిళ సినిమా ఇదే అవుతుంది.



● డోలన్



● ఇలియానా

ఇలియానా తల్లయ్యింది

హీరోయిన్ ఇలియానా తల్లయ్యింది. ఈ నెల 1న ఆమె పండంటి మగబిడ్డకు జన్మ ఇచ్చారు. ఈ విషయాన్ని ఆదివారం సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు ఇలియానా. అంతేకాదు.. తన కుమారుడి ఫొటోని షేర్ చేసి, కోవా ఫీనిక్స్ డోలన్ అని పేరు పెట్టినట్లు పేర్కొన్నారు. ''కోవా ఫీనిక్స్ డోలన్'ని పరిచయం చేస్తున్నాను. మా హృదయాలను దాటి ప్రపంచానికి పరిచయం చేస్తున్నందుకు ఎంత హ్యాపీగా ఉన్నామో మాటల్లో వర్ణించలేం. ఇది గొప్ప అనుభూతి'' అని పోస్ట్ చేశారు ఇలియానా. కాగా రెండు వారాల క్రితం తన ప్రియుడు ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ బ్యూటీ అతని పేరు, వివరాలు మాత్రం వెల్లడించలేదు. నటీనటులు నర్గీస్ ఫక్రీ, హ్యూమా ఖురేషి, సోఫీ చౌదరి, అర్జున్ కపూర్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు, ఆమె అభిమానులు, నెటిజన్లు ఇలియానాకు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త వాళ్లకి అవకాశాలు ఇవ్వండి - కె.రాఘవేంద్ర రావు

''ఈ వేదికపై ఉన్న చాలా మంది నిర్మాతలు నా సినిమాలతో స్ఫూర్తి పొందామని చెబుతుండటం సంతోషం. మీరు పెద్ద సినిమాలు చేస్తున్నారు.. అప్పుడప్పుడు చిన్న సినిమాలు చేసి కొత్తవాళ్లకి చాన్స్ ఇస్తే ఇన్నేళ్లుగా నేను చేసిన ప్రయత్నానికి కొనసాగింపుగా ఉంటుంది'' అని డైరెక్టర్ కె.రాఘవేంద్ర రావు అన్నారు. ఆకాష్ , భావనా వళపండల్ జంటగా గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన చిత్రం 'సర్కారు నౌకరి'. కె.రాఘవేంద్ర రావు నిర్మిస్తున్నారు. ఆర్కే టెలీఫిలింస్ స్థాపించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఓ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'సర్కారు నౌకరి' టీజర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సురేశ్ బాబు, నవీన్ యెర్నేని, టీజీ విశ్వప్రసాద్, ప్రసాద్ దేవినేని, శోభు యార్లగడ్డ, గాయని సునీత తదితరులు పాల్గొన్నారు.



● ఆకాష్, భావన, శేఖర్, కె.రాఘవేంద్ర రావు

ఎందుకురా బాబు!

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'రూల్స్ రంజన్'. రత్నం కృష్ణ దర్శకత్వం వహించారు. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించారు. అమ్రిష్ గణేష్ స్వరాలు అందించిన ఈ చిత్రంలోని 'ఎందుకురా బాబు.. కొంచెం ఆగరా బాబు..' అనే లిరికల్ వీడియో సాంగ్‌ని చిత్రయూనిట్ విడుదల చేసింది. కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్, రేవంత్ ఆలపించగా, శిరీష్ నృత్యరీతులు సమకూర్చారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. సెప్టెంబరు మొదటి వారంలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● కిరణ్



● శరత్ చంద్ర, నందు

రాబరీ నేపథ్యంలో...

కృష్ణ మడుపు, ఫణి భార్గవ్, నర్సింగ్ వాడేకర్, గంగాధర్ రెడ్డి, ఫణి శర్మ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '1134'. శరత్ చంద్ర తడిమేటి దర్శకత్వంలో రాంధుని క్రియేషన్స్‌పై నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ని నటుడు నందు విడుదల చేసి, మాట్లాడుతూ–''నేను, శరత్ చంద్ర ఎప్పటి నుంచో ఫ్రెండ్స్. మాకు తరుణ్ భాస్కర్, అడివి శేష్ కులదైవం వంటి వారు. వాళ్లే జీరో బడ్జెట్ చిత్రాలను ప్రారంభించారు. ఇప్పుడు శరత్ తీసిన జీరో బడ్జెట్ సినిమా '1134' హిట్ కావాలి'' అన్నారు. ''రాబరీ నేపథ్యంలో బలమైన కథా, కథనంతో ఈ సినిమా సాగుతుంది. ప్రస్తుతం జరుగుతున్న కుంభకోణాలను ఈ మూవీలో చూపించాను'' అన్నారు శరత్ చంద్ర తడిమేటి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ మురళి కార్తికేయ, కెమెరా: నజీబ్ షేక్, జితేందర్ తలకంటి.

రీల్స్

డెవిల్ వస్తున్నాడు



● కల్యాణ్ రామ్

కల్యాణ్ రామ్ హీరోగా నటించిన స్పై థ్రిల్లర్ ఫిల్మ్ 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటించారు. నవీన్ మేడారం దర్శకత్వంలో దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మించిన చిత్రం ఇది. తాజాగా ఈ సినిమాను నవంబరు 24న విడుదల చేస్తున్నట్లుగా ఆదివారం చిత్రయూనిట్ ప్రకటించింది. ''ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని చేధించే ఓ బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా కల్యాణ్‌రామ్ ఆకట్టుకోబోతున్నారు'' అని మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్.

ప్రేమ.. వినోదం



● హృతిక, చైతన్య రావ్

'చైతన్య రావ్, హృతికా శ్రీనివాస్ జంటగా కొత్త సినిమా షురూ అయింది. సాయి తేజ దర్శకత్వంలో గౌతమ్స్ ఈగల్ ఎంటర్‌టైన్మెంట్‌పై ఎం.గౌతమ్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ చైర్మన్ అనిల్ కూర్మాచలం కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాతలు సి.కల్యాణ్ క్లాప్ కొట్టగా, బెక్కం వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. ''కామెడీ, లవ్, ఎమోషన్స్.. వంటి ఆకట్టుకునే అంశాలు ఈ మూవీలో ఉంటాయి'' అన్నారు ఎం.గౌతమ్. నిర్మాత రాచాల యుగంధర్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మోహన్ పున్న, లైన్ ప్రొడ్యూసర్: వంశీ కృష్ణ, కెమెరా: పీసీ మౌళి, సంగీతం: గ్యాని.

హారర్ థ్రిల్లర్



● పవిత్ర, అశ్విన్

అశ్విన్ కాకుమణి, పవిత్ర మరిముత్తు, గౌరవ్ నారాయణన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పిజ్జా 3'. మోహన్ గోవింద్ దర్శకత్వంలో సీవీ కుమార్ నిర్మించిన ఈ సినిమా జూలై 28న తమిళంలో విడుదలై, హిట్ సాధించింది. ఈ చిత్రాన్ని అదే పేరుతో కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పీపై ఎంఎస్ మురళీధర్ రెడ్డి, ఆశిష్ వేమిశెట్టి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ''హారర్ అండ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'పిజ్జా 3 '' అన్నారు నిర్మాతలు.

మాస్టర్ పీస్



● మనీష్

అరవింద్ కృష్ణ, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'ఎ మాస్టర్ పీస్'. సుకు పూర్వజ్ దర్శకత్వంలో సినిమా బండి ప్రొడక్షన్స్‌పై శ్రీకాంత్ కండ్రేగుల నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి విలన్ పాత్రధారి మనీష్ గిలాడా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'ఎ మాస్టర్ పీస్'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: శివరామ్ చరణ్, సంగీతం: ఆశీర్వాద్.



ఢిల్లీ ఎఫ్‌సీతో హైదరాబాద్ ఎఫ్‌సీ మ్యాచ్ 'డ్రా'

డ్యూరాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో గత ఏడాది సెమీఫైనల్ చేరిన హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఈసారి 'డ్రా'తో ప్రారంభించింది. ఢిల్లీ ఎఫ్‌సీతో గువాహటిలో ఆదివారం జరిగిన గ్రూప్ 'ఇ' మ్యాచ్‌ను హైదరాబాద్ ఎఫ్‌సీ 1-1తో 'డ్రా' చేసుకుంది. ఆరో నిమిషంలో హిమాన్షు జాంగ్రా చేసిన గోల్‌తో ఢిల్లీ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 57వ నిమిషంలో రామ్లున్‌చుంగా చేసిన గోల్‌తో హైదరాబాద్ స్కోరును సమం చేసింది. ఆ తర్వాత రెండు జట్లు మరో గోల్ చేయలేకపోయాయి. హైదరాబాద్ తన తదుపరి మ్యాచ్‌ను ఈనెల 10న చెన్నైయిన్ ఎఫ్‌సీతో ఆడుతుంది.

డోపింగ్‌లో దొరికిన జస్లీన్ సింగ్



భారత జూడో ప్లేయర్ జస్లీన్ సింగ్ సైనీ డోప్ టెస్టులో విఫలమయ్యాడు. గత నెల టైపీ ఓపెన్ సందర్భంగా అతని నుంచి సేకరించిన నమూనాలను పరీక్షించగా నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలింది. 25 ఏళ్ల ఈ భారత జూడో ప్లేయర్ టైపీ ఈవెంట్‌లో 66 కేజీల కేటగిరీలో బంగారు పతకం గెలుపొందాడు. వచ్చే నెల 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనా ఆతిథ్యమిచ్చే ఆసియా క్రీడలకు జస్లీన్ అర్హత సాధించాడు. తాజా డోపింగ్‌తో అతను జట్టులో స్థానం కోల్పోయాడు.

భారత్ ఘనవిజయం

మలేసియా 5-0తో గెలుపు



చెన్నై: ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నీలో ఆతిథ్య భారత జట్టు ఖాతాలో రెండో విజయం చేరింది. మలేసియాతో ఆదివారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్ హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా 5-0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున సెల్వం కార్తీ (15వ ని.లో), హార్దిక్ సింగ్ (32వ ని.లో), హర్మన్‌ప్రీత్ సింగ్ (42వ ని.లో), గుర్జంత్ సింగ్ (53వ ని.లో), జుగ్‌రాజ్ సింగ్ (54వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. భారత్‌కు మొత్తం తొమ్మిది పెనాల్టీ కార్నర్‌లు రాగా అందులో మూడింటిని సద్వినియోగం చేసుకుంది. నేడు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో భారత్ ఆడుతుంది. ఆదివారం జరిగిన మిగతా రెండు మ్యాచ్‌లు 'డ్రా' అయ్యాయి. చైనా-కొరియా 1-1తో, పాకిస్తాన్-జపాన్ 3-3తో 'డ్రా' చేసుకున్నాయి.

నాలుగో రౌండ్‌లో హంపి, అర్జున్





బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి (ఆంధ్రప్రదేశ్), ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్ (తెలంగాణ), గుకేశ్, ప్రజ్ఞానంద (తమిళనాడు) నాలుగో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. మూడో రౌండ్‌లో హంపి 1.5-0.5తో ఓల్గా బడెల్కా (రష్యా)పై, అర్జున్ 1.5-0.5తో వ్లాదిమిర్ ఫెడోసీవ్ (స్లొవేనియా)పై, గుకేశ్ 1.5-0.5తో నారాయణన్ (భారత్)పై, ప్రజ్ఞానంద 1.5-0.5తో డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందారు. మహిళల విభాగంలో ద్రోణవల్లి హారిక (భారత్)-లేలా జవాఖిష్‌విలి (జార్జియా) మధ్య... ఓపెన్ విభాగంలో విదిత్ (భారత్)-మథియాస్ (జర్మనీ) మధ్య... నిహాల్ (భారత్)-బొగ్డాన్ (రొమేనియా) మధ్య జరిగిన మూడో రౌండ్ రెండు గేమ్‌లు 'డ్రా' కావడంతో వీరి మధ్య నేడు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు. భారత్‌కే చెందిన మేరీఆన్ గోమ్స్, దివ్య, వైశాలి మూడో రౌండ్‌లో నిష్క్రమించారు.

గెలుపు మలుపు విండీస్‌దే

- రెండో టి20లోనూ గెలిచిన విండీస్
- 2 వికెట్లతో భారత్ ఓటమి
- రాణించిన తిలక్, పాండ్యా, చహల్
- పూరన్ మెరుపులు
- రేపు మూడో టి20

ప్రావిడెన్స్ (గయానా): బ్యాటింగ్‌లో తిలక్‌వర్మ (41 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్) ప్రతాపం చూపినా, బౌలింగ్‌లో హార్దిక్ పాండ్యా (3/35) నిప్పులు చెరిగినా, చహల్ (2/19) స్పిన్‌తో తిప్పినా... భారత్‌కు పరాజయం తప్పలేదు. ఆదివారం రెండో టి20లో విండీస్ 2 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో 2-0తో ఆధిక్యాన్ని పెంచుకుంది. టాస్ గెలిచిన భారత్ ముందుగా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ కెరీర్‌లో తొలి అర్ధసెంచరీ సాధించాడు. అకిల్ హొసీన్, అల్జారి జోసెఫ్, షెఫర్డ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన వెస్టిండీస్ 18.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలిచింది. ఆరంభంలోనే పాండ్యా ప్రత్యర్థిని దెబ్బ తీసినా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నికోలస్ పూరన్ (40 బంతుల్లో 67; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) గెలుపుబాట వేశాడు. రేపు మూడో టి20 కూడా ఇదే వేదికపై జరుగుతుంది.

తిలక్ ఫిఫ్టీతో...

అరంగేట్రం చేసిన తొలి టి20లోనే ఆకట్టుకున్న హైదరాబాద్ యువ సంచలనం ఠాకూర్ తిలక్‌వర్మ ఈ రెండో మ్యాచ్‌లో అయితే భారత జట్టును ఆదుకున్నాడు. 18 పరుగులకే భారత్ కీలకమైన శుబ్‌మన్ గిల్ (7), సూర్యకుమార్ (1) వికెట్లను కోల్పోగా, కాసేపటికే ఇషాన్ కిషన్ (23 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), సంజూ సామ్సన్ (7)లు వికెట్లను పారేసుకున్నాడు. ఈ దశలో తిలక్ తనశైలి స్కూప్, స్వీప్ షాట్లతో మైదానంతా ఫీల్డర్లను పరుగు పెట్టించాడు. కెప్టెన్ పాండ్యాతో కలిసి స్కోరుబోర్డులో వేగం పెంచిన వర్మ 39 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. అతనితో పాటు హార్దిక్ పాండ్యా (18 బంతుల్లో 24; 2 సిక్సర్లు) స్వల్ప వ్యవధిలో అవుట్ కావడంతో డెత్ ఓవర్లలో దంచి కొట్టే బ్యాటరే కరువయ్యాడు. భారీషాట్లు బాదే అక్షర్ (14) ఆట కూడా ఎంతోసేపు నిలువలేదు. దీంతో భారత్ ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది.

పూరన్ ధనాధన్

లక్ష్యఛేదన మొదలు పెట్టగానే పాండ్యా వికెట్ల భరతం పట్టడంతో తొలి ఓవర్లోనే కింగ్ (0), చార్లెస్ (2) వికెట్లను కోల్పోయిన విండీస్ కష్టాలపాలైంది. మేయర్స్ (15)ను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో భారత శిబిరంలో ఎక్కడలేని ఉత్సాహం కానీ...



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నికోలస్ పూరన్

తర్వాత పూరన్ ఉత్పాతంలా వచ్చిపడ్డాడు. భారీ సిక్సర్లు, బౌండరీలతో బంతుల అంతరాన్ని అమాంతం తగ్గించేశాడు. 126/4 స్కోరు వద్ద గెలుపుబాటలో కనిపించింది. కానీ ఆ స్కోరువద్దే పూరన్ జోరుకు ముకేశ్ కళ్లెం వేశాడు. ఈ దశలో చహల్ స్పిన్ మ్యాజిక్‌తో హెట్‌మైర్ (22 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్), హోల్డర్ (0)లను అవుట్ చేశాడు. 3 పరుగుల వ్యవధిలో 4 వికెట్లను కోల్పోవడంతో మ్యాచ్ ఫలితం భారత్‌వైపు మలుపు తిరిగేలా కనిపించింది. కానీ హొసీన్ (16 నాటౌట్; 2 ఫోర్లు), జోసెఫ్ (10 నాటౌట్; 1 సిక్స్) తొమ్మిదో వికెట్‌కు అజేయంగా 26 పరుగులు జోడించి టీమిండియాకు గెలుపు అవకాశమివ్వకుండా ఇంకా 7 బంతులు మిగిలుండగానే విండీస్‌ను విజయ తీరానికి చేర్చారు.



తిలక్ వర్మ

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (బి) షెఫర్డ్ 27; గిల్ (సి) హెట్‌మైర్ (బి) జోసెఫ్ 7; సూర్యకుమార్ (రనౌట్) 1; తిలక్ వర్మ (సి) మెకాయ్ (బి) హొసీన్ 51; సంజూ సామ్సన్ (స్టంప్డ్) పూరన్ (బి) హొసీన్ 7; పాండ్యా (బి) జోసెఫ్ 24; అక్షర్ (సి) పూరన్ (బి) షెఫర్డ్ 14; రవి బిష్ణోయ్ (నాటౌట్) 8; అర్ష్‌దీప్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 152. వికెట్ల పతనం:** 1-16, 2-18, 3-60, 4-76, 5-114, 6-129, 7-139. **బౌలింగ్:** మెకాయ్ 4-0-25-0, హొసీన్ 4-0-29-2, జోసెఫ్ 4-0-28-2, హోల్డర్ 4-0-29-0, షెఫర్డ్ 3-0-28-2, మేయర్స్ 1-0-12-0.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 0; మేయర్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 15; చార్లెస్ (సి) తిలక్ వర్మ (బి) పాండ్యా 2; పూరన్ (సి) సామ్సన్ (బి) ముకేశ్ 67; పావెల్ (సి) ముకేశ్ (బి) పాండ్యా 21; హెట్‌మైర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహల్ 22; షెఫర్డ్ (రనౌట్) 0; హోల్డర్ (స్టంప్డ్) ఇషాన్ (బి) చహల్ 0; హొసీన్ (నాటౌట్) 16; జోసెఫ్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (18.5 ఓవర్లలో 8 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1-0, 2-2, 3-32, 4-89, 5-126, 6-128, 7-128, 8-129. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 4-0-35-3 అర్ష్‌దీప్ 4-0-34-1, ముకేశ్ 3.5-0-35-1, బిష్ణోయ్ 4-0-31-0, చహల్ 3-0-19-12.

ప్రణయ్... రన్నరప్‌తో సరి

- ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఓటమి
- చివరి గేమ్‌లో 5 పాయింట్ల ఆధిక్యాన్ని వృథా చేసుకున్న భారత స్టార్



సిడ్నీ: ఈ ఏడాది రెండో టైటిల్ సాధించాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ హెచ్‌ఎస్ ప్రణయ్‌కు నిరాశ ఎదురైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో కేరళకు చెందిన ప్రణయ్ రన్నరప్‌గా నిలిచాడు. 90 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 9-21, 23-21, 20-22తో ప్రపంచ 24వ ర్యాంకర్ వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. ఈ ఏడాది మేలో మలేసియా మాస్టర్స్ టోర్నీ ఫైనల్లో వెంగ్ హాంగ్ యాంగ్‌ను ఓడించి టైటిల్ నెగ్గిన ప్రణయ్ ఈసారి మాత్రం అదే ఫలితాన్ని పునరావృతం చేయడంలో విఫలమయ్యాడు. తొలి గేమ్‌ను చేజార్చుకున్న ప్రణయ్ రెండో గేమ్‌లో తేరుకున్నాడు. పోటాపోటీగా సాగిన ఈ గేమ్‌లో పలుమార్లు స్కోర్లు సమమయ్యాయి. చివరకు స్కోరు 21-21 వద్ద వెంగ్ కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్ బయటకు వెళ్లింది. అనంతరం ప్రణయ్ నెట్ వద్ద పాయింట్ గెలిచి గేమ్‌ను దక్కించుకున్నాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో ప్రణయ్ దూకుడుగా ఆడి 19-14తో ఐదు పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించాడు. అయితే వెంగ్ హాంగ్ యాంగ్ అసమాన పోరాటంతో కోలుకున్నాడు. స్కోరు 19-17 వద్ద ఏకంగా 71 షాట్‌ల ర్యాలీ సాగింది. చివరకు ప్రణయ్ కొట్టిన షాట్ నెట్‌కు తగలడంతో పాయింట్ వెంగ్ ఖాతాలోకి వెళ్లింది. అనంతరం వెంగ్ డ్రాప్ షాట్‌తో పాయింట్ గెలిచి స్కోరును 19-19తో సమం చేశాడు. ఆ తర్వాత ప్రణయ్ పాయింట్ సాధించి విజయానికి ఒక పాయింట్ దూరంలో నిలిచాడు. కానీ పట్టువదలని వెంగ్ మళ్లీ స్కోరును సమం చేశాడు. ఆ తర్వాత వెంగ్ వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. విజేత వెంగ్ హాంగ్ యాంగ్‌కు 31,500 డాలర్ల (రూ. 26 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 9200 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ ప్రణయ్‌కు 15,960 డాలర్ల (రూ. 13 లక్షల 19 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7800 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ప్రపంచకప్ కోసం భారత్‌కు పాక్

పాకిస్తాన్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

కరాచీ: కొన్నాళ్లుగా... భారత్ ఆతిథ్యమిచ్చే ప్రపంచకప్‌కు రాం రాం, భారత్‌లో ఆడబోం అంటూ మేకపోతు గాంభీర్యానికి పోయిన పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఇప్పుడు ఆడేందుకు రెడీ అయ్యింది. క్రికెట్ లోకం కంటపడేందుకు, ఎక్కడలేని సస్పెన్స్ క్రియేట్ చేసేందుకు ప్రయత్నించిన పీసీబీ ఇంకో మాట మాట్లాడకుండా వచ్చేందుకు సై అంటోంది. ఈ మేరకు ఆదివారం పాకిస్తాన్ ప్రభుత్వం భారత్‌లో ఆడేందుకు పచ్చజెండా ఊపింది. ద్వైపాక్షిక సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ క్రీడలను రాజకీయాలతో ముడిపెట్టబోమని పాకిస్తాన్ విదేశీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయ క్రికెట్ టోర్నీల్లో తమ జట్టు ఎప్పటిలాగే పాల్గొంటుందని, తమ దేశం నిర్మాణాత్మక, బాధ్యతాయుత విధానాన్ని అవలంభిస్తుందనేదానికి తమ నిర్ణయమే నిదర్శనమని అందులో పేర్కొంది. భారత్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు భద్రతకు ఢోకా ఉండబోదనే ఆశిస్తున్నట్లు తెలిపింది.

రన్నరప్ రిత్విక్-అర్జున్ జోడీ



లిస్బన్: పోర్టో ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ రిత్విక్ చౌదరీ బొల్లిపల్లి-అర్జున్ ఖడే (భారత్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. పోర్చుగల్‌లో ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో రిత్విక్ చౌదరీ-అర్జున్ ద్వయం 7-6 (7/5), 3-6, 5-10తో తొషిహిడె మత్సుయ్-కైటో యుసుగి (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది.

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ టెట్-2023

తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ).. తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టీఎస్ టెట్) 2023 నోటిఫికేషన్ విడుదలచేసింది. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులు కావాలంటే.. టెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి. ఇందులో అర్హత సాధిస్తేనే టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ) రాయడానికి అర్హులు.

» **అర్హత:** డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన వారితో పాటు ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా పరీక్షకు హాజరుకావచ్చు.
» **పరీక్ష విధానం:**టెట్‌లో రెండు పేపర్లు ఉంటాయి. 1 నుంచి 5 తరగతులకు బోధించేందుకు పేపర్-1 రాయాలి. పేపర్-1ను డీఈడీ అభ్యర్థులతోపాటు బీఈడీ అభ్యర్థులకు కూడా జాతీయ ఉపాధ్యాయ మండలి(ఎన్‌సీటీఈ) అనుమతి ఇచ్చింది. పేపర్-2 రాసేందుకు కేవలం బీఈడీ పూర్తిచేసిన వారే అర్హులు. ఒక్కో పేపర్‌కు 150 మార్కులు.
» **అర్హత మార్కులు:** జనరల్ కేటగిరీలో 90, బీసీలు-75,ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 60 మార్కులు సాధిస్తే అర్హత లభిస్తుంది. వారే టీఆర్‌టీ రాసేందుకు అర్హులవుతారు. టెట్ మార్కులకు 20 శాతం, టీఆర్‌టీలో వచ్చిన మార్కులకు 80 శాతం వెయిటేజీ ఇచ్చి అభ్యర్థులకు తుది ర్యాంకు నిర్ణయిస్తారు.

ముఖ్య సమాచారం

» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 16.08.2023
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీలు:** 09.09.2023 నుంచి 14.09.2023 వరకు;
» **పరీక్ష తేది:** 15.09.2023.
» **ఫలితాల వెల్లడి:** 27.09.2023
» **వెబ్‌సైట్:** tstet.cgg.gov.in

ఐబీపీఎస్- 3,049 పీవో/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్ పీవో/XIII 2024-25) దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/ మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 3049
» **బ్యాంక్‌ల వారీగా ఖాళీలు:** బ్యాంక్ ఆఫ్ బరోడా-ఎన్ఆర్, బ్యాంక్ ఆఫ్ ఇండియా -224, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర-ఎన్ఆర్, కెనరా బ్యాంక్-500, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-2000, ఇండియన్ బ్యాంక్-ఎన్ఆర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ -ఎన్ఆర్, పంజాబ్ నేషనల్ బ్యాంక్-200, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్-125, యూకో బ్యాంక్-ఎన్ఆర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా -ఎన్ఆర్.
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.08.2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ రాతపరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ద్వారా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరితేది:** 21.08.2023.
» **ప్రిలిమినరీ పరీక్ష కాల్‌లెటర్ డౌన్‌లోడ్:** సెప్టెంబర్ 2023.
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష:** సెప్టెంబర్/అక్టోబర్ 2023.
» **వెబ్‌సైట్:** www.ibps.in

ఐబీపీఎస్-1402 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్(సీఆర్‌పీ ఎస్‌పీఎల్-XIII) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1402
» **పోస్టుల వివరాలు:** ఐటీ ఆఫీసర్(స్కేల్-1)-120, అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్ (స్కేల్-1)-500, రాజ్‌భాష అధికారి(స్కేల్-1)-41, లా ఆఫీసర్(స్కేల్-1)-10, హెచ్‌ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్-1)-31, మార్కెటింగ్ ఆఫీసర్ (స్కేల్-1)-700.
» **రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనే బ్యాంకులు:** బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర,కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్,పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో యూజీ,పీజీ ఉండాలి.
» **వయసు:** 01.8. 2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.08.2023.
» **అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్(ప్రిలిమినరీ పరీక్ష):** డిసెంబర్ 2023.
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేదీలు:** 30.12.2023/31.12.2023.
» **వెబ్‌సైట్:** www.ibps.in

కేంద్రంలో జూనియర్ ఇంజనీర్

» కేంద్ర ప్రభుత్వ శాఖల్లో జేఈ పోస్టులకు ఎస్ఎస్సీ నోటిఫికేషన్
» సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో 1,324 పోస్టులు
» డిప్లొమా, బీటెక్ అర్హతతో పోటీ పడే అవకాశం
» రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకాలు
» ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.60 వేల వేతనం



స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్సీ).. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల్లో.. జూనియర్ ఇంజనీర్ పోస్టల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.ఎనిమిది విభాగాల్లో మొత్తం 1,324 పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగానే నియామకాలు ఖరారు చేస్తారు. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్సీ జూనియర్ ఇంజనీర్ ఎగ్జామినేషన్-2023 వివరాలు, విభాగాల వారీగా పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్‌తో ప్రత్యేక కథనం..

8 విభాగాలు.. 1,324 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జూనియర్ ఇంజనీర్(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్స్) ఎగ్జామ్-2022 ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎనిమిది విభాగాలు/శాఖల్లో 1,324 జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- ఆగస్టు 1, 2023 నాటికి సంబంధిత బ్రాంచ్‌లో గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్ నుంచి సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లతో బీటెక్ లేదా డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ పోస్టులకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **వయసు:** ఆగస్టు 1, 2023 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ వాటర్ కమిషన్‌లకు మాత్రం గరిష్ఠ వయోపరిమితిని 32ఏళ్లుగా పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు,ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

అనుభవం

జూనియర్ ఇంజనీర్ పోస్టులకు సంబంధించి కొన్ని విభాగాలకు పని అనుభవం తప్పనిసరని పేర్కొన్నారు. బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లోని పోస్టుల విషయంలో సివిల్ ఇంజనీరింగ్ పోస్టులకు రెండేళ్లు, ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ పోస్టులకు మూడేళ్ల పని అనుభవం ఉండాలి.

ప్రారంభ వేతనం రూ.60వేలు

ఎంపికైన అభ్యర్థులకు ఏడో వేతన సంఘం ప్రకారం-పే లెవల్-6లో రూ.35,400 - రూ.1,12,400 వేతన శ్రేణి అందుతుంది. అంటే ప్రారంభంలోనే నెలకు రూ.60 వేల వరకు వేతనం లభిస్తుంది. భవిష్యత్తులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్ హోదాలకు చేరుకునే అవకాశం ఉంది.

ఎంపిక విధానం

ఆయా పోస్టులకు సంబంధించి రాత పరీక్షను నిర్వహిస్తారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలోనూ పొందిన మార్కుల ఆధారంగా తుది విజేతల జాబితా రూపొందిస్తారు. దరఖాస్తులో పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా విభాగాల్లో ఉన్న ఖాళీలు, రిజర్వేషన్లు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నియామకాలు ఖరారు చేసి సంబంధిత శాఖలు, విభాగాలకు పంపుతారు. ఆ తర్వాత సంబంధిత శాఖల్లో నిర్ణీత కాల వ్యవధిలో అంతర్గత శిక్షణనిస్తారు. దాన్ని పూర్తి చేసుకున్న వారికి విధులు కేటాయిస్తారు.

రాత పరీక్ష రెండు పేపర్లుగా

- రాత పరీక్షలో రెండు పేపర్లు (పేపర్-1, పేపర్-2) ఉంటాయి.
- పేపర్-1ను మూడు విభాగాలుగా 200 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో-జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు-50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులు, మరో వంద మార్కులకు అభ్యర్థులు పోటీ పడే జనరల్ ఇంజనీరింగ్ విభాగం(పార్ట్ ఏ/పార్ట్ బీ/పార్ట్ సీ) పరీక్ష ఉంటుంది.
- అభ్యర్థులు తాము డిప్లొమా లేదా బీటెక్‌లో చదివిన బ్రాంచ్‌కు అనుగుణంగా పార్ట్-ఎ లేదా పార్ట్-బి లేదా పార్ట్-సిలలో ఏదో విభాగంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాలి.

పేపర్-2.. 300 మార్కులు

- పేపర్-1లో పొందిన మార్కులను నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా క్రోడీకరించి కటాఫ్ స్కోర్లను నిర్ణయిస్తారు. ఆ తర్వాత అందుబాటులో ఉండే పోస్టుల సంఖ్య ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. వారికి పేపర్-2కు అర్హత లభిస్తుంది.
- పేపర్-2ను కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్‌గా 100 ప్రశ్నలు-300 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్-ఎ జనరల్ ఇంజనీరింగ్(సివిల్ అండ్ స్ట్రక్చరల్), పార్ట్-బి జనరల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్), పార్ట్-సి జనరల్ ఇంజనీరింగ్ (మెకానికల్) పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు తమ అర్హతకు అనుగుణంగా సంబంధిత సబ్జెక్ట్ విభాగంలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది.

టెక్నికల్ నాలెడ్జ్‌తో విజయం

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగానే నియామకాలు ఖరారు చేయనున్న నేపథ్యంలో.. అభ్యర్థులు సంబంధిత టెక్నికల్ సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాల్సిన ఆవశ్యకత నెలకొంది. అందుకోసం డిప్లొమా, బీటెక్ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను లోతుగా అధ్యయనం చేయాలి.

సివిల్ ఇంజనీరింగ్

బిల్డింగ్ మెటీరియల్స్, ఎస్టిమేటింగ్, కాస్టింగ్ అండ్ ఎవాల్యుయేషన్, సర్వేయింగ్, సాయిల్ మెకానిక్స్, హైడ్రాలిక్స్, ఇరిగేషన్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాలి. అదే విధంగా.. స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌కు సంబంధించి స్ట్రక్చర్స్ థియరీ, కాంక్రీట్ టెక్నాలజీ, ఆర్‌సీసీ డిజైన్, స్టీల్ డిజైన్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

బేసిక్ కాన్సెప్ట్స్‌తోపాటు సర్క్యూట్ లా, మ్యాగ్నటిక్ సర్క్యూట్, ఏసీ ఫండమెంటల్స్, మెజర్‌మెంట్ అండ్ మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఎలక్ట్రికల్ మెషీన్స్, ఫంక్షనల్ కిలోవాట్ మోటార్స్ అండ్ సింగిల్ ఫేజ్ మోటార్స్, సింక్రనస్ మెషీన్స్, జనరేషన్, ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్, ఎస్టిమేషన్ అండ్ కాస్టింగ్, యుటిలైజేషన్ అండ్ ఎలక్ట్రికల్ ఎనర్జీ, బేసిక్ ఎలక్ట్రానిక్స్‌పై పట్టు సాధించాలి.

మెకానికల్ ఇంజనీరింగ్

థియరీ ఆఫ్ మెషీన్స్, మెషీన్ డిజైన్, ఇంజనీరింగ్ మెకానిక్స్, స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ప్యూర్ సబ్‌స్టాన్సెస్, ఫస్ట్ అండ్ సెకండ్ లా ఆఫ్ థర్మోడైనమిక్స్, ఎయిర్ స్టాండర్డ్ సైకిల్స్ ఫర్ ఐసీ ఇంజన్స్, ఐసీ ఇంజన్ పెర్ఫార్మెన్స్, ఐసీ ఇంజన్స్ కంబస్టన్, ఐసీ ఇంజన్ కూలింగ్ అండ్ లూబ్రికేషన్, ఫ్లూయిడ్ స్టాటిక్స్, ఫ్లూయిడ్ ప్రెజర్, ఫ్లూయిడ్ కైనమాటిక్స్, డైనమిక్స్ ఆఫ్ ఫ్లూయిడ్స్, మెజర్‌మెంట్ ఆఫ్ ఫ్లో రేట్, బేసిక్ ప్రిన్స్‌పుల్స్, హైడ్రాలిక్ టర్బైన్స్, సెంట్రిఫ్యూగల్ పంప్స్, క్లాసిఫికేషన్ ఆఫ్ స్టీల్ తదితర కోర్ మెకానికల్ అంశాలను అధ్యయనం చేయాలి.

కాన్సెప్ట్స్, అప్లికేషన్ అప్రోచ్

అభ్యర్థులు ఇంజనీరింగ్ పేపర్లలో మెరుగైన మార్కుల కోసం ఆయా సబ్జెక్ట్‌లలోని ప్రాథమిక భావనలు, సిద్ధాంతాలు, నియమాలు, ధర్మాలు(ప్రాపర్టీస్) వంటి అంశాలను చదువుతూఅన్వయ నైపుణ్యం అలవర్చుకోవాలి. అప్పుడే పరీక్షలో ఎలాంటి ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

ఉమ్మడి టాపిక్స్‌కు ఇలా

పేపర్-1లో ఉమ్మడి సబ్జెక్ట్‌లుగా పేర్కొన్న జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్‌లో రాణించడానికి ప్రత్యేకంగా ప్రిపరేషన్ సాగించాలి. జనరల్ అవేర్‌నెస్ కోసం చరిత్ర, భారత రాజ్యాంగం, భౌగోళిక శాస్త్రం, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ,కరెంట్ అఫైర్స్, స్టాక్ జీకే అంశాలను చదవాలి. ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ దశలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. జాగ్రఫీకి సంబంధించి దేశ భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, నదులు, అడవులు, పర్వతాలు, సముద్ర తీర ప్రాంతాలు తదితర అంశాలను తెలుసుకోవాలి. రాజ్యాంగానికి సంబంధించి ముఖ్యమైన అధికరణలు, ప్రకరణలు, తాజా సవరణలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ విషయంలో తాజాగా దేశశాస్త్ర, సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, రక్షణ వ్యవస్థ, ఇస్రో తదితర సంస్థల ప్రయోగాల గురించి అధ్యయనం చేయాలి.

- జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్‌లో రాణించడానికి.. నంబర్ సిరీస్, కోడింగ్ – డీకోడింగ్ నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్, స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమరీ, అబ్రివేషన్, క్లాసిఫికేషన్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 16.08.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తులో సవరణలకు అవకాశం:** ఆగస్టు 17, 18 తేదీల్లో..
- **పేపర్-1 (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) తేదీ:** అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు:** చీరాల, గుంటూరు,కాకినాడ,కర్నూలు,నెల్లూరు,రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	481	65,721
నిఫ్టీ ▲	136	19,517

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,909	▽	50
డోజోన్స్	35,066	▽	150
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,564	▲	35
డాక్స్	15,952	▲	58
షాంఘై	3,288	▲	8
నికాయ్	32,193	▲	33

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఎలా ఉన్నా 'బంగారమే'



- ఫిజికల్, డిజిటల్ బంగారంతో అనుకూలతలు
- అవసరాల్లో వేగంగా సొమ్ము చేసుకోవచ్చు
- తక్కువ వడ్డీకే బ్యాంక్ రుణాలు
- ఇంట్లో ఉంటే హోమ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి
- బ్యాంక్ లాకర్‌లోనూ భద్రమే
- అవసరమైనంత మేరకే భౌతిక బంగారం
- భవిష్యత్తు, పెట్టుబడుల కోసమైతే డిజిటల్

బంగారం అంటే ఆభరణాల రూపంలో కొనుగోలు చేయడమే ఎక్కువ మందికి తెలిసిన విషయం. కానీ, నేడు డిజిటల్ రూపంలోనూ ఎన్నో సాధనాలు అందుబాటులో ఉన్నాయి. సార్వభౌమ బాండ్లు, డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లు గురించి తెలిసింది తక్కువ మందికి. ఇటీవలి కాలంలో ప్రచారం కారణంగా డిజిటల్ బంగారం సాధనాల పట్ల అవగాహన పెరుగుతోంది. భౌతిక రూపంలో కంటే డిజిటల్ రూపంలో కొనుగోలు చేయడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతుంటారు. అలా అని బంగారం ఆభరణాలు, కాయిన్లు కొనడానికి దూరంగా ఉండాలని కాదు. డిజిటల్ సాధనాలు వచ్చినప్పటికీ బంగారం ఆభరణాల రూపంలో పెద్ద మొత్తంలో విక్రయం అవుతూనే ఉంది. నిజానికి డిజిటల్‌గానూ, భౌతికంగానూ ఏ రూపంలో ఉన్నప్పటికీ పసిడికి ఉన్న డిమాండ్ ఎంతో ప్రత్యేకం. భౌతిక బంగారంతోనూ కొన్ని అనుకూలతలు ఉన్నాయి. అవేంటో తెలియజేసే కథనమే ఇది.

బంగారం ఆభరణాలు, వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తయారీ చార్జీలు, తరుగు విధిస్తుంటారు. తయారీలో వృథాగా పోయే మొత్తాన్ని కస్టమర్ నుంచే వర్తకులు రాబడుతుంటారు. కనుక పెట్టుబడి కోసం చూసేవారు, భవిష్యత్తులో ఆభరణాల కోసమని కొంచెం, కొంచెం సమకూర్చుకునే వారు డిజిటల్ బంగారానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తుంటారు. డిజిటల్‌గా ఉంటే బంగారం భద్రంగా దాచుకునేందుకు లాకర్ల అవసరం ఉండదని చెబుతుంటారు. బంగారం తీసుకెళ్లి బ్యాంక్ లాకర్లలో పెట్టడం ద్వారా రక్షణ పొందొచ్చు. కానీ ఏటా లాకర్ నిర్వహణ చార్జీలు చెల్లించుకోవాల్సి వస్తుంది. డిజిటల్ రూపంలో ఉంటే కనిపించే ప్రయోజనాలు ఇవి. అలా అని భౌతిక బంగారం అవసరం లేదా? బంగారాన్ని భౌతిక రూపంలో కలిగి ఉంటే ప్రయోజనం లేదా? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం అన్ని అంశాలను సమగ్రంగా తెలుసుకోవాల్సిందే.

వినియోగ డిమాండ్

చారిత్రకంగా చూస్తే.. ఆభరణాల కోసం విస్తృతంగా వినియోగించడం వల్లే బంగారానికి ఈ స్థాయి విలువ సమకూరింది. అందుకే బంగారం ధరలను వినియోగం ప్రభావితం చేస్తుంటుంది. కాలక్రమేణా ఇన్వెస్టర్లు తమ సంపద విలువను కాపాడుకునే సాధనంగానూ ఇది మారిపోయింది. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కాచుకునే హెడ్జింగ్ సాధనంగా అవతరించింది. పెట్టుబడుల పరంగా డిజిటల్ బంగారాన్ని ఎంతో ప్రోత్సహించినప్పటికీ, అదే సమయంలో భౌతిక రూపంలో బంగారానికి అంతకంటే డిమాండ్ ఎక్కువేనని చెప్పుకోవాలి. అన్ని దేశాల సెంట్రల్ బ్యాంకులు తమ మారకం నిల్వల్లో కొంత మొత్తాన్ని భౌతిక బంగారం రూపంలోనే నిర్వహిస్తుంటాయి. ఆర్థిక అనిశ్చితుల్లో దీన్ని రక్షణ సాధనంగా పరిగణిస్తుంటారు. అందుకే దశాబ్దాలు గడిచినా బంగారం డిమాండ్ పెరుగుతోంది.



లిక్విడిటీ సాధనం

పెట్టుబడి సాధనం ఏదైనా కానీయండి, అందులో లిక్విడిటీకి ప్రాధాన్యం ఇవ్వడం అన్నింటికంటే ముఖ్యమైన అంశం అవుతుంది. బంగారం విషయంలో లిక్విడిటీకి (కావాల్సినప్పుడు వెంటనే నగదుగా మార్చుకోవడం) ఢోకా ఉండదు. ఆభరణాల వర్తకుడి వద్దకు వెళ్లి సులభంగా విక్రయించుకోవచ్చు. బంగారం డిజిటల్, భౌతికం ఏ రూపంలో ఉన్నా లిక్విడిటీకి ఇబ్బంది దాదాపుగా ఉండదు. ''బంగారం ఆభరణాలపై బ్యాంకులు తక్కువ వడ్డీ రేటుకే రుణాలు ఇస్తుంటాయి. అవే బ్యాంకులు వజ్రాలపై రుణాలను ఇవ్వవు'' అని ఇండియా బులియన్ అండ్ జ్యుయలర్స్ అసోసియేషన్ నేషనల్ సెక్రటరీ సురేంద్ర మెహతా తెలిపారు. భౌతిక బంగారం అయితే గంటలోపే దాన్ని విక్రయించి సొమ్ము చేసుకోవచ్చు. లేదంటే పనిదినాల్లో అయితే బ్యాంక్‌కు వెళ్లి గంట, రెండు గంటల్లోనే రుణాన్ని పొందొచ్చు. కానీ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో విక్రయించిన తర్వాత సొమ్ము చేతికి అందాలంటే రెండు రోజులు పడుతుంది. సావరీన్ గోల్డ్ బాండ్‌లో పెట్టుబడుల కాలవ్యవధి ఎనిమిదేళ్లు. కానీ, ఐదేళ్ల తర్వాతే విక్రయించుకోవచ్చు. సెకండరీ మార్కెట్లో ఎప్పుడైనా విక్రయించుకోవచ్చు కానీ లిక్విడిటీ చాలా తక్కువగా ఉంటుంది. కొన్ని బ్యాంకులు సావరీన్ గోల్డ్‌బాండ్‌పైనా రుణం ఇస్తున్నాయి. విలువ పరంగానే కాదు, భౌతిక బంగారంతో భావోద్వేగమైన బంధం కూడా ఉంటుందన్నది నిజం. ఒకవైపు పెట్టుబడికి, మరోవైపు ఆడంబర సాధనంగా వినియోగించే ఏకైక కమోడిటీ బంగారమే. భౌతిక రూపంలో బంగారాన్ని తమ గౌరవ చిహ్నంగానూ భావిస్తుంటారు. డిజిటల్ గోల్డ్‌తో ఇది రాదు.



ఊహించని పరిస్థితులు ఎదురైనప్పుడు బంగారం ఆదుకునే సాధనంగా పూర్వ కాలం నుంచి గుర్తింపు ఉంది. కరోనా వంటి విపత్తులు ఎదురైనప్పుడు చాలా మందిని ఈ బంగారమే ఆదుకుందని మెహతా పేర్కొన్నారు. బంగారాన్ని బులియన్ రూపంలో (ఆభరణం కాకుండా) కలిగి ఉంటే అప్పుడు తయారీ చార్జీల రూపంలో నష్టపోయేదేమీ ఉండదు. అవసరమైనప్పుడు బులియన్ గోల్డ్‌ను ఆభరణాలుగా మార్చుకోవచ్చు. అలా సమకూర్చుకున్న బులియన్ గోల్డ్, బంగారం కాయిన్లను భవిష్యత్తులో వివాహ సమయాల్లో ఆభరణాల కోసం వినియోగించుకోవచ్చు. భౌతిక బంగారానికి ఉన్న ఒకే ఒక రిస్క్ భద్రత. అందుకని భద్రత కోసం బ్యాంక్ లాకర్‌ను ఆశ్రయించొచ్చు. లేదంటే ఇంట్లోనే ఆభరణాలను ఉంచుకునేట్టు అయితే, హోమ్ ఇన్సూరెన్స్ తీసుకుని వాటికి రక్షణ కల్పించుకోవాలి. బ్యాంక్ లాకర్‌కు వార్షిక నిర్వహణ చార్జీలు, హోమ్ ఇన్సూరెన్స్ కోసం ప్రీమియం రూపంలో

ఆదుకునే సాధనం

కొంత వ్యయం చేయాల్సి వస్తుంది. కాకపోతే ఈ చార్జీలు మరీ అంత ఎక్కువా? అన్నది ఒక్కసారి సమీక్షించుకోవాలి. ఎందుకంటే ఇతర రూపాల్లోని బంగారంలోనూ కొంత వ్యయాలు ఉంటుంటాయి. ''డిజిటల్ గోల్డ్ రూపంలోనూ చార్జీలు ఉంటాయి. కనుక ఇక్కడ చార్జీలనేవి ప్రధాన అంశం కాబోదు. కాకపోతే, భౌతిక రూపంలోని బంగారాన్ని నిల్వ చేసుకోవడంలోనే సమస్యలు. కానీ, చాలా మందికి భౌతిక బంగారం సౌకర్యాన్నిస్తుంది. ఇది డిజిటల్ గోల్డ్ వల్ల రాదు'' అని మై వెల్త్ గ్రోత్ సంస్థ వ్యవస్థాపకుడు హర్షద్ చేతన్‌వాలా పేర్కొన్నారు. అన్ని ముఖ్య వేడుకలు, శుభ కార్యక్రమాలకు బంగారం ఆభరణాలను ధరించడాన్ని చాలా మంది గొప్పగా భావిస్తుంటారు. ప్రియమైన వారిని సంతోష పెట్టేందుకు బంగారం మించిన సాధనం లేదన్నది మెహతా అభిప్రాయం. డిజిటల్, వర్చువల్ రూపంలోని బంగారంతో అంత సంతోషం రాదు. కనుక బ్యాంక్ లాకర్ లేదా బీమా ప్రీమి యం అనేది పెద్ద అంశం కాబోదని చేతన్ వాలా అభిప్రాయపడ్డారు.

''అత్యవసర పరిస్థితులు ఏర్పడితే భౌతిక రూపంలోని బంగారాన్ని వెంటనే విక్రయించుకోవచ్చు. కాయిన్ లేదా ఆభరణం ఏ రూపంలో ఉందన్నది కీలకం అవుతుంది. ఆభరణాల రూపంలో అయితే జ్యుయలర్ కొంత మొత్తాన్ని చార్జీల రూపంలో మినహాయించుకోవచ్చు. డిజిటల్ గోల్డ్‌ను సైతం వెంటనే మానిటైజ్ (నగదుగా మార్చుకోవడం) చేసుకోవచ్చు. ఎక్స్ఛేంజ్‌లో విక్రయించినప్పుడు ఆ మొత్తం బ్యాంక్ ఖాతాకు వచ్చి జమ అవుతుంది'' అని చేతన్ వాలా వివరించారు.


డిజిటల్, భౌతిక బంగారం రెండింటిలోనూ అనుకూలతలు, ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. ఆభరణాలు, కాయిన్లు, అలాగే డిజిటల్ గోల్డ్ సాధనాల రూపంలో పెట్టుబడులు కలిగి ఉండాలన్నది కొందరు నిపుణుల ఇచ్చే సూచన. ఒక వ్యక్తి తన మొత్తం పెట్టుబడుల్లో 5–15 శాతం మధ్య పసిడికి కేటాయించుకోవచ్చు. ఉదాహరణకు పోర్ట్‌ఫోలియోలో 10 శాతాన్ని బంగారానికి కేటాయించారని అనుకుందాం. ఇప్పుడు ఈ

ఎంత.. ఏ రూపంలో..?

10 శాతంలో కొంత డిజిటల్ గోల్డ్, కొంత భౌతిక బంగారం రూపంలో ఉండాలి. భౌతికంగా అంటే ఆభరణాలా లేక కాయిన్లా? అన్నది తమ వ్యక్తిగత అవసరాలు, అభిరుచుల ఆధారంగానే నిర్ణయించుకోవాలి. ఆభరణాల రూపంలో అయితే అవసరమైన వాటికే పరిమితం కావాలి. మిగిలినది కాయిన్లు, బార్ల రూపంలో కలిగి ఉండాలి. దీనివల్ల తయారీ, తరుగు చార్జీలను ఆదా చేసుకోవచ్చు. భవిష్యత్తులో పిల్లల వివాహాల కోసం భౌతిక రూపంలోనే పసిడిని పోగేసుకునే వారు ఆభరణాలకు బదులు కాయిన్లు కొనుగోలు చేసుకోవడం నయం. ఎందుకంటే ఆభరణాల రూపంలో కొనుగోలు చేసినా, భవిష్యత్తులో వాటిని మళ్లీ కొత్త ఆభరణాల కోసం మార్చుకోవాల్సి వస్తుంది. కనుక భవిష్యత్తులో అదే రూపంలో వినియోగించనప్పుడు ఆభరణాలు తీసుకోవడం సరికాదు. అంతేకాదు భవిష్యత్తు కోసం లేదంటే అత్యవసరాల్లో ఆదుకుంటుందన్న ఉద్దేశంతో బంగారాన్ని సమకూర్చుకునే వారు ఆభరణాల రూపంలో కాకుండా వేరే మార్గాన్ని పరిశీలించాలి. ఎందుకంటే అవసరం వచ్చినప్పుడు విక్రయించేట్టు అయితే వర్తకులు ఆ ఆభరణాల నుంచి కొంత మొత్తాన్ని చార్జీల పేరుతో మినహాయించుకుంటారు. రోజువారీ ధరించేవి, పెళ్లిళ్లు, ముఖ్య వేడుకల సందర్భంగా ధరించేవి, ఇతరులకు బహుమానంగా ఇచ్చేవి మినహా మిగిలినదంతా డిజిటల్ సాధనాల రూపంలో తీసుకోవడాన్ని పరిశీలించాలి. పెట్టుబడి దృష్ట్యా డిజిటల్ సాధనాలు మెరుగైనవి. ఎందుకంటే వీటి క్రయ, విక్రయాలు చాలా సులభంగా, వేగంగా చేసుకోవచ్చు. డిజిటల్ గోల్డ్‌ను సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో ప్రతీ నెలా కొనుగోలు చేసుకుంటూ, అలా సమకూరిన పసడిని అవసరమైనప్పుడు ఆభరణాలుగా మార్చుకోవచ్చు. కొందరు అయితే ప్రతీ నెలా తమకు తోచినంత కాయిన్ల రూపంలో సమకూర్చుకుని, అవసరమైనప్పుడు వాటిని ఆభరణాలుగా మార్చుకుంటుంటారు. కనుక ప్రతి ఒక్కరూ తమ పోర్ట్‌ఫోలియోలో డిజిటల్, భౌతిక బంగారానికి చోటు కల్పించుకోవడం సరైనదేనన్నది నిపుణుల సూచన. డిజిటల్ సాధనాల్లో సావరీన్ గోల్డ్ బాండ్‌లో ఎలాంటి వ్యయాలు, ఖర్చులు ఉండవు. పైగా బంగారం పెట్టుబడి విలువపై ఎనిదేళ్ల పాటు ఏటా 2.5 శాతం వడ్డీ కూడా లభిస్తుంది. డిజిటల్‌గా ఇది మెరుగైన సాధనం.

జియో ఫైనాన్షియల్ లిస్టింగ్ త్వరలో..

- చైర్మన్‌గా అంబానీ పదవీ కాలం పెంపు
- రిలయన్స్ వార్షిక నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: రిటైల్, టెలికం రంగాల్లో సంచలనాలు సృష్టించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా ఆర్థిక రంగంలోనూ అదే తీరును కొనసాగించడంపై దృష్టి పెడుతోంది. త్వరలోనే జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయనున్నట్లు సంస్థ చైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడించారు. తద్వారా సంస్థ పూర్తి విలువను, సామర్థ్యాలను వెలికి తీసే అవకాశం ఉంటుందని సంస్థ వార్షిక నివేదికలో పేర్కొన్నారు. పర్యావరణ అనుకూల ఇంధనాలపైనా భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సాంప్రదాయ శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధన వనరులకు మళ్లడమనేది చరిత్రలోనే కీలక మైలురాయిగా నిలవగలదని అంబానీ తెలిపారు. అటు మరో అయిదేళ్ల పాటు అంబానీని సీఎండీగా కొనసాగించాలన్న ప్రత్యేక తీర్మానానికి షేర్‌హోల్డర్ల ఆమోదాన్ని కంపెనీ కోరింది. ప్రస్తుతం 66 ఏళ్లున్న అంబానీ.. సంస్థ నిబంధనల ప్రకారం 70 ఏళ్లకు రిటైర్ కావాలి. అంతకు మించిన కాలవ్యవధికి కొనసాగించదల్చుకుంటే దానికి ప్రత్యేక తీర్మానం చేయాల్సి ఉంటుంది.

హిమాద్రి స్పెషాలిటీ కెమికల్ | యూఎల్‌జేకే సెక్యూరిటీస్ | కొనొచ్చు

స్టాక్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 142 టార్గెట్: రూ. 185

ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో పటిష్ఠ ఫలితాలు సాధించింది. క్యూ1లో వార్షికంగా నికర లాభం 123 శాతం దూసుకెళ్లి రూ. 86 కోట్లను అధిగమించింది. త్రైమాసికవారీగా(గతేడాది క్యూ4(జనవరి–మార్చి)తో) సైతం 13 శాతం వృద్ధి చూపింది. నిర్వహణ లాభం(ఇబిటా) 87 శాతం జంప్‌చేసి రూ. 134 కోట్లను తాకింది. త్రైమాసికవారీగా 7 శాతం పుంజుకుంది. అయితే మొత్తం ఆదాయం 9 శాతం క్షీణించి రూ. 951 కోట్లకు పరిమితమైంది. త్రైమాసికంగానూ 8 శాతం వెనకడుగు వేసింది. కాగా.. ఇటీవల ఆ్రస్టేలియన్ స్టార్టప్ సికోనా బ్యాటరీ టెక్నాలజీస్‌లో 12.79 శాతం వాటాను సొంతం చేసుకుంది. క్యూ1లో స్థూల రుణ భారం రూ. 154 కోట్లు తగ్గి రూ. 682 కోట్లకు దిగివచ్చింది. అయితే నికర రుణ భారం రూ. 15 కోట్లు



పెరిగి రూ. 215 కోట్లకు చేరింది. నికర రుణ భారం స్వల్పంగా పెరిగినప్పటికీ స్థూల రుణ భారం భారీగా తగ్గడంతో బ్యాలన్స్‌షీట్ మరింత పటిష్ఠం కానుంది. ఈ ప్రభావంతో కంపెనీ రేటింగ్ ఔట్‌లుక్ స్థిరత్వం నుంచి సానుకూలానికి మెరుగుపడింది. వెరసి కంపెనీ ఆర్థిక పరిస్థితిపై ఔట్‌లుక్ మెరుగుపడినట్లు సంకేతాలు వెలువడ్డాయి. ఇక మరోవైపు కాంబే ప్రాజెక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో మొత్తం షేర్లను కొనుగోలు చేసే ప్రతిపాదనకు కంపెనీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పూర్తి వాటా కొనుగోలుతో జూలై చివరికల్లా కాంబే ప్రాజెక్ట్స్ సొంత అనుబంధ కంపెనీగా ఆవిర్భవించింది.

మెట్రోపొలిస్ హెల్త్‌కేర్ | కీనోట్ క్యాపిటల్స్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,359 టార్గెట్: రూ. 1,700

ఎందుకంటే: ఆరోగ్య పరిరక్షణ కంపెనీ మెట్రోపోలిస్ హెల్త్‌కేర్ 20 రాష్ట్రాలలో 220 పట్టణాలలో సేవలను విస్తరించింది. 175 ల్యాబ్‌లు, 2,921 పేషంట్ సర్వీస్ కేంద్రాలు, 754 అసిస్టెడ్ రిఫరల్ సెంటర్లు(ఏఆర్‌సీలు) నిర్వహిస్తోంది. 4,000కుపైగా క్లినికల్ లేబొరేటరీ పరీక్షలు, ప్రొఫైల్స్ ఆఫర్ చేస్తోంది. కంపెనీ మొత్తం ఆదాయంలో 2016లో 38 శాతంగా నమోదైన బిజినెస్ టు కన్జూమర్(బీటూసీ) బిజినెస్ వాటా 2023కల్లా 59 శాతానికి ఎగసింది. ఈ విభాగంపై ప్రత్యేక దృష్టికారణంగా బీటూసీ సంస్థగా ఆవిర్భవించింది. భవిష్యత్ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా అసెట్‌లైట్(తక్కువ పెట్టుబడుల) విధానంలో కార్యకలాపాలు విస్తరిస్తోంది. దీనిలో భాగంగా ఇతర సంస్థల కొనుగోళ్ల ద్వారా వృద్ధికి బాటలు వేసుకోనుంది. దీంతో ప్రధాన విభాగం 15 శాతం పురోగతిని సాధించవచ్చని అంచనా. 2022లో కంపెనీ 90:30



విస్తరణ ప్రణాళికలకు తెరతీసింది. తద్వారా 30 నెలల్లోగా 90 ల్యాబ్‌లు, 1,800 కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. టైర్–2, టైర్–3 నగరాలలో అందుబాటు ధరల్లో పరీక్షల సౌకర్యాలను కల్పించడం ద్వారా అదనపు అవకాశాలను సృష్టించుకోనుంది. వెరసి లేబొరేటరీల ఏర్పాటు ప్రక్రియకు జోష్‌నివ్వడం ద్వారా వేగవంత మానిటైజేషన్‌కు తెరతీయనుంది. ఇటీవల సొంతం చేసుకున్న హైటెక్ డయాగ్నోస్టిక్ సెంటర్.. కోవిడ్ తదుపరి 35 శాతం వృద్ధిని అందుకుంది. ఈ బాటలో కంపెనీ మరిన్ని కొనుగోళ్లపై దృష్టిసారించడం ద్వారా వేగవంత వృద్ధికి బాటలు వేసుకోనుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

డైసన్ హెయిర్ కేర్ టెక్నాలజీస్ ప్రచారకర్తగా దీపికా పదుకొనే

హైదరాబాద్: గ్లోబల్ టెక్నాలజీ సంస్థ డైసన్ హెయిర్ కేర్ టెక్నాలజీస్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా నటి దీపికా పదుకొనేను నియమించుకుంది. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికి శిరోజాల సంరక్షణపై కనీస అవగాహన అవసరం. ఆరోగ్యకరమైన హెయిర్ స్టైల్ కోసం ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలను చేస్తున్న డైసన్‌కు బ్రాండ్ అంబాసిడర్ వ్యవహరిస్తుండటం సంతోషంగా ఉందని దీపికా అన్నారు. ''మా బ్రాండ్‌కు దీపికా మరింత గుర్తింపు తీసుకొస్తుంది. అధునాతన కేశాలంకరణ పరికరాల మార్కెట్‌ను మరింత విస్తరించుకునేందుకు ఆమెకు ఉన్న ఆకర్షణ మాకు కలిసొస్తుంది'' అని డైసన్ ఇండియా ఎండీ అంకిత్ జైన్ తెలిపారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

7-8-2023	
విశాఖ	450–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440–00
విజయవాడ	440–00
రిటైల్ ధర (డజను)	72.00
6-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	420–00
వరంగల్	422–00
రిటైల్ ధర	4.85

జీ–సెక్, కార్పొరేట్ బాండ్.. ఏది మెరుగు?

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్‌ఎస్‌ఎస్)లో ఒక వ్యక్తికి పెట్టుబడి ఉంది. అయితే మూడేళ్ల లాకిన్ పీరియడ్ నిండకుండానే అతడు మరణించాడు. దీంతో ఈఎల్‌ఎస్‌ఎస్ యూనిట్లను నామినీకి బదిలీ చేశారు. మూడేళ్ల లాకిన్ పీరియడ్ పూర్తి కాకపోయినా ఇప్పుడు నామినీ వాటిని విక్రయించుకోవచ్చా?
– బుదేరియా అచ్చర్

దురదృష్టవశాత్తూ యూనిట్ హోల్డర్ మరణించినట్టయితే నామినీ లేదా చట్టబద్ధమైన వారసులు ఈఎల్‌ఎస్‌ఎస్ ఫండ్ యూనిట్లను విక్రయించుకోవచ్చు. మరణించిన వ్యక్తి పెట్టుబడి పెట్టిన నాటి నుంచి ఏడాది పూర్తయిన తర్వాతే ఇందుకు అవకాశం ఇస్తారు. నామినీ లేదా వారసులు ఆ పెట్టుబడి కోసం మూడేళ్ల లాకిన్ పీరియడ్ ముగిసే వరకు వేచి చూడాల్సిన అవసరం లేదు. చాలా వరకు మ్యూచువల్ ఫండ్స్ పథకాలకు లాకిన్ పీరియడ్ అనేది ఉండదు. కానీ ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాలకు మూడేళ్ల లాకిన్ ఉంటుంది. పెట్టుబడిదారుడికి కేటాయించిన తేదీ నుంచి మూడేళ్లు అమలవుతుంది. ఈ మూడేళ్ల తర్వాతే సదరు ఇన్వెస్టర్ తన పెట్టుబడిని వెనక్కి తీసుకోగలరు. యూనిట్ హోల్డర్ మరణించిన సందర్భాల్లో మాత్రం నామినీ లేదా చట్టబద్ధ వారసులు వాటిని క్లెయిమ్ చేసుకోవచ్చు. దీన్ని ట్రాన్స్‌మిషన్ అని చెబుతారు. నామినీ లేదా వారసులకు యూనిట్లు బదిలీ అయిన వెంటనే వాటిని విక్రయించుకోవచ్చు. లేదా వేరొకరికి బదిలీ చేసుకోవచ్చు. లేదా తనఖా కూడా పెట్టుకోవచ్చు. ఉదాహరణకు ఎక్స్ అనే వ్యక్తి 2021లో ఈఎల్‌ఎస్‌ఎస్ పథకంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత 2022లో మరణించాడని అనుకుంటే.. అప్పుడు నామినీ లేదా వారసులు తమ పేరిట సదరు యూనిట్లను మార్పించుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వాటిని అమ్ముకోవడానికి

Q & A




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

అవకాశం ఉంటుంది. బదిలీ అయిన తర్వాత నుంచి ఏడాది ఆగక్కర్లేదు. మొదట పెట్టుబడి పెట్టిన తేదీ నుంచి ఏడాది కాలం పూర్తయితే చాలు.

ఎన్‌పీఎస్‌లో జీ సెక్యూరిటీలు (ప్రభుత్వ సెక్యూరిటీలు) కంటే కార్పొరేట్ ఫండ్ ఆప్షన్ అన్ని వేళలా మెరుగైనదేనా? ఎన్‌పీఎస్ ఫండ్ మేనేజర్లు భద్రత ఉండే కార్పొరేట్ బాండ్లలోనే ఇన్వెస్ట్ చేస్తారా?
– జగన్నాథ్ గోస్వామి

కార్పొరేట్ బాండ్ ప్లాన్లు సాధారణంగా మెరుగైన రాబడులు ఇస్తాయి. అయితే కార్పొరేట్ బాండ్ లేదా ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎంపిక ఎప్పుడైనా కేవలం రాబడుల అంశం ఆధారంగా ఉండకూడదు. రిస్క్ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని చూడాలి. పెట్టుబడుల క్రెడిట్ నాణ్యతను చూడాలి. మారుతున్న వడ్డీ రేట్లకు ఏ మేరకు ప్రభావితం అవుతాయనేది చూడాలి. నాణ్యత పరంగా చూస్తే ప్రభుత్వం బాండ్ ప్లాన్లు మెరుగైనవి. అవి సావరీన్ బాండ్లలోనే ఇన్వెస్ట్ చేస్తాయి. అవి అంతర్లీనంగా ప్రభుత్వ గ్యారంటీతో ఉంటాయి. కార్పొరేట్ బాండ్ ప్లాన్లు ఏఏఏ రేటెడ్, ఏఏప్లస్, ఏ1ప్లస్ రేటెడ్ బాండ్లలో పెట్టుబడులు పెడుతుంటాయి. టర్మ్ డిపాజిట్లను సైతం ఎంపిక చేసుకుంటాయి. ఏఏఏ రేటెడ్ సాధనం అయినప్పటికీ, తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో చెల్లింపుల్లో విఫలం కావచ్చు. అందుకుని పెట్టుబడికి భద్రత దృష్ట్యా కార్పొరేట్ ప్లాన్ల కంటే ప్రభుత్వ సెక్యూరిటీలే మెరుగైనవి. బాండ్లు అన్నవి మారే వడ్డీ రేట్ల ప్రభావానికి లోనవుతుంటాయి. పోర్ట్‌ఫోలియోలో ఉన్న బాండ్ల కాల వ్యవధి ఆధారంగా వడ్డీ రేట్ల అస్థిరతల ప్రభావం ఉంటుంది. కార్పొరేట్ ప్లాన్‌లో ఒక్కో బాండ్ సగటు కాల వ్యవధి ఐదు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. ప్రభుత్వ ప్లాన్ అయితే కాల వ్యవధి సాధారణంగా పదేళ్లు ఉంటుంది. అందుకే వడ్డీ రేట్ల మార్పులకు ప్రభుత్వ ప్లాన్లు మరింత ఒత్తిడికి లోనయ్యే స్వభావంతో ఉంటాయి. దీర్ఘకాల సాధనం కనుక ఈ అస్థిరతలకు ఆందోళన చెందక్కర్లేదు. కనుక కార్పొరేట్ డెట్ ప్లాన్ అన్నివేళలా ప్రభుత్వ సెక్యూరిటీల కంటే మెరుగైనది అని చెప్పలేం.





???

ఏమిటివి? ప్రశ్నార్థకాలు!

ఎందుకు.. ఏమిటి.. ఎలా..
ఇలా ఎన్నో ఎన్నెన్నో ప్రశ్నలు
తెలిసినదైనా, తెలియనిదైనా..
మనం ఏదైనా అడిగామంటే అది
ప్రశ్నే..

ప్రశ్నల గురించి ఏమిటీ ఉపోద్ఘాతం
అని చిరాకు వస్తోందా?..
ఎందుకంటే ఆకాశం మనను
ప్రశ్నిస్తోంది. ఎక్కడో సుదూరాన ఉన్న
నక్షత్ర మండలం నుంచి..
'హలో.. అక్కడెవరైనా ఉన్నారా?'
అన్నట్టుగా ప్రశ్నార్థకాన్ని విసురుతోంది.
అదేమిటో చూద్దామా..

ఆకాశం వేసిన 'ప్రశ్న'

హలో.. ఎవరైనా ఉన్నారా?

అంతరిక్షాన్ని జల్లెడ పడుతుండగా..

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ప్రఖ్యాత 'జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ (జేడబ్ల్యూఎస్‌టీ)' కొన్ని నెలలుగా అంతరిక్షాన్ని జల్లెడ పడుతోంది. అంతరిక్షంలోని సుదూర నక్షత్ర మండలాలను పరిశీలిస్తూ, చిత్రాలు తీస్తోంది. ఈ క్రమంలో తాజాగా తీసిన ఓ ఫొటో కలకలం రేపుతోంది. ఆ చిత్రంలో అచ్చంగా ఓ ప్రశ్నార్థకం (క్వశ్చన్ మార్క్) కనిపించడమే దీనికి కారణం.



ఏమిటీ క్వశ్చన్ మార్క్?

అంతరిక్షంలో భూమికి సుమారు 1,470 కాంతి సంవత్సరాల దూరంలో.. 'వేల'గా పిలిచే నక్షత్ర మండలం (కాన్‌స్టలేషన్)లో ఈ ప్రశ్నార్థకం ఉన్నట్టు నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. కొత్తగా ఏర్పడిన నక్షత్రాల జంట 'హర్‌బిగ్–హారో'లకు సమీపంలో ఇది కనిపిస్తోందని వెల్లడించారు. రెండు నక్షత్రాల గుంపులు (గెలాక్సీలు) ఢీకొని, కలసిపోతున్న సమయంలో ఇలా ప్రశ్నార్థకంలా ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అందులో దిగువన చుక్కలా ఉన్నది పెద్ద గెలాక్సీ అని.. చిన్న గెలాక్సీలోని నక్షత్రాలు, అంతరిక్ష పదార్థాలు దాని ఆకర్షణకు గురై ప్రయాణిస్తూ ప్రశ్నార్థకంలా కనిపిస్తున్నాయని వివరిస్తున్నారు.

మనకు సందేశమేం కాదులే!

అంతరిక్షంలో ప్రశ్న గుర్తు మనకు ఏలియన్లు ఇచ్చిన సందేశమని కొందరు.. దేవుడు ఇలా మనను ప్రశ్నిస్తున్నారని ఇంకొందరు.. ఇలా సోషల్ మీడియాలో తీవ్రంగా చర్చ జరుగుతోంది. అయితే.. ''అంతరిక్షంలో లక్షల కోట్ల గెలాక్సీలు ఉన్నాయి. వాటిలో చాలా సార్లు ఇలా అక్షరాలు, వస్తువుల రూపంలో కనిపించాయి. ఈ ప్రశ్నార్థకం కూడా రెండు గెలాక్సీలు కలసిపోతున్నప్పుడు ఏర్పడిన ఆకారమే. మనకు ఏలియన్ల సందేశమేమీ కాదు..'' అని అమెరికాలోని ససెక్స్ యూనివర్సిటీ అంతరిక్ష విభాగం ప్రొఫెసర్ స్టీఫెన్ విల్కిన్స్ పేర్కొన్నారు.

సాక్షి సెంట్రల్ డెస్క్

అసెంబ్లీ సమావేశాలకు తెర

- ముగిసిన తెలంగాణ రెండో అసెంబ్లీ ఆఖరి సమావేశాలు
- 12 ప్రభుత్వ బిల్లులు ఆమోదం. 4 అంశాలపై లఘు చర్చ



సాక్షి, హైదరాబాద్: నాలుగు రోజుల పాటు కొనసాగిన తెలంగాణ శాసనసభ ఎనిమిదో విడత సమావేశాలు ఆదివారం ముగిశాయి. తెలంగాణ రెండో శాసనసభ (2018–23)కు ఇవే చివరి విడత సమావేశాలు కావడంతో సభ్యులు భారంగా వీడ్కోలు పలికారు. చివరి రోజు సమావేశంలో 'ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల సేవల విలీనం'బిల్లు తీవ్ర ఉత్కంఠ నడుమ సభ ముందుకు వచ్చి ఆమోదం పొందింది. ఆదివారం ఉదయం ప్రశ్నోత్తరాలు లేకుండా నేరుగా జీరో అవర్‌తో ప్రారంభమైన సభ ఆ తర్వాత 'తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం – స్వరాష్ట్రంలో సాధించిన ప్రగతి'అనే అంశంపై జరిగిన లఘు చర్చకు సీఎం కె.చంద్రశేఖర్‌రావు 2.30 గంటల పాటు సవివరంగా సమాధానం ఇచ్చారు. అనంతరం మూడు ప్రభుత్వ బిల్లుల ఆమోదం, గద్దర్‌కు సంతాపం ప్రకటించిన తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.

ఉభయ సభలు హుందాగా సాగాయి: వేముల

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రజాస్వామ్య బద్ధంగా, సభ్యుల సస్పెన్షన్లు లేకుండా సాఫీగా జరిగాయని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

దేశంలోనే నంబర్‌వన్ అనే రీతిలో నడిపాం: పోచారం

2019 జనవరి 18న శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాను అందరి సహకారంతో దేశంలోనే నంబర్ వన్ అనే రీతిలో సభను నడిపానని పోచారం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఉద్యోగులను ప్రభుత్వ సేవల్లోకి తీసుకోవడం) బిల్లు 2023 శాసనసభ ఆమోదించడం పట్ల స్పీకర్ పోచారం, సీఎం కేసీఆర్‌కు టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ అసెంబ్లీలోని వారి చాంబర్లలో కలిసి ధన్యవాదాలు తెలిపారు.

సురవరం ప్రతాపరెడ్డిపై వెలువరించిన 'ససురవరం–తెలంగాణం' మూడు సంకలనాలను శాసనసభలో సీఎం కేసీఆర్‌కు వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అందజేశారు. 4 రోజుల పాటు జరిగిన సమావేశాల్లో శాసనసభ 26.45 గంటలు, శాసన మండలి 23.10 గంటల పాటు సమావేశమైంది.

అసెంబ్లీ , మండలి సమావేశాలు ఇలా...

	శాసనసభ	మండలి
సభ జరిగిన రోజులు	4	4
సమయం (గంటల్లో)	26.45	23.10
ప్రశ్నలు	20	20
అనుబంధ ప్రశ్నలు	38	–
సభ్యుల ప్రసంగాలు	44	55
ఆమోదించిన బిల్లులు	12	12
స్వల్పకాలిక చర్చలు	04	04

పోడు భూములు ఎప్పటికీ అటవీ భూములే



సాక్షి, హైదరాబాద్: పోడు భూములకు పట్టాలు జారీ చేసినా, అవి ఎప్పటికీ అటవీ భూములుగానే ఉంటాయని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. అటవీ భూములపై సుప్రీంకోర్టు జారీ చేసిన పలు తీర్పులతో పాటు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన అటవీ హక్కుల చట్టం (ఆర్ఓఆర్) కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ధరణిలో యాజమాన్య హక్కులు మార్చడం సాధ్యం కాదని తెలిపారు. తెలంగాణ ప్రగతిపై ఆదివారం శాసనసభలో కాంగ్రెస్‌పక్ష నేత భట్టి విక్రమార్క పోడు రైతుల సమస్యలను లేవనెత్తి మాట్లాడుతుండగా, సీఎం మధ్యలో జోక్యం చేసుకుని ఈ మేరకు స్పష్టతనిచ్చారు. కాంగ్రెస్ హయాంలో పోడు పట్టాలు పొందిన వారికి కొత్తగా పట్టాలు జారీ చేయాల్సిన అవసరం లేదని, నాడు పట్టాలు పొందని వారికి మాత్రమే ఇప్పుడు పట్టాలిచ్చినట్లు సీఎం వివరించారు. 4 లక్షల ఎకరాల్లోని పోడు రైతులకు కరెంటు లైన్లు, త్రీఫేజ్ కరెంట్, రైతుబంధు వర్తింపజేస్తామని వెల్లడించారు.

బహుజన చక్రవర్తి పాపన్నగౌడ్

కందుకూరులో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ

కందుకూరు: మొగల్ పాలకుల దౌర్జన్యాలు, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సైన్యాన్ని ఏర్పాటు చేసి 33 కోటలను జయించి, గోల్కొండ కోటను సైతం ఆరు నెలల పాటు పాలించిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కందుకూరులో గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సిద్ధాగౌడ్, సీనియర్ నాయకుడు అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ విగ్రహాన్ని మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నతో కలిసి ఆయన ఆవిష్కరించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గొలుసు కట్టు చెరువులను నిర్మించిన ఘనత పాపన్నకే దక్కుతుందన్నారు. ఆయన జయంతి, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ నాయకుడు వీరేందర్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న మంత్రి సబిత. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ , గోరటి వెంకన్న

రబ్బరు బుల్లెట్లకు కూడా ఒప్పుకోలేదు

- తెలంగాణ ఉద్యమ సమయంలో బలప్రయోగం సోనియా వద్దనేవారు
- మీడియాతో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి చిట్‌చాట్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంపై సోనియా గాంధీ చాలా సానుకూలంగా ఉండేవారని, ఉద్యమం ఎంతటి తీవ్ర రూపం దాల్చినా బలప్రయోగం చేయవద్దని, కనీసం రబ్బరు బుల్లెట్లు కూడా ఉద్యమకారులపై ప్రయోగించకూడదని ఆమె కచ్చితమైన ఆదేశాలిచ్చారని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి చెప్పారు. ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. ఉద్యమం ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డికి సోనియా గాంధీ ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పారని వెల్లడించారు. సమైక్య రాష్ట్ర సాధన ఉద్యమాన్ని కూడా బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్లాలే తప్ప అణచివేతలు వద్దని ఆదేశించారన్నారు.

వైఎస్ దిగ్రేట్..

కాగా, తనకు విమానం ఎక్కడం ఇష్టం ఉండదని, అయినా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆదేశాలతో ఒకసారి ఎక్కానని జగ్గారెడ్డి చెప్పారు. ఏ విషయాన్నయినా ఫాలోఅప్ చేయడంలో వైఎస్ దిగ్రేట్ అని, ఆయన సీఎం అవడానికి ఎంత కష్టపడ్డారో, అయ్యాక కూడా అంతే కష్టపడ్డారని చెప్పారు. వైఎస్ తనకు అప్పగించిన పనులను దిగ్విజయంగా పూర్తి చేయడం చాలా సంతోషానిచ్చేదని అన్నారు. కానీ, కాంగ్రెస్ పార్టీలో అలాంటి నాయకులు ఇప్పుడు లేకపోవడం దురదృష్టకరమని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని, ఉమ్మడి రాష్ట్రంలోనే తనకు మంత్రిపదవి ఆఫర్ చేసినా వద్దన్నానని చెప్పారు. కాంగ్రెస్ ఈసారి అధికారంలోకి వస్తుందని, అందరూ కలసి పనిచేయాలని ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్ తమకు దిశానిర్దేశం చేశారన్నారు.

సీఎల్పీ కార్యాలయానికి మంత్రి వేముల

ఆదివారం ఉదయం అసెంబ్లీ ప్రారంభమైన తర్వాత కాంగ్రెస్ సభ్యులు సభలోకి వెళ్లకపోవడంతో శాసనసభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి.. సీఎల్పీ కార్యాలయానికి వచ్చారు. లాబీల్లో నుంచి ఎమ్మెల్యే జగ్గారెడ్డిని తీసుకుని ఆయన సీఎల్పీకి వచ్చారు. ఆ సమయంలో సీఎల్పీ నేత భట్టి, శ్రీధర్, వీరయ్యలు అక్కడే ఉన్నారు. దీంతో సభకు వచ్చి అసెంబ్లీ సమావేశాలు సజావుగా నడిచేందుకు సహకరించాలని ప్రశాంత్‌రెడ్డి వారిని కోరారు. శనివారం కేటీఆర్ మాట్లాడిన సందర్భంగా తమను జంతువులతో పోల్చడం బాధ కలిగించిందని, ఈ విషయంలో స్పీకర్‌ను కలుస్తామని చెప్పారు. కానీ, ప్రశాంత్‌రెడ్డి సర్దిచెప్పి వారిని సభ లోపలికి తీసుకెళ్లడం గమనార్హం.

నిలోఫర్‌లో దారుణం

- మూడు రోజుల శిశువుపై వ్యక్తి పడడంతో మృతి

నాంపల్లి: నవజాత శిశు సంరక్షణా కేంద్రం నిలోఫర్‌లో అపశృతి చోటుచేసుకుంది. రోగి సహాయకుడు మీద పడటంతో మూడు రోజుల మగ శిశువు మృతిచెందాడు. ఈ సంఘటన నిలోఫర్ ఆసుపత్రి అత్యవసర సేవల విభాగంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా శిశువు మృతదేహాన్ని హుటాహుటిన ఆసుపత్రి గేట్లు దాటించేశారు. దీంతో శిశువు బంధువులు ఆసుపత్రి ఎదుటే ఆందోళనకు దిగారు. ఆసుపత్రి సిబ్బంది పండంటి మగ శిశువును పొట్టన పెట్టుకున్నారని బోరున విలపించారు. న్యాయం చేయాలని బాధితులు పట్టుబట్టడంతో అక్కడ కాసేపు తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. శిశువు మృతికి కారణమైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు సర్దిచెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పరిగి ప్రాంతానికి చెందిన పుష్పమ్మ అనే మహిళ మూడు రోజుల క్రితం పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. ఆమెకు ఒకటిన్నర కేజీల బరువు ఉన్న శిశువు జన్మించడంతో పరిగి ప్రభుత్వాసుపత్రి వైద్యులు నిలోఫర్ ఆసుపత్రికి మెరుగైన వైద్య సేవల నిమిత్తం తీసుకెళ్లాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు బంధువులు మగ శిశువును రెండు రోజుల క్రితం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఎన్ఐసీయూ ఇంక్యుబేటర్‌లో చికిత్స పొందుతుండగా వార్డులోని రోగి సహాయకుడు ఒకరు ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు కాలుజారి శిశువు మీద పడ్డాడు. దీంతో ఆ శిశువు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం శిశువు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో శిశువు మీద పడ్డ రోగి సహాయకులు ఎవరనే విషయం తెలుస్తుందని, సీసీ కెమెరాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

చేనేత మగ్గంపై చెరిగిపోని చిత్రాలు

చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ అద్భుతమైన చీర



వెండిపోగులతో నేసిన పట్టు పీతాంబరం చీర

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ చేనేత మగ్గంపై అద్భుతమైన చిత్రాలతో కూడిన చీరను నేశారు. వెండిపోగులతో కూడిన చీరను చేనేత మగ్గంపై 18 రోజులు డిజైన్ చేసి, మరో 23 రోజులు శ్రమించి సిద్ధం చేశారు హరిప్రసాద్, రేఖ దంపతులు. వేములవాడ ఆలయ ప్రాకారం (కమాన్), ఆలయంలో కోడెమొక్కులు, నెమలి, సింహం చిత్రాలతో కూడిన పట్టు పీతాంబరాన్ని ఆవిష్కరించారు. 108 కమాన్ చిత్రాలు, 108 నెమలి, సింహం చిత్రాలు చీరపై నేశారు. 6.30 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పుతో కట్టుకోవడానికి అనువుగా ఉండేలా 723 గ్రాముల బరువుతో చీరను నేశారు. ఇందులో 226 గ్రాముల వెండిపోగులు, 497 గ్రాముల పట్టు పోగులు, బోళా శంకరుని నీలపురంగులో రాజన్న సిరిపట్టు చీరను తయారు చేశారు. హరిప్రసాద్ గతంలోనూ అగ్గిపెట్టెలో ఇమిడే చీరను, దబ్బనంలో దూరే చీరను, జీ–20 లోగోను, వస్త్రంపై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రాన్ని నేశారు. ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్‌తో హరిప్రసాద్ జీ–20 లోగో అంశాన్ని ప్రస్తావించి మాట్లాడటం విశేషం. ఇటీవల భద్రాచలం సీతమ్మ వారికి పట్టుపీతాంబరం చీరను నేసి ఇచ్చారు.

బుద్వేల్ ప్రీబిడ్‌కు అనూహ్య స్పందన

- 100 ఎకరాల హెచ్ఎండీఏ లేఅవుట్‌లో 14 ప్లాట్లు విక్రయానికి
- ప్లాట్ సైజు కనీసం 3.47 ఎకరాలు, గరిష్ఠం 14.3 ఎకరాలు

సాక్షి, హైదరాబాద్: బుద్వేల్ ప్లాట్లకూ అనూహ్యమైన స్పందన లభించింది. రాజేంద్రనగర్ సమీపంలో ఉన్న బుద్వేల్‌లో భూముల అమ్మకంపై హెచ్ఎండీఏ ఆదివారం నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి పెద్దసంఖ్యలో కొనుగోలుదారులు హాజరయ్యారు. ప్రస్తుతం బుద్వేల్ లేఅవుట్‌లో 100 ఎకరాల్లో 14 ప్లాట్లకు హెచ్ఎండీఏ ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించనుంది. కనీసం 3.47 ఎకరాలు నుంచి గరిష్ఠంగా 14.3 ఎకరాల చొప్పున ఈ ప్లాట్లు ఉన్నాయి. బుద్వేల్ ప్లాట్ల వేలంపై ఆదివారం టీ–హబ్‌లో హెచ్ఎండీఏ నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశానికి హైదరాబాద్‌లోని మధ్యతరగతి బిల్డర్లు, కన్‌స్ట్రక్చర్ కంపెనీలతో పాటు దేశంలో గుర్తింపు కలిగిన బడా రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. హెచ్ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్ కిషన్‌రావు, చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి బుద్వేల్ లేఅవుట్ ప్రాముఖ్యతను వివరించారు. కొందరు డెవలపర్లు, రియల్ ఎస్టేట్ కంపెనీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశానికి హెచ్ఎండీఏ సెక్రెటరీ చంద్రయ్య, డైరెక్టర్ (ప్లానింగ్) శ్రీనివాస్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఎస్.కే మీరా, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఓఎస్డీ రాంకిషన్, బుద్వేల్ సైట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ సత్యనారాయణ హాజరయ్యారు.

సిద్దిపేటలో ఉత్సాహంగా హాఫ్ మారథాన్

- జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి హరీశ్
- దేశంలోనే తొలిసారి ప్లాస్టిక్ రహితంగా నిర్వహణ

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేటలో రంగనాయకసాగర్ వేదికగా ఆదివారం జరిగిన హాఫ్ మారథాన్‌లో దేశం నలుమూలల నుంచి వచ్చిన రన్నర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 'సిద్దిపేట అన్నింటిలో మేటి.. నేడు హాఫ్ మారథాన్‌లోనూ బెస్ట్‌గా నిలిచింది'అని అన్నారు. అనంతరం విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కాగా, దేశంలోనే తొలిసారిగా ప్లాస్టిక్ రహిత హాఫ్ మారథాన్‌ను సిద్దిపేటలో నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళా విభాగంలో సూర్యాపేటకు చెందిన ఉమ, పురుషుల విభాగంలో నాగర్‌కర్నూల్‌కు చెందిన రమేశ్ చంద్ర ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. 10కే రన్ మహిళా విభాగంలో ప్రథమ బహుమతి నాగర్‌కర్నూల్‌కు చెందిన స్వప్న, పురుషుల విభాగంలో మహారాష్ట్రకు చెందిన సునీల్‌కుమార్ సాధించారు. కాగా, హైదరాబాద్ నుంచి 100 కిలోమీటర్లు రన్ చేసుకుంటూ వచ్చిన శ్రీకాంత్‌ను, అలాగే హైదరాబాద్ నుంచి సైక్లింగ్ చేసుకుంటూ వచ్చిన నేచర్ క్యూర్ ఆస్పత్రి డాక్టర్ నాగలక్ష్మిలను మంత్రి సత్కరించారు. 10 కిలోమీటర్ల పరుగులో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పాల్గొని 1.06 గంటల్లో పూర్తి చేశారు. హాఫ్ మారథాన్ (21.1కిలోమీటర్లు)లో 400 మంది, పది కిలోమీటర్ల రన్‌లో 550, 5 కిలోమీటర్ల రన్‌లో 4వేల మంది పాలుపంచుకున్నారు. సిద్దిపేట సీపీ శ్వేత, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పాల్గొన్నారు.



హాఫ్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.